ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 17, నవంబరు 2024

నరకదారులు

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని అనేక రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. చాలాచోట్ల మాగాణిని తలపిస్తున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లకు ఎక్కడా తట్టెడు మట్టి కూడా పోయలేదు. దీంతో అవి దారుణంగా తయారయ్యాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల దుస్థితిని గుర్తించింది. అధికారులను ప్రతిపాదనలు కోరింది. దీంతో జిల్లాలో రోడ్ల మరమ్మతులకు రూ.373.68 కోట్లు అవసరమని వారు నివేదించారు.



గోతులతో ఉన్న పొతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు

- దారుణంగా పంచాయతీరాజ్ రోడ్లు
- వర్షాలకు మరింత అధ్వానం
- ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకోని ఫలితం
- నిత్యం ఇబ్బందిపడుతున్న ప్రజలు
- మరమ్మతుల కోసం రూ.373.68 కోట్లు కోరిన అధికారులు

ఒంగోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్క రోడ్డు బాగు గురించి పట్టించుకున్న పాపానపోలేదు. కొత్త రోడ్లు వేయలేకపోయినా కనీసం ఉన్న వాటి మరమ్మతులు కూడా మరిచారు. ప్రత్యేకించి పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రోడ్లపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఫలితంగా జిల్లాలోని ఏప్రాంతంలో చూసినా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ప్రత్యేకించి తారురోడ్లు గజానికో గుంత, ఫర్లాంగుకు పది గోతులుగా మారి గ్రామీణ ప్రాంత ప్రజలు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. అధిక శాతం తారురోడ్లు అధ్వానంగా మారాయి. ప్రస్తుత ప్రభుత్వం రోడ్ల మరమ్మతులపై దృష్టిసారించి గుంతల పూడ్చివేతను అత్యవసర పనిగా చేపట్టింది. అయితే జిల్లాలో ఆర్‌అండ్‌బీ పరిధిలోని గుంతల పూడ్చివేత పనులకు రూ.25కోట్లు

మిగతా 6వ పేజీలో



అధ్వానంగా ఉన్న పెదరావిపాడు-నాయుడుపాలెం పంచాయతీ రాజ్ రహదారి

ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గోతులమయమయ్యాయి. పెదరావిపాడు నుంచి నాయుడుపాలెం, రెడ్డినగర్ నుంచి బసవాపురం వెళ్లే రహదారులపై ప్రయాణం అంటేనే ప్రజలు, వాహనచోదకులు హడలిపోతున్నారు.



మర్లపాడు-ఒంగోలు మధ్యన బురదమయంగా ఉన్న రోడ్డు

గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో దర్శి నియోజకవర్గంలో పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రధానంగా పొతకమూరు-పాపిరెడ్డిపల్లె రహదారి దారుణంగా తయారైంది. నియోజకవర్గంలో మొత్తం 127.53 కి.మీ మేర రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు ఇటీవల గుర్తించారు. మరమ్మతుల కోసం రూ.33.90 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో ఆ నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

టంగుటూరు మండలంలోని మర్లపాడు-ఒంగోలు కొండల మీదుగా వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు 1.6 కి.మీ గుంతలమయమైంది. చిన్నపాటి వర్షం కురిసినా పూర్తిగా బురద నీటితో నిండిపోతోంది. ఈ రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు.

కొండపి మండలంలో పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా పెట్లూరు నుంచి గుర్రప్పడియ, కోయవారిపాలెం నుంచి జాళ్లపాలెం, ఇలవర నుంచి పెదకండ్లగుంట, గోగినేనివారిపాలెం నుంచి అక్కచెరువుపాలెం వెళ్లే రహదారులు బాగా దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లోని అంతర్గత రోడ్లు కూడా మురికికూపాలుగా మారాయి.



తారు లేచిపోయి గుంతలతో ఉన్న ముప్పరాజుపాలెం వెళ్లే రోడ్డు



చిప్స్ పరిచి వదిలేసిన కుందంపల్లి పీఆర్ రోడ్డు

పుల్లలచెరువు మండలంలోని రంగనపాలెం-కుందంపల్లి, చాపలమడుగు-సి.కొత్తపల్లి, మానేపల్లి-అయ్యగానిపల్లి, మానేపల్లి రోడ్డు టూ రెంటపల్లి ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. కుందంపల్లి రోడ్డుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. 2019లో ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. ఇప్పటివరకు తట్ట మట్టి పోసిన పాపాన పోలేదు.

సొంత బిడ్డలుగా భావించాలి



- చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై దృష్టిపెట్టాలి
- అంగన్‌వాడీ కార్యకర్తలకు కలెక్టర్ అన్సారియా సూచన

వివరాలు 6వ పేజీలో



7

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఒంగోలులోని రిమ్స్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పలువురు ఆట, పాటలతో అదుర్స్ అనిపించారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్

ఒంగోలులోని పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసు స్పోర్ట్స్‌మీట్ శనివారం మొదలైంది. పోటీలను ఎస్పీ దామోదర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాజ్యోతిని వెలిగించి బెలూన్లను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో ఉండే పోలీసులకు క్రీడల ద్వారా మానసికోల్లాసం లభిస్తుందన్నారు. తొలిరోజు పోటీల్లో జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్‌ల పోలీసులతోపాటు ఏఆర్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

7





7

తళుక్కుమన్న తారలు

ఒంగోలు సమీపంలోని ఏడుగుండ్లపాడు వద్ద ఉన్న శ్రీహర్షిణి కళాశాలలో సినీ తారలు తళుక్కుమన్నారు. 'దేవకీనందన వాసుదేవ' చిత్ర హీరో గల్లా అశోక్, హీరోయిన్ మాజీ మిస్ ఇండియా మానసా వారణాసిలు శనివారం సందడి చేశారు. సినిమా ప్రచారంలో భాగంగా కళాశాలకు వచ్చిన వారిని చూసి విద్యార్థులు కేరింతలు కొట్టారు. సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

నీటి సంఘాల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్

- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు నోటిఫికేషన్ నిలిపివేత

ఒంగోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు మరోసారి తాత్కాలికంగా బ్రేక్ పడింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 20న నోటిఫికేషన్ విడుదల చేసి 342 డబ్ల్యూయూఏల ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అందుకనుగుణంగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా డబ్ల్యూయూఏల పరిధిలో ప్రాదేశిక నియోజకవర్గాల గుర్తింపు, ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, వారికి శిక్షణ పూర్తిచేశారు. ఈనెల 20న నోటిఫికేషన్ రావాల్సి ఉండగా తాత్కాలికంగా ప్రక్రియను ఆపాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. ఈనెల 22 వరకూ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఆ సమయంలో ఎమ్మెల్యేలు నియోజకవర్గాలలో అందుబాటులో ఉండే అవకాశం లేదు. నీటిసంఘాల ఎన్నికలను వీలైనంత మేర ఏకగ్రీవం చేయాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ప్రక్రియలో ఎమ్మెల్యేల పాత్ర కీలకం. అలాంటిది 22 వరకూ వారు శాసనసభ సమావేశాలలో ఉంటే 23న ఎన్నికల నిర్వహణ ఇబ్బందికరమని భావించి తాత్కాలికంగా ఆపేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. తదుపరి ఎప్పుడు నిర్వహించేది తెలిపేవరకు మొత్తం ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాక గతంలో ఒకసారి భారీవర్షాలు, వరదల కారణంగా తాత్కాలికంగా ఆపారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల కారణంగా నిలిపివేశారు.

అంతిమానికి అనాథగానే..

- యశోద మృతదేహాన్ని ఖననం చేసిన నగర పాలక సంస్థ సిబ్బంది
- ప్రియుడిని అరెస్టు చేయాలంటూ రిమ్స్ వద్ద దళిత సంఘాల ఆందోళన
- సర్దిచెప్పి పంపిన పోలీసులు

ఒంగోలు క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దళిత సంఘాల ఆందోళన మధ్య ఆ అభాగ్యురాలికి అనాథ మాదిరిగా అంత్యక్రియలను కార్పొరేషన్ వారు పూర్తిచేశారు. ప్రియుడి మాటలు నమ్మి వచ్చి మోసపోయిన యువతి జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్సపొందుతూ మృతిచెందిన విషయం విదితమే. అయితే

మిగతా 6వ పేజీలో




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న యూనివర్సిటీ అబ్జర్వర్ శ్యామ్‌కుమార్

సెంట్రల్ జోన్ మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే నిర్వహిస్తున్న సెంట్రల్ మహిళా కబడ్డీ ఇంటర్ కాలిజాట్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా యూనివర్శిటీ క్రీడల కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కరచాలనం చేశారు. తొలిరోజు జరిగిన పోటీల్లో రెండోరౌండ్‌కు రైజ్ కృష్ణసాయిగాంధీ (ఒంగోలు), సెయింట్‌మేరీస్(గుంటూరు), పేస్ ఇంజనీరింగ్ కాలేజీ(ఒంగోలు), జేఎన్‌టీయూకే, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్(గుడ్లవేల్లురు), ఎంఎల్‌సీ విమెన్(గుంటూరు) కళాశాలలు ఎంపికయ్యాయి. అనంతరం కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు తమ కళాశాలలో ఈ పోటీలు జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజర్ శిద్దా భరత్, రాగ చీఫ్ కో ఆర్డినేటర్ శిద్దా ప్రవల్లిక, గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, పీడీలు ఎస్.హిమచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

రూ.4కోట్ల ఎన్‌క్యాప్ నిధులతో నగర అభివృద్ధి

- కలెక్టర్ అన్సారియా
- నగరంలో అధికారులతో కలిసి పర్యటన

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్‌క్యాప్ నిధులు రూ.4కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారీయా తెలిపారు. ఈ మేరకు శనివారం పనులు ప్రతిపాదించిన ప్రాంతాల్లో ఆమె పర్యటించి పరిశీలించారు. పాత బైపాస్‌రోడ్‌లో డివైడర్ నిర్మించి వాటిలో మొక్కలు నాటడంతోపాటు, భాగ్యనగర్ 4వ లైన్‌లో నూతన రోడ్ నిర్మాణం, కిమ్స్ హాస్పిటల్ సమీపంలో గ్రీనరీ అభివృద్ధి, దిబ్బలరోడ్‌లోని దామచర్ల జనార్దన్ పార్కులో పలు ఆట పరికరాలు, గ్రీనరి అభివృద్ధి చేసేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యాప్ గైడ్‌లైన్స్ ప్రకారం అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసినట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు కలెక్టరుకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి సుశీల, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌ప్రభాకర్, కార్పొరేషన్ ఎంఈ చంద్రయ్య, డీఈ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- మంత్రి ఓఎస్‌డీ సాంబశివరావు ఆదేశం

ఒంగోలు(క్రైం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిచేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ మంత్రి ఓఎస్‌డీ ఏవీ.సాంబశివరావు ఆదేశించారు. శనివారం ఒంగోలులోని విద్యుత్ భవన్‌లో అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఓఎస్‌డీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్‌డీఎస్‌ఎస్ పథకం పనుల పురోగతి గురించి ప్రశ్నించారు.అందుకు సంబంధించి పలు సూచనలు చేశారు. కొత్తపట్నంలో నిర్మిస్తున్న 132/33 కేవీ సబ్‌స్టేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. 24గంటలు నాణ్యమైన కరెంటు అందించేలా చూడాలని సూచించారు. సిబ్బంది పనితీరు, ఖాళీగా ఉన్న పోస్టుల గురించి వాకబు చేశారు. మంత్రి రవికుమార్ రాష్ట్ర వ్యాప్త కరెంటు సమస్యలపై రోడ్ మ్యాప్ ఇచ్చారని, ఇందుకు సంబంధించిన అంశాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఎ.శ్రీనివాసరావు, ఏవో కె.సుబ్బారావు పాల్గొన్నారు.

20 నుంచి నిరుద్యోగ యువతకు శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలోని స్కిల్ హాబ్ సెంటర్‌లో ఈనెల 20వతేదీ నుంచి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజయాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్ కోర్సులు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. టెన్త్ పాస్, ఫెయిల్, ఆపై చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇస్తామని, ఈనెల 18వతేదీ లోపు స్కిల్‌హబ్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, వివరాల కోసం 7989244381, 7842004344 సెల్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

యూనివర్సిటీ ఏసీఈగా భారతీదేవి

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ యూజీ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారి(ఏసీఈ)గా అర్థశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అంచుల భారతీదేవి నియమితులయ్యారు. ఈ మేరకు వైస్‌చాన్సలర్ డీవీఆర్.మూర్తి శనివారం నియామక పత్రాలను అందజేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న బి.పద్మజ స్థానంలో భారతీదేవిని నియమించారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు తదితరులు ఆమెను అభినందించారు. ఇక నుంచి యూనివర్శిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ విభాగం హెచ్‌వోడీ పద్మజ కొనసాగనున్నారు.

22న మద్యం డిపోలో పాత సామగ్రి వేలం

ఒంగోలు(క్రైం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాలలో వినియోగించిన సామగ్రిని ఈనెల 22న పేర్నమిట్టలోని మద్యండిపోలో బహిరంగ వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ ఎం.వినయ్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్రిడ్జిలు, ఇన్వర్టర్లు, స్కానర్లు, క్యాష్ కౌటింగ్ మెషిన్లకు వేలం వేస్తున్నామని, ఆసక్తిగల వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

నేడు సెపక్‌తక్రా క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు యనమల సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కాలేజీగ్రౌండ్స్‌లో సాయంత్రం 4గంటలకు సబ్ జూనియర్స్, బాల, బాలికల జట్లు ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు

- 33 మోటార్‌సైకిళ్లు, 4 కిలోల గంజాయి స్వాధీనం
- ఎస్పీ దామోదర్ వెల్లడి

ఒంగోలు(క్రైం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిళ్లను దొంగిలించే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 33 మోటార్ సైకిళ్లు, 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. శనివారం ఒంగోలులోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిచిన మీడియా సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణం బండపాలెంలో నివాసం ఉంటున్న కుంచాల శివప్రసాద్, దూబగుంటకు చెందిన ఉప్పు శ్రీకాంత్, ఒంగోలులోని కొణిజేడు బస్టాండ్‌లో నివాసం ఉంటున్న కోల్‌కతాకు చెందిన సహాద్దీన్‌సర్దార్ శుక్రవారం సాయంత్రం ఒంగోలులోని శర్మ కాలేజీ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వారిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారిని విచారించగా రూ.25.80లక్షల విలువైన 33 మోటార్ సైకిళ్ళు, రూ.20వేల విలువైన 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లాలో 15, బాపట్ల జిల్లాలో 1, పల్నాడు జిల్లాలో 1, నెల్లూరు జిల్లాలో 16 వాహనాలను వారు దొంగిలించారని ఎస్పీ వివరించారు. కుంచాల శివప్రసాద్‌పై తమిళనాడు రాష్ట్రం సేలంలో ఎన్‌డీపీఎస్ కేసు ఉందన్నారు.

దొంగలను పట్టుకునేందుకు కృషి చేసిన ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు, ఏఎస్‌ఐ కె.సురేష్, షేక్ నయాబ్‌రసూల్, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.సాయి, జి.విజయ్‌కుమార్, కానిస్టేబుల్ అనిల్‌లను ఎస్పీ ప్రశంసించి రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో నెల రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.


పట్టుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

అనధికార లేఅవుట్లతో ప్రజలు నష్టపోకుండా చూడాలి

- ఒడా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ
- స్థలాల డబుల్ రిజిస్ట్రేషన్‌పై దృష్టిపెట్టాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్ల కారణంగా ప్రజలు నష్టపోకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జాయింట్‌కలెక్టర్, ఒంగోలు నగరాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం సాయంత్రం ఒంగోలు అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఒడా పరిధిలో అనధికార లేఅవుట్లు ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ లే అవుట్లుగా గుర్తిస్తే ఒడా యాక్టు-2016 ప్రకారం కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

అప్రూవల్ కోసం దరఖాస్తులు చేసుకుంటే పరిశీలించి వెంటనే అనుమతులు ఇచ్చేలా చూడాలన్నారు. అందుకోసం పట్టణ ప్రాంతాల్లో హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనధికార లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేస్తే రోడ్లు, విద్యుత్, మంచినీటి సదుపాయాలు కల్పించడం జరగదని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థలాలు డబుల్ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనధికార లేఅవుట్లలో స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో మార్కాపురం సబ్ కలెక్టర్‌తో పాటు ఒంగోలు, కనిగిరి, బాపట్ల, చీరాల ఆర్డీవోలు, ఒడా పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, ఈవోఆర్డీలు పాల్గొన్నారు.

రూ.180కోట్లతో స్వయంఉపాధి

- 50 శాతం సబ్సిడీతో 50 రకాల యూనిట్లు
- బీసీ నాయకులతో సమావేశమైన ఈడీ

ఒంగోలునగరం, నవంబరు 16: జిల్లాలో వెనుకబడిన తరగతుల వారికి రూ.180 కోట్లతో ఈ ఆర్థిక సంవత్సరంలో స్వయం ఉపాధి పథకాలను అందించబోతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బీసీ వర్గాలకు యూనిట్ విలువలో 50శాతం సబ్సిడీతో ఈ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు ఒక్క పథకం కూడా అమలు కాలేదు. బోర్డుకే పరిమితమై ఉన్న బీసీ కార్పొరేషన్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.180 కోట్లతో వెనుకబడిన వర్గాలకు స్వయంఉపాధి పథకాలను అందించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.80కోట్లను మంజూరుచేసింది. బ్యాంకు లింకేజి రుణాలతో కలుపుకొని రూ.160కోట్లు కానున్నాయి. స్వయంఉపాధి పథకాలు చేపట్టేందుకు కార్పొరేషన్ సగం బ్యాంకు లింకేజి రుణం సగం లబ్ధిదారులకు అందించనున్నారు. అయితే ఈ సారి లబ్ధిదారుల కోరిక మేరకు ఆయా యూనిట్లను అందించనున్నారు. ఏ తరహా యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే వారికి ఉపయోగకరంగా ఉంటుందో అనే దిశగా శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో బీసీ సంఘాల నాయకులతో ఈడీ వెంకటేశ్వరరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 50రకాల యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే బీసీలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని నాయకులు తెలిపారు. టైలరింగ్, ఆటోలు, బ్యూటీపార్లర్, షామియానా, చైర్స్, డెయిరీ, ట్రాక్టర్లు, మెడరన్ సెలూన్, షీప్ యూనిట్, సిమెంటు బ్రిక్స్ వంటి 50రకాల యూనిట్లను అందజేయాలని నాయకులు సమావేశంలో తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో యోగయ్యయాదవ్, కొఠారి నాగేశ్వరరావు, ఎస్.రమేష్, కె.వెంకటేశ్వర్లు, టి.రమాదేవి, బి.నాగరాజు, వి.ప్రసాదు, డి.శ్రీను, షేక్ మీరావలి, ఎం.హరిక్రిష్ణ, పి.సుధాకరరావు, కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నరకదారులు

(5వ పేజీ తరువాయి)

ఆశాఖ అధికారులు కోరగా, పంచాయతీరాజ్ శాఖ అధికారులు మాత్రం ఏకంగా రూ.373.68 కోట్లు ప్రతిపాదించారు. దీనిని బట్టి జిల్లాలో ఆ శాఖ రోడ్ల దుస్థితి ఎలా ఉందో, వైసీపీ పాలనలో ఎంత నిర్లక్ష్యం చేశారో, ప్రజలు ఆ రోడ్లపై రాకపోకలు సాగించలేక ఎంత అవస్థలు పడుతున్నారో ఇట్టే అర్థమవుతుంది.

ఆనవాళ్లు కోల్పోయాయి

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల పరిధిలోని 38 మండలాల్లో 1,787 ఆవాసాలు ఉండగా ఆ పరిధిలో మొత్తం 5,554 కిలోమీటర్ల రోడ్లు పీఆర్ శాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. అందులో సిమెంట్ రోడ్లు కేవలం 262 కి.మీ కాగా.. 1,480 కి.మీ తారురోడ్లు, 475 కి.మీ డబ్ల్యూఎంబీ రోడ్లు, 2,396 కి.మీ గ్రావెల్ రోడ్లు ఉండగా మరో 941 కి.మీ మట్టి రోడ్లు ఉన్నాయి. వీటిలో వివిధ గ్రామాలకు మధ్య అలాగే మండల కేంద్రాలకు ప్రధాన గ్రామాలను కలుపుతూ ఉండే తారురోడ్లు అత్యధిక ప్రాంతాల్లో ఆనవాళ్లు కూడా లేకుండాపోయాయి. గతంలో ఒకసారి రూ.13.34 కోట్లతో 201 పనులు ఆయా రోడ్ల మరమ్మతుల కోసం గత ప్రభుత్వ ఆదేశాలతో ఎన్‌డీఆర్‌ఎఫ్ కోటా కింద మంజూరు చేశారు. అయితే నిధులు రావన్న భయంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాలేదు. ఆ పనులను సెప్టెంబరులో ఈ ప్రభుత్వం రద్దుచేసింది. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల నుంచి మరమ్మతుల కోసం రూ.37.99 కోట్లతో 70 పనులకు కేటాయింపు చేసినా అధికశాతం ముందుకు సాగలేదు.

గుంతల పూడ్చివేతకు ప్రాధాన్యం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం గుంతల పూడ్చివేతకు ప్రాధాన్యత ఇచ్చి రోడ్ల మరమ్మతు పనులు చేపట్టింది. ఆ సందర్భంగా ఆర్‌అండ్‌బీ, పీఆర్, మునిసిపల్, ఇతరత్రా శాఖల పరిధిలో రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు కోరింది. అందులో ఆర్‌అండ్‌బీ అధికారులు 2వేల కిలోమీటర్ల రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చివేతకు రూ.25కోట్లతో పనులు ప్రతిపాదించారు. అందులో రూ.13.76కోట్లు విలువైన వంద పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం అవి ప్రారంభమయ్యాయి. అయితే ఆనవాళ్లు కూడా లేకుండా పోవడంతో పీఆర్ అధికారులు గుంతల పూడ్చివేత, ఇతరత్రా మరమ్మతులకు ఏకంగా రూ.373.68 కోట్లు కోరారు. సుమారు 1,360 కి.మీ తారురోడ్లు ధ్వంసమైనట్లు తేల్చిన అధికారులు వాటి మరమ్మతులు కోసం రూ.373.68 కోట్లతో 459 పనులు ప్రతిపాదించారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆయా రోడ్లపై వాహనాలు కాదు కదా కనీసం మనుషులు కూడా నడిచే వీలు లేని పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు కొత్త పనులను ప్రతిపాదించినట్లు సమాచారం. గిద్దలూరు, కొండపి, కనిగిరి, ఎస్ఎన్‌పాడు, వైపాలెం వంటి నియోజకవర్గాల్లో పీఆర్ రోడ్ల పరిస్థితి మరీదారుణంగా ఉన్నట్లు అధికారుల నివేదిక ప్రకారం తెలుస్తోంది.

నియోజకవర్గాల వారీ అధికారుల ప్రతిపాదనలు ఇవీ..

నియోజకవర్గం	ప్రతిపాదిత పనులు	అవసరమైన నిధులు(కోట్లలో)
ఒంగోలు	18	16.06
దర్శి	36	33.93
సంతనూతలపాడు	45	44.18
కొండపి	75	53.19
కనిగిరి	63	48.88
మార్కాపురం	33	38.22
గిద్దలూరు	143	101.62
వైపాలెం	46	37.59

సొంత బిడ్డలుగా భావించాలి

- పిల్లల ఆరోగ్య పరిరక్షణపై దృష్టిపెట్టాలి
- అంగన్‌వాడీ కార్యకర్తలకు కలెక్టర్ అన్సారియా సూచన

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ పర్యవేక్షణలో ఉన్న పిల్లలను సొంత బిడ్డలుగా భావించి వారి ఆరోగ్య పరిరక్షణపై అంగన్‌వాడీలు మరింత దృష్టిపెట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. బంగారు బాల్యం కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక గ్రీవెన్స్ హాలులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహ రహిత, బాల కార్మిక రహిత, అక్షర చైతన్య, ఆరోగ్యకరమైన జిల్లా ఆవిష్కరణ కోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. అందులో భాగంగా 18 ఏళ్లలోపు బాలలు ఆహ్లాదకర వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా పెరిగేలా వివిధ శాఖలను సమన్వయం చేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న అంగన్‌వాడీలపై గురుతర బాధ్యత ఉందన్నారు. అంగన్‌వాడీల్లోని పిల్లల ఆరోగ్యంపై మరింత దృష్టిపెట్టాలని దిశానిర్దేశం చేశారు. వాస్తవ గణాంకాలను రికార్డుల్లో నమోదుచేయాలని, లోపంతో ఉన్న బాలలను గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ కమిటీల్లో అంగన్‌వాడీలను కూడా భాగస్వాములను చేసినట్లు తెలిపారు. బాల్యవివాహాలు చేయకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను లబ్ధిదారులకు సమర్థవంతంగా అందించి ఆరోగ్యకరమైన సమాజం ఆవిష్కృతమయ్యేలా క్షేత్ర స్థాయి సిబ్బంది పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆ దిశగా వైద్య సిబ్బందితో కలిసి పనిచేయాలని కోరారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ మాధురి పాల్గొన్నారు.

అంతిమానికి అనాథగానే..

(5వ పేజీ తరువాయి)

బంధువులు ఎవరూ రాకపోవడంతో అనాథ శవంగా మిగిలిపోయింది. కర్ణాటకకు చెందిన యశోదచౌహాన్ పొదిలి మండలం చినారికట్లకు చెందిన మత్తయ్యను ప్రేమించింది. తల్లిదండ్రులను వదిలి ఒంగోలు సమతానగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఇద్దరూ సహజీవనం చేశారు. రెండు నెలల క్రితం మత్తయ్య కనిపించకుండా పోయాడు. దీంతో న్యాయం చేయాలంటూ పోలీసుల చుట్టూ తిరిగి విసుగుచెందిన యశోద ఈనెల 11న జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. రిమ్స్‌లో చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినా వారు రాలేదు. దీంతో దళిత సంఘాల నాయకులు అంతిమసంస్కారం చేసేందుకు ముందుకొచ్చారు. శనివారం అంబులెన్స్‌లో మృతదేహాన్ని శ్మశానానికి తరలించేందుకు ప్రయత్నించగా రిమ్స్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. మునిసిపాలిటీ వారు అంత్యక్రియలు నిర్వహిస్తారని తేల్చిచెప్పారు. దీంతో దళిత నాయకులు ఆందోళనకు దిగారు. ప్రియుడు మత్తయ్యను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తాలూకా సీఐ అజయ్‌కుమార్ వచ్చి వారితో చర్చించి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం స్థానిక కమ్మపాలెం శ్మశాన వాటికలో మృతదేహాన్ని ఒంగోలు కార్పొరేషన్ సిబ్బంది ఖననం చేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ అన్సారియా

ఒంగోలునగరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నిరుద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. శనివారం ఒంగోలులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ కాంప్లెక్సులోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ కోచింగ్‌ను ప్రారంభించిందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఈ కోచింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం 220 మందికి కోచింగ్ ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకోగా 235మందికి స్టయిఫండ్‌తో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా పంపిణీ చేస్తామన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నిరుద్యోగులు డీఎస్సీలో విజయమే లక్ష్యంగా కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించాలని కోరారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖాధికారి అంజల తదితరులు పాల్గొన్నారు.


సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీ

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

చీరాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని సత్ఫలితాలు రాబడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించాలనా మున్సిపల్ ఆర్‌డీ హరికృష్ణ చెప్పారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ పరంగా పన్ను బకాయిల వసూళ్లు, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజనీరింగ్ పనులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వేటపాలెం మండలం రామాపురంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

అద్దె భవనాలలో గ్రంథాలయాలు

- నిధుల మంజూరుకు సిద్ధంగా ఉన్నా స్థలం కేటాయింపు లేక సమకూరని వైనం
- అద్దంకిలో 70 ఏళ్లుగా ఇదే సమస్య

అద్దంకి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతోనే జ్ఞాన సముపార్జన సాధ్యం అని ప్రతి ఒక్కరి నోటా వచ్చే మాట... అయితే విలువైన పుస్తకాలు కొనుగోలు చేసి చదవడం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు, యువకులకు సాధ్యం కాదు. దీంతో ఆయా విద్యార్థులు కచ్చితంగా గ్రంథాలయాలపై ఆధారపడాల్సిందే. అయితే అద్దంకిలో 1954లో గ్రంథాలయం ఏర్పాటు జరిగింది. 70 సంవత్సరాలుగా అద్దె భవనాలలోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రంథాలయం నిర్వహిస్తున్న అద్దె భవనంలో సుమారు 4 దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. అద్దంకిలోని గ్రంథాలయంలో సుమారు 22వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 2567 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల మరింత విలువైన 20 పుస్తకాలను కూడా కొనుగోలు చేశారు. గ్రూప్స్, కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. గతంలో గ్రంథాలయం నిర్మాణానికి సుమారు రూ.40లక్షలు మంజూరైనా స్థలం కేటాయింపు జరగక పోవడంతో వెనక్కి పోయాయి. స్థలం కేటాయింపు జరిగితే నిధులు లభ్యతకు ఎలాంటి ఇబ్బంది లేదని గ్రంథపాలకుడు సుగుణరావు తెలిపారు. గ్రంథాలయం భవనానికి అవసరమైన స్థల కేటాయింపు చేయాలని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆందోళనలు కూడా చేశారు.



అద్దంకిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం

చీరాలలోనూ అదే పరిస్థితి

- అరకొరగా కాంపిటేటివ్ బుక్స్
- పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు తిప్పలు

చీరాల : చీరాల మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ గ్రంథాలయం అద్దె భవనంలో కునారిల్లుతోంది. ఇదిలావుంటే గ్రంథాలయంలో విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు అవసరమైన పుస్తకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అవి కూడా పాతపుస్తకాలు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. పెద్దవారు కాలక్షేపం కోసం వస్తారు. అయితే గ్రంథాలయం పై అంతస్తులో ఉంటుంది. ఇరుకు మెట్లు. ఆ మెట్లు ఎక్కలేక చాలామంది పెద్దవారు అటు వైపు రావడం మానేశారు. దీంతో గ్రంథాలయానికి సగటున రోజుకు వచ్చే వారి సంఖ్య మించడం లేదు. పట్టణ పరిధిలో ఇంటి పన్ను వసూళ్లలో 8 శాతం గ్రంథాలయ సెస్‌గా పేర్కొంటారు. ఆ మొత్తం జిల్లా గ్రంథాలయానికి జమ చేయాలి. అయితే ఇప్పటికి పురపాలక సంఘం నుంచి సుమారు రూ.2.76కోట్ల సెస్ బకాయి చెల్లింపు జరగాల్సి ఉందని గ్రంథ పాలకురాలు ధనమ్మ తెలిపారు. గ్రంథాలయం 1956లో ప్రారంభించారు. ఇప్పటికి సొంత భవనం లేదు. మున్సిపల్ పరిధిలో స్థలం కేటాయిస్తే గ్రంథాలయం నిర్మాణానికి నిధులు ఉన్నాయని చెప్తున్నారు. అయితే పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కలగానే మిగిలింది.



చీరాల శాఖ గ్రంథాలయం

మానసిక ఉల్లాసానికి క్రీడలు

రెండు రోజుల పాటు పోలీస్ స్పోర్ట్స్

ప్రారంభించిన ఎస్పీ దామోదర్



పోటీల ప్రారంభ సూచికంగా క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలో జరిగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను ఎస్పీ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ మీట్‌లో క్రీడలు ,ఆటలు పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీలలో పాల్గొనే వారు క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలని కోరారు. గెలుపు ఓటములు పరిగణనలోకి తీసుకోకూడదని గుర్తు చేశారు. పోలీసులు నిత్యం మానసిక ఒత్తిడికి గురవుతారని, అందుకోసం క్రీడల్లో పాల్గొనడం వలన మానసిక ఉల్లాసం పెంపొందించవచ్చని తెలిపారు. పోలీసు శాఖలో పరస్పర సహకారం, సమష్టికృషి ఉండాలని సూచించారు. తొలుత గత ఏడాది స్పోర్ట్స్‌లో వ్యక్తిగత చాంపియన్ అయిన కాటం శ్రీను నుంచి క్రీడా కాగడాను అందుకొని క్రీడలను ప్రారంభించారు. క్రీడల ప్రారంభ సూచికగా బెలూన్లను ఎగుర వేశారు. జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్ల పోలీసులతో పాటుగా ఏఆర్ సిబ్బంది పోటీలలో పాల్గొన్నారు. వాలీబాల్ ఆటను తొలుత ఎస్పీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, ఎస్బీ డీఎస్పీ సురేష్ బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దర్శి, మార్కాపురం డీఎస్పీలు లక్ష్మీనారాయణ, నాగరాజు, సీఐలు ,ఎస్సైలు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ



కబడ్డీ ఆడుతున్న పోలీసు క్రీడాకారులు





శ్రీ హర్షిణీలో సినీ తారల సందడి

దేవకీనందన వాసుదేవ మూవీ బృందం పర్యటన

ఒంగోలు విద్య నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీ హర్షిణీ కళాశాలలో దేవకీనందన వాసుదేవ మూవీ బృందం శనివారం సందడి చేసింది. మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుమారుడు, సూపర్‌స్టార్‌మహేష్ బాబు మేనల్లుడు గల్లా అశోక్, ఎక్స్‌మిస్ ఇండియా మానసా వారణాసి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న దేవకీనందన వాసుదేవ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆ సినీ బృందం శ్రీ హర్షిణీలో సందడి చేసింది. శ్రీ హర్షిణీ కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ పూర్వ విద్యార్థులలో ఒకరు బాలకృష్ణ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తుండగా మరో విద్యార్థి ఈశ్వర్ దత్ దేవకీనందనవాసుదేవ సినిమాకు గాయకుడిగా పనిచేస్తున్నారు. కళాశాలకు వచ్చిన సినిమా బృందానికి కళాశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. వేలాది మంది విద్యార్థుల నడుమ కళాశాలలో బృందం సందడి చేసింది. ఈనెల 22న ఈ సినిమా రిలీజ్‌కానున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు మూవీ టీంకు ఆల్‌దబెస్ట్ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...!

ఆడి పాడిన వైద్య విద్యార్థులు

ఘనంగా రిమ్స్ మెడికల్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు





సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న మెడికోలు



సెల్ఫీ తీస్తూ..

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రిమ్స్ ప్రభుత్వ మెడికల్ కాలేజి వైద్య విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి. జమున ముఖ్య అతిథులుగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్య పవిత్రమైనదని, కుల, మతాలకు అతీతంగా, ప్రజాసేవే పరమావధిగా పనిచేసే ఏకైక వృత్తి వైద్య రంగమని అన్నారు. వృత్తి విలువలను కాపాడాల్సిన బాధ్యత నేటి తరం వైద్యవిద్యార్థులపై ఉందన్నారు. డాక్టర్ కావాలన్న కల ప్రతి ఒక్కరిలోనూ ఉంటుందని, అయితే ఆ కలను సాకారం చేసుకుని, సాధించే ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. నూతన విద్యార్థులు భవిష్యత్‌లో మంచి మార్కులు సాధించి రిమ్స్ మెడికల్ కాలేజికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా వైస్ ప్రిన్సిపాల్స్, డాక్టర్ జి. దుర్గాదేవి, డాక్టర్ జి. సుధాకర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, మాజీ వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్. సుధాకర్ బాబులు పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని వారు ఆకాంక్షించారు.

డ్యాన్సులతో అదరహో అనిపించిన మెడికోలు

రిమ్స్ ప్రభుత్వ మెడికల్ కాలేజి ఫ్రెషర్స్ డే వేడుకల సందర్భంగా సీనియర్స్ జూనియర్స్ ఆడి పాడారు. ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పలువురు తమ డ్యాన్సులతో అదరహో అనిపించి, వైద్యుల ప్రశంసలు అందుకున్నారు. సెల్ఫీలు, ఫ్యాన్సీ డ్రస్‌ల ప్రదర్శన, నవ్వుల హరివిల్లులతో సాగిన ఫ్రెషర్స్ డే వేడుక కనులవిందుగా సాగింది.

రామ్మూర్తినాయుడి మృతి బాధాకరం

- మంత్రి స్వామి సంతాపం

కొండపి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మరణం బాధాకరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రామ్మూర్తి నాయుడు ఎమ్మెల్యేగా చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

గ్రంథాలయం ఆధునిక దేవాలయం

జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు

ఒంగోలు(కల్చరల్),నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):గ్రంథాలయం ఆధునిక దేవాలయమని, దాని ద్వారా ఎంతో విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకట నాయుడు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక జిల్లాకేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వక్తృత్వ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డీపీవో మాట్లాడారు. విద్యార్థులు ప్రతి విషయంపై ఏకాగ్రత కలిగి ఉండాలని, పుస్తకాలు చదివితేనే విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. అలాగే గ్రంథాలయ సంస్థకు పంచాయతీల నుంచి రావాల్సిన సెస్సు ప్రతి నెలా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. మరో అతిథి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్ ప్రాధాన్యత పెరిగి పుస్తక ప్రాధాన్యత తగ్గిందని, అయితే పుస్తక పఠనం ఎంతో ముఖ్యమని అన్నారు. లీడ్ డిస్ట్రిక్ చీఫ్ మేనేజర్ డి.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు దేశ చరిత్ర గురించి, జాతీయ నాయకుల గురించి తెలుసుకోవాలని, అందుకోసం గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను వినియోగించుకోవాలని అన్నారు. డాక్టర్ జీవీ కృష్ణయ్య మాట్లాడుతూ గురజాడ రచనల గురించి ఆయన వ్యక్తిత్వం గురించి ప్రసంగించారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం లైబ్రేరియన్ ఏ.ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారుల చరిత్రను విద్యార్థులు తెలుసుకుని వారి ఆశయసాధనకు కృషిచేయాలని అన్నారు. గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖా గ్రంథాలయాలలో విద్యార్థులు, నిరుద్యోగులకు అవసరమైన ఎన్నో పుస్తకాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి రోజూ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని సభ్యత్వం తీసుకుని గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. అనంతరం అతిథులను కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, సిబ్బంది ఘనంగా సత్కరించారు.



గ్రంథాలయ వారోత్సవాలలో మాట్లాడుతున్న డీపీవో వెంకట నాయుడు



ప్రమాదంలో గాయపడిన వెంకటరమణ



రహదారి పక్కన క్షతగాత్రులు

శుభకార్యానికి వస్తూ..

బొలెరోను ఢీ కొట్టిన బైక్

భర్త మృతి..

భార్యా పిల్లలకు గాయాలు

పామూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అత్తగారింట్లో శుభకార్యానికి వస్తూ అల్లుడు మృత్యువాత పడిన ఘటన శనివారం మధ్యాహ్నం పామూరు మండలం గుమ్మలంపాడు వద్ద చోటు చేసుకుంది. పొదిలిలోని నిర్మల కాలనీకి చెందిన కోలా రాజా(30)కు పామూరులోని విరాట్‌నగర్ ఎస్టీ కాలనీకి చెందిన వెంకటరమణ(26)తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు రోజూవారి కూలీ పనులకు వెళుతుంటారు. చిన్నారులిద్దరూ పొదిలిలోని నిర్మల్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతుంటారు. పామూరులోని అత్తగారింట్లో జరిగే శుభకార్యానికి భార్య, పిల్లలతో బైక్‌పై రాజా పామూరు వస్తున్నాడు. గుమ్మలంపాడు సమీపంలో నాసవాగు దగ్గర కనిగిరి నుంచి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కోలా రాజా ఎగిరి కిందపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. భార్య వెంకటరమణకు కుడి కాలు విరిగింది. పెద్దకుమారుడు ఆశీర్వాదం(6)కు స్వల్పగాయాలు కాగా, చిన్నకుమారుడు మహింపాల్(4) సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో క్షతగాత్రులను పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజా మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. హెల్మెట్ లేకపోవడంతో రాజా తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాలు విరిగిన వెంకటరమణను, స్వల్పగాయాలైన ఆశీర్వాదాన్ని 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు. సమాచారం అందుకొన్న ఏఎస్ఐ ముల్లా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రాజా మృతితో పొదిలి నిర్మల కాలనీ, పామూరు విరాట్ నగర్ కాలనీలో విషాదచాయలు అలముకొన్నాయి.

ఆంధ్రజ్యోతి ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం ప్రతిరోజూ క్లాసిఫైడ్స్

HOME LOANS

గత 18 సం॥లుగా బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ ద్వారా HOME LOANS, మార్టిగేజ్ లోన్స్ అన్ని రకముల లోన్స్‌ను డోర్ స్టెప్ ద్వారా సర్వీసు సంప్ర॥ సెల్: 9502466253, 9246460762

AJO-200333

HOUSE FOR SALE

ఒంగోలు కర్నూలు రోడ్డు మహాలక్ష్మీ కళ్యాణ మండపం ఎదురు రోడ్‌లో శ్రీ కృష్ణనగర్‌లో దక్షిణం ఫేస్ 2019లో నిర్మించిన 20 గదుల పార్కింగ్ వసతిగల ఇండిపెండెంట్ హౌస్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9703998899, 7569476242

AJO-200338

WANTED

ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, JLS మరియు సెక్షన్ ఇన్‌ఛార్జ్‌లు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర. 8500301111, 8712164111

AJO-340

మ్యారేజ్ సర్వీసెస్

వైశ్య 21 సంవత్సరం జాబ్ చేయు వధువుకి విదేశాల్లో ఉద్యోగం చేసే వరుడు కావాలి. 52 సంవత్సరాలు సెకెండ్ మ్యారేజ్, జీడిపప్పు ఫ్యాక్టరీ కలిగిన వ్యక్తికి వధువు కావాలి. సంప్ర॥ 9059473904.

AJG-191941

FLAT FOR SALE

2BHK ఒంగోలు సిటీ, బస్టాండ్ ఎదురు, డిబ్బల్ రోడ్డు, రాజు కాంప్లెక్స్, 3rd ఫ్లోర్, ఫ్లాట్ నెం. 1, 995 Sft, ఫుల్లీ Furnished, ఈస్ట్ ఫేస్, 35 చ॥గ॥ స్థలం, ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర॥ 81421 33335.

AJG-203264

పండ్ల తోట అమ్మకమునకు కలదు

తిరుపతి జిల్లా ఓజిల్ మండలం అర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు. సంప్ర: 94401 83778

AJN-193451

ఉద్యోగావకాశాలు

గుంటూరు SIMS College హాస్టల్‌లో పని చేయుటకు వార్డెన్స్ Male / Female కావలెను. సంప్ర॥ సెల్ : 7675963955, 97039 64444.

AJG-203719

రియల్ ఎస్టేట్

గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా, మరెక్కడైన అ॥కొ॥ జనచైతన్య మా ప్రత్యేకత. సంప్ర॥ 73823 96677.

AJG-45

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.

జన్మదిన శుభాకాంక్షలు

వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు

విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు

లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483

చీమకుర్తి : 96525 55752

చీరాల : 99859 21376

మార్కాపురం : 99859 21358

కందుకూరు : 97036 18697

కనిగిరి : 99854 11483

గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484

8 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని పోనుగోటివారిపాలెంలో అక్రమంగా మద్యం వి క్రయిస్తున్న పోనుగోటి జగన్‌ను శనివారం ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 8 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు ని ర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో, నాయకులు

మద్దిపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో సీసీరోడ్డు నిర్మాణానికి శనివారం ఎంపీడీవో వి.జ్యోతి, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సంద ర్భంగా జయంత్‌బాబు మాట్లాడుతూ గ్రామానికి ఉపాధి నిధులు రూ. 90లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నా గేశ్వరరావు మాట్లాడుతూ మద్దిపాడులో డ్రైనేజ్ సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏఈ రవిబాబు, నవులూరి శివకృష్ణ, రెప్పవరపు ప్రభాకర్, అనిల్ నాయుడు, బాలచంద్ర, చైతన్య, నాగరాజు, హరిబాబు, ఈఏ అనిల్ పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ప్రత్యూష

నాగులుప్పలపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష కోరారు. శనివారం పోతవరం గ్రామంలో సాగు చేసిన మిర ప పంటలను ఆమె పరిశీలించారు. రబీ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

టంగుటూరు: పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగే మేల ని ఏవో స్వర్ణలత తెలిపారు. మల్లవరప్పాడులో జరిగిన శిక్షణా కార్యక్ర మంలో ఆమె మాట్లాడుతూ శనగ, మినుము సాగు చేయాలని రైతుల కు సూచించారు. పంటల బీమా చేయించుకోవాలని కోరారు. కార్యక్ర మంలో ఎ.శ్రీనివాసరెడ్డి, ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ కొండపి ఇన్‌చార్జిగా సతీష్

కొండపి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కొండపి నియో జకవర్గ ఇన్‌చార్జిగా శ్రీపతి సతీష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలరెడ్డి ప్రకటించారు. గడచిన సార్వత్రిక ఎన్నికల్లో నామినేష న్ వేసి ఆఖరి నిమిషంలో ఆయన పోటీ నుంచి వైదొలిగారు. తిరిగి ఇ పుడు నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నియమించినందుకు పార్టీ అధినా యకులకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆలోచనాత్మకంగా కవి సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విశ్వ కళాభారతి వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథా లయంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆలోచనాత్మకంగా జరిగింది. సంస్థ అధ్యక్షుడు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వరశర్మ, అక్షర సాహితి అధ్యక్షుడు ఎంవీఎస్.శాస్త్రి అధ్యక్షత వహించారు. అనంతరం సాహితీవే త్తలు ఆళ్ల సుబ్బారెడ్డి, ధూపాటి రామాచార్యులు, ఉప్పలపాటి వెంకటర త్నం, పీఎంకే.ఆత్రేయ, నెమ్మాని సీతారామ మూర్తి, పుల్లూరి మాతయ్య, రావినూతల వరలక్ష్మి, మానేపల్లి నాగకుమార శర్మలు పద్య, వచన రూ పంలో కవిత్వాన్ని వినిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కా ర్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వేంకటశ్రీనివాసు లు, ఏకేవీకే ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

కొండపి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా కొండపిలోని ప్రభుత్వ ఉన్నత కళాశాలలో పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులకు ఉచితంగా వివిధ కోర్సుల్లో శి క్షణ, అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ ఎం.వెంక టేశ్వర్లు, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ ఎం.గోపీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 20వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసు కోవాలని సూచించారు. వివరాలకు కళాశాల పనిరోజుల్లో సంప్రదించాల ని, సెల్ : 8897964505లో వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

డైట్‌లో 'మనకోసం'

సంతనూతలపాడు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ క ళాశాలలో బంగారు బాల్యం-బాలోత్సవాల్లో భాగంగా శనివారం మనకో సం-మన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలపంచా యతీల ఆధ్వర్యంలో ఉప సమితులను ఏర్పాటుచేసి అందరూ పా ల్గొనేలా చూడాలని ప్రతిపాదించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎ స్.సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు

● జేడీ రామనాథ్

ఒంగోలు(రూరల్), నవంబరు16(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి కో సం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఏపీఎస్ఐఆర్‌డీ జేడీ రామ నాథ్ కోరారు. శనివారం ఒంగోలులోని ఎంపీడీవో సమావేశభవనంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రామీణాభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన కోసం ముందుగా అధికారులు, ప్రజాప్రతినిధు లు ఆయా గ్రామాల్లో పర్యటించి పూర్తిగా సమాచారం సేకరించాలని చె ప్పారు. కార్యక్రమంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఎంపీడీవో శేషబాబు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఎంపీపీ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీపీవోను కలిసిన కూటమి నాయకులు



డీపీవో వెంకటనాయుడును సన్మానిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడును ఒంగోలులోని తన కార్యాలయంలో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కూటమి నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందించి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను వివరించి పరిష్కరించా లని కోరారు. కార్యక్రమంలో పెంట్యాల కోటేశ్వరరావు, పెంట్యాల శ్రీని వాసరావు, కనగాల శ్రీను,కుంచాల నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

గజానికో గుంతతో గజగజ

అధ్వానంగా టంగుటూరు-పొదిలి రోడ్డు

ఎన్‌డీబీ నిధులు మంజూరై

ఏళ్లు గడుస్తున్నా ప్రారంభంకాని పనులు

మరమ్మతులకూ నోచుకోని దైన్యం

ప్రమాదభరితంగా ప్రయాణం

మర్రిపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడి మండలంలో ప్రధానమైన టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి అభివృద్ధి కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి శాసనసభ్యులు, ప్రస్తుత మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి రూ.39 కోట్ల ఎన్‌డీబీ నిధులు మంజూరు చేయించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టెండర్ల ప్రక్రియ నిర్వహించింది. పనులను దక్కించుకున్న చిత్తూరుకు చెందిన ఒప్ప జాప్రతినిధి అసలు ప్రారంభించలేదు. దీంతో రహదారి అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా మర్రిపూడి చెరువు కట్ట కింద ఎప్పుడు ఏప్రమాదం జరిగి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌డీబీ నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయినందున ఆర్‌అండ్‌బీ శాఖ ఏటా చేయాల్సిన మరమ్మతులను సైతం చేపట్టడానికి వీలులేకుండాపోయింది. దీంతో స్థానిక గీతాంజలి పాఠశాల నుంచి రేగలగడ్డ బస్టాండ్ వరకు అడుగడుగునా రహదారి గోతులమయంగా మారింది. నిత్యం ఈమార్గంలో ప్రయాణించే వారికి పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. దీనికితోడు కొద్దిపాటి వర్షానికే రహదారి ఛిద్రంగా మారుతోంది. గోతులు వర్షపు నీటితో నిండిపోయి ప్రమాదకరంగా ఉంటోంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ చూపి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గోతులమయంగా టంగుటూరు-పొదిలి రోడ్డు

మర్రిచెట్లపాలెం-దేవరపాలెం రోడ్డు అధ్వానం



గుంతలతో నిండిన దేవరపాలెం రోడ్డు

చీమకుర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిచెట్లపాలెం జంక్షన్ నుంచి దేవరపాలెంకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానస్థితికి చేరుకొని ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. ఈ రహదారి తాళ్లూరు మండలంలోని బొద్దికూరపాడు వరకూ వెళ్తుంది. రోడ్డు గుంతలమయమై వర్షం కురిసినపుడు నీరు గుంతల్లో చేరి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తక్షణమే ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి వాహనదారుల ఇక్కట్లు తొలగించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

నగరంలో కుక్కల నియంత్రణకు చర్యలు

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధికుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక కొత్తమామిడిపాలెంలో గల యానిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కుక్కల్లో సంతానోత్పత్తి కలగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపడుతున్నట్లు చెప్పారు. స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు ఆపరేషన్ చేయించి తిరిగి వదిలేస్తామన్నారు. రోజుకు 10 కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, బ్రహ్మయ్య, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కు.ని. ఆపరేషన్ చేసిన కుక్కను పరిశీలిస్తున్న కమిషనర్

మార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు

నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు వేగవంతం చేశారు. ఈ మేరకు శనివారం ఊరచెరువు మార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని కమిషనర్ వెంకటేశ్వరరావు చేపట్టారు. మార్కెట్‌లో షాపులు దక్కించుకున్న వారు వాటిని మూసేసి మార్కెట్ ఆవరణంలో అమ్మకాలు చేయడాన్ని గుర్తించి తొలగించామన్నారు. ఇకపై ఎవరికి కేటాయించిన షాపుల్లో వారే అమ్మకాలు జరుపుకోవాలని ఆదేశించారు. అలాగే మార్కెట్ లోపల, వెలుపల వైపు పూలు, పండ్ల దుకాణాల ముందు మార్కింగ్ చేశారు. ఆ గీత దాటి రావడానికి వీలు లేదని స్పష్టం చేశారు. మార్కెట్‌లోని రోడ్డుపైన తాత్కాలిక ఆక్రమణలతో ప్రజలకు ఇబ్బందులు దృష్ట్యా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ప్రతిరోజు టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు పర్యవేక్షిస్తారని, వ్యాపారులు ఎవరు కూడా షాపుల ముందు కార్పొరేషన్ గీసిన గీత దాటి వ్యాపారాలు చేయకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి

● సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని హామీ అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్‌చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట కె.సుబ్బమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. కార్యకర్త, హెల్పర్ బాధ్యతలను ఒక్క మినీ వర్కర్ చేయాల్సి రావడంతో పనిభారం పెరిగిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్‌తో సమానంగా వేతనాలు ఇవ్వాలని, వేసవి సెలవులు అమలుకాకపోగా అత్యవసర సమయాల్లో మినీ వర్కర్లకు సెలవులు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీల అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాలకొండయ్య, ఎన్.ధనలక్ష్మి, మున్నా, జయప్రద, సౌజన్య, డి. పద్మావతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న రమేష్

విద్యార్థులు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలి

● వైస్ చాన్స్‌లర్ మూర్తి

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి తమ కుటుంబసభ్యులకు, చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వైస్ చాన్స్‌లర్ మూర్తి పేర్కొన్నారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో గుర్తింపు పొందిన కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం స్థానిక కళాశాల ప్రాంగణంలో అంతర్ కళాశాలల టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. విజేతలకు వైస్ చాన్స్‌లర్ చేతుల మీదుగా పతకాలను అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు యూనివర్శిటీ తరుపున ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ దేవీప్రసాద్, జి.సోమశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ సాయిసురేష్, బి.రమేష్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ మూర్తి

సమాజ అభివృద్ధిలో వారధిగా జర్నలిస్టులు

● ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు



దుప్పట్లను అందజేస్తున్న ఐవీ.సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో వారధిగా జర్నలిస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులోని మాతాశిశు వైద్యశాలలో యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కుష్టువ్యాధిగ్రస్తులకు దుస్తులు పంపిణీ చేశారు. యూనియన్ కార్యదర్శి దాసరి కనకయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐవీ మాట్లాడుతూ వేజ్ బోర్డు ఆదేశాలు అమలు చేయకపోవడంతో జర్నలిస్టులకు కనీస జీతభత్యాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వివక్షతతో కనీసం అక్రిడిటేషన్ కార్డులు కూడా మంజూరు కాలేదని చెప్పారు. వచ్చే జనవరి నాటికి నూతన అక్రిడిటేషన్ కార్డులు అర్హులైన వారందరికీ మంజూరు చేసేలా ప్రభుత్వం, సమాచారశాఖ మంత్రి హామీ ఇచ్చారని ఐవీ తెలిపారు. అనంతరం రోగులకు దుప్పట్లు, టవళ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలుగుల సురేష్, బి.వెంకట్రావు, శంకర్, శ్రీనివాసరావు, మురళీ, శ్రీనివాసరావు, కోటిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కారుసాల అశోక్, బేతాళ శ్రీనివాసరావు, డాక్టర్ కాట్రగడ్డ రజిత, మానస, ఎల్‌టీ.కృష్ణలీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మర్రిచెట్లపాలెంలో గ్యాస్ సిలిండర్ లీక్

చీమకుర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) మర్రిచెట్లపాలెం వద్ద టిఫిన్‌షాప్‌లో శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయ్యి మంటలు చెలరేగాయి. దుకాణంలో ఉన్న వ్యక్తులు ప్రమాదాన్ని గ్రహించి ఒక్క ఉదుటున బయటకు రావటంతో ప్రాణప్రమాదం తప్పింది. సీఐ సుబ్బారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు బ్రాహ్మణ కార్తీక సమారాధన

మద్దిపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలోని బ్రాహ్మణ సత్రంలో ఆదివారం కార్తీక సమారాధన జరుగుతుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. బ్రాహ్మణులు పాల్గొనాలని వారు కోరారు.

ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

చీమకుర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం, మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలుపై డ్వామా పీడీ జోసెఫ్ శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గృహనిర్మాణాలను సత్వరమే ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు ఎస్సీల అభివృద్ధికి ఉపాధి నిధులు కేటాయించాలని కోరారు. పరిశీలించాలని అధికారులకు ఆయన సూచించారు. అదేవిధంగా మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, కమిషనర్ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డీడీఎంఎస్ కార్యాలయాన్ని ఒంగోలులో ఏర్పాటు చేయాలి

చీమకుర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ కార్యాలయాన్ని ఒంగోలులో ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, ది చీమకుర్తి ఏరియా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కాలం సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం భద్రతా వారోత్సవాలు ముగింపు సభ ఒంగోలులో జరుగుతున్న సందర్భంగా మైన్స్ సేఫ్టీ ఉన్నతాధికారులు పాల్గొంటారని, ఇపుడైనా వారు ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. డీడీఎంఎస్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయటం వెనుక ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు. వేల మంది కార్మికులు పనిచేస్తున్న చీమకుర్తి సమీపంలో కార్యాలయం లేకపోవటం, పక్క రాష్ట్రంలో ఏర్పాటు చేయటంతో క్వారీల్లో భద్రతకు భరోసా లేకపోయిందని, ఉన్నతాధికారులు స్పందించి ఒంగోలులో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

బాలలు అన్ని రంగాల్లో రాణించాలి

మద్దిపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బాలలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో ఆంజనేయులు కోరారు. శనివారం గుండ్లాపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన బంగారు బాల్యం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం ప్రభాకర్ మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని చెప్పారు.

నేర చర్యలను ఆదిలోనే ఖండించాలి

● హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్

కొండపి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): నేర చర్యలను చిన్నతనంలోనే పసిగట్టి ఆదిలోనే తల్లితండ్రులు ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. కొండపిలోని మండల పరిషత్ సమావేశం హాలులో శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వయస్సుతో నిమిత్తం లేకుండా బాలికలు, యువతులు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను చూస్తే బాధేస్తున్నదని, ప్రతి ఒక్కరూ చట్టాలను వినియోగించుకుని రక్షణ పొందాలని సూచించారు. తహసీల్దార్ మురళి మాట్లాడుతూ మహిళలు సమాజంలో మార్పులను గమనించి ముందడుగు వేయాలని సూచించారు. అడ్వకేట్లు పి.ఫణికుమారి, కె.సులోచన చట్టాలను వివరించారు. ఎంపీడీవో రామాంజనేయులు, కోఆర్డినేటర్ కె.కల్యాణ్, ఏపీఎం వి.గోపీనాథ్, కోర్టు సిబ్బంది కోటేశ్వరి, సుధారాణి, పారాలీగల్ బాధ్యులు హరిబాబు, మస్తాన్, వినోద్ పాల్గొన్నారు.

వరి నారుమళ్లలోకి చేరిన వర్షపు నీరు

● ఆందోళనలో రైతులు

నాగులుప్పలపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు కనపర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని డ్రాపు వద్ద పొలాల్లోని వరి నారుమళ్లలోకి వరదనీరు పెద్ద ఎత్తున చేరింది. పలువురు రైతులు ఇప్పటికే నాట్లు పూర్తి చేయగా అవి సైతం నీట మునిగాయి. ఎత్తిపోతల పథకం పరిధిలోని చివరి లోతట్టు భూములు కావడంతో ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీరు మాచవరం, రాపర్ల, కనపర్తి, అమ్మనబ్రోలు తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన నారుమళ్లలోకి చేరాయి. ఇన్ని రోజులు కష్టపడి సాగు చేసిన నారుమళ్లు మునిగిపోయే దశలో ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

11న గీతాజయంతి శోభాయాత్ర



మాట్లాడుతున్న ట్రస్ట్ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా డిసెంబరు 11న ఒంగోలులో భారీస్థాయిలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు సనాతన హిందూ ధర్మసాధన ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. శనివారం స్థానిక ఎంసీఏ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోటేశ్వరానందస్వామి, అధ్యక్షులు నరసింహానందస్వామి, జనరల్ సెక్రటరీ కృష్ణమోహనానందస్వామి మాట్లాడుతూ డిసెంబరు 11న శోభాయాత్ర, 18 అధ్యాయాలు గీతా పారాయణ, గాయత్రి మహా మృత్యుంజయ యజ్ఞం, 108 యజ్ఞగుండాలతో హోమం, గీతాపారాయణ పోటీలు, వెయ్యిమందికి అన్నసంతర్పణ మొదలైన కార్యక్రమాలు ఉంటాయన్నారు. శ్రీలంక దేశం నుంచి బౌద్ధ భిక్షువులు అధిక సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. కనుక హిందువులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో ట్రస్ట్ సెక్రటరీ అబ్బూరి చిరంజీవి, కోశాధికారి సీహెచ్.శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీని బలోపేతం చేసే దిశగా చర్యలు

● పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రంగారావు తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని పార్టీని బలోపేతం చేస్తానని తెలిపారు. అనంతరం పలువురు రవిబాబును సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపట్నం ఎంపీపీ అంకపోతు అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆద్ని, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, గంగవరపు ప్రవీణ్ కుమార్, వై.వెంకటేశ్వరరావు, కె.శంకర్, షేక్ మీరావలి, నాగూర్, ఓబుల్‌రెడ్డి, గుడ్డల వెంకటేశ్వర్లు, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులను అర్హులైన వారికి ఇవ్వాలి



డీఈవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో అపరిష్కృతగా ఉన్న ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శనివారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న కేవీ.సురేష్‌కు మూడు నెలల క్రితం ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సకాలంలో అర్హులైన ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు లభించక నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షుడు మామిడి రమణారావు, కోశాధికారి ఈదర విజయభాను, ప్రతినిధులు సి.తారకరామారావు, శ్రీనివాస్, ఆర్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మాగుంట సంతాపం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ శాసనసభ్యుడు నారా రామ్మూర్తినాయుడు మృతి పట్ల ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. రామ్మూర్తినాయుడు తనకు చిరకాల మిత్రుడని, ఆయన మృతి బాధాకరమని సంతాపాన్ని వ్యక్తం చేశారు.

విజయవాడలో మహాధర్నా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలని, అమ్మకువందనం రూ.15వేలు ప్రతి విద్యార్థికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ కోరారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మహాధర్నాలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.విజయ్, వీరస్వామి, దేవ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ అవకాశాలను అన్వేషించాలి




సదస్సులో మాట్లాడుతున్న సురేష్

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెరుగైన రేపటి కోసం కెరీర్ అవకాశాలను అన్వేషించాలని బెంగళూరు రాడార్ టెక్నాలజీ సెంటర్ మేనేజింగ్‌డైరెక్టర్ పి.సురేష్ పేర్కొన్నారు. ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బయట ప్రపంచంలో ఎన్నో రంగాలు ఉన్నాయని, ఒక్కొక్క రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. వాటిని ఉపయోగించుకొని తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ టెలికాం, స్పేస్ రంగం, ఇండస్ట్రియల్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే. మూర్తి, ఈసీఈ విభాగాధిపతి ఎం.అప్పారావు, డీన్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి హెచ్‌ఎంలు, ఎంఈవోలకు శిక్షణ

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఎంపిక చేసిన వారిని ఉప విద్యాధికారులు తప్పనిసరిగా రిలీవ్ చేసి పంపాలన్నారు. ఉదయం 7గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి ఆలయం

కొండపి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): కొండపిలోని అయ్యప్పస్వామి ఆలయం ఏడవ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గణపయ్య, అయ్యప్ప, కుమారస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. అయ్యప్పకు ప్రత్యేకంగా వివిధ పండ్లతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. పడిపూజ, అన్నదానం చేశారు.

ఆంధ్రజ్యోతి

ఆదివారం 17, నవంబరు 2024 ప్రకాశం 4 పేజీలు





మార్కాపురం
నియోజకవర్గం అంటే ప్రాణం.. ఆ ప్రాంత అభివృద్ధే ఆయన లక్ష్యం.. జనం బాగోగులను చూసుకోవడం ఆయన దినచర్య. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యం చేస్తూ, పాలకులను కదిలించేందుకు ఊరూరా పాదయాత్రలు చేపట్టిన ఘనాపాటి మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి. అందుకే కీలకమైన ఎన్నికలకు ముందు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన కాలికి దెబ్బతగిలి గ్రామలకు వెళ్లి ప్రజలను కలవలేకపోయినా వారు ఆదరించి గెలిపించారు. ఆ రుణం తీర్చుకునేందుకే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు కోసం అసెంబ్లీ లోపలా, బయటా తనదైన శైలిలో పనిచేయడం ప్రారంభించారు. గత ఐదు నెలలుగా ఆయన అటు సీఎంను, ఇటు మంత్రులను ఎవరిని కలిసినా ఆ రెండు అంశాలనే ప్రధానంగా ప్రస్తావిస్తూ అంతోఇంతో కదలిక తెచ్చారు. కిందిస్థాయిలో మార్కాపురం, పొదిలి పట్టణాల సుందరీకరణతోపాటు గ్రామాలలో రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి శ్రీకారం పలికారు. నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా పరుగెత్తి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. నమ్మినవారికి అండగా నిలవడంలో దూకుడుగా ముందడుగు వేస్తున్నారు. ఆయన తొలిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ప్రతిపక్షంలో ఉండటంతో ప్రజలు అర్థం చేసుకున్నారు. ఇప్పుడు అధికార పార్టీ శాసనసభ్యుడిగా లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తారని ఆశిస్తూ.. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకు సిద్ధమయ్యారు.



మార్కాపురం ఎమ్మెల్యే
కందుల నారాయణరెడ్డి
జన్మదినోత్సవ ప్రత్యేక సంచిక



పొదిలి అభివృద్ధి ప్రదాత నారాయణరెడ్డి


కొబ్బరికాయకొట్టి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కందుల (ఫైల్)

పొదిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం హయాంలో మండలంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న సమయంలో కందుల నారాయణరెడ్డి అభివృద్ధి పథంలో నడిపించారు. అభివృద్ధికి సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. కందుల హయాంలో మండలంలో మొత్తం రూ.30 కోట్లతో సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం శాసనసభ్యులుగా ఎన్నికైన తరువాత రూ.2.66కోట్లతో సీసీరోడ్లు మంజూరు చేయించారు. అదేవిధంగా రూ.15కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులు ఏర్పాటుకు పునాది వేశారు. ఎంతోకాలంగా ప్రమాదకరంగా ఉన్న కంభాలపాడు గ్రామ సమీపంలోని వంతెనను రూ.5 కోట్లతో ఏర్పాటు చేయించారు. నీటి సమస్య పరిష్కారం కోసం పట్టణంలో రూ.2కోట్లతో ప్రత్యేకంగా బోర్లు వేసి పైపులైన్ల ద్వారా నీరు అందించేందుకు కృషి చేశారు. గ్రామాల్లో లింకురోడ్ల ద్వారా సుమారుగా రూ.10కోట్లతో మట్టిరోడ్ల ఏర్పాటు చేశారు. చంద్రన్నబీమా ద్వారా 250 మంది లబ్దిదారులకు నిధుల అందించేందుకు ప్రత్యేక చొరవ చూపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 300ల మందికి రూ.70వేల రూపాయల చొప్పున మంజూరు చేయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఒక్కోక్కరికి లక్ష రూపాయల రాయితీ చొప్పున 500ల మందికి 50కోట్లు మంజూరు చేయించారు. ఆ విధంగా మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక చొరవ చూపారు. మండలంలోని కంబాలపాడు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందికరంగా ఉన్న పాత విద్యుత్‌లైన్లు తొలగించి కొత్తలైన్లు ఏర్పాటు చేసేందుకు ఇటీవల శంకుస్థాపన చేశారు. కొనకనమిట్ల మండలంలోని చిన్నారికట్ల సమీపంలో నాలుగు మండలాలకు సంబధించి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. కొనకనమిట్ల మండలం చౌటపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యలు తీర్చేందుకు కొత్త విద్యుత్ తీగలకు సంబంధించిన పనులు ప్రారంభించారు.


చిన్నారికట్లలో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే




2010లో మార్కాపురంలో డ్రైనేజీ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి, 2017లో సీసీరోడ్లను ప్రారంభిస్తూ, రాయవరం వద్ద రైతుల సమస్యలపై రోడ్డుపై భైఠాయించి ఆందోళన చేస్తున్న నారాయణరెడ్డి (ఫైల్)

కష్టేఫలి

- అదే నారాయణ గెలుపు మంత్రం
- కాంగ్రెస్ కంచుకోటలో పోరాడి నెగ్గిన నేత

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలో పశ్చిమ ప్రాంతం ఒకప్పుడు కాంగ్రెస్‌కు ఆ తర్వాత వైసీపీకి కంచుకోటగా గుర్తింపు ఉంది. 1980 దశకానికి ముందు కమ్యూనిస్టులే కాంగ్రెస్‌కు ప్రత్యర్థులు. అప్పుడప్పుడు కమ్యూనిస్టులను విజయం వరించినా కాంగ్రెస్ నేతల వ్యక్తిగత పొరపాట్లు అందుకు కారణంగా నిలచాయి. టీడీపీ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్‌కు పోటీ ఎదురైనా, అడపాదడపా ఆ పార్టీ ఓటములను చవిచూసినా, కాంగ్రెస్ రాజకీయ ఆధిపత్యమే ఆ ప్రాంతంలో కొనసాగింది. అలాంటి కాంగ్రెస్ కంచుకోటలో రెండున్నర దశాబ్దాలుగా టీడీపీ జెండా నీడన కష్టానే నమ్ముకొని ఫలితంగా రాబట్టుకున్న అరుదైన నేతగా కందుల నారాయణరెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

1983లోనూ, ఆ డివిజన్ మొత్తం టీడీపీ అభ్యర్థులు గెలుపొందినా, 1985లో కూడా కొనసాగిన ఎన్టీఆర్ గాలిలో కూడా అప్పటి మార్కాపురం, కంభం నియోజకవర్గాలు తిరిగి కాంగ్రెస్ వశమయ్యాయి. ఇక 2004 ఎన్నికల నాటికే రాష్ట్రంలో టీడీపీ వ్యతిరేక గాలి స్పష్టంగా కనిపించింది. ఆ దశలో కందుల నారాయణరెడ్డి ప్రత్యక్ష రాజకీయ ప్రవేశం చేశారు. టీడీపీ ద్వారా రంగంలోకి రావడం అందర్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఊహించినట్లే 2004 ఎన్నికల్లో కందులకు మార్కాపురం నియోజకవర్గంలో ఘోర పరాజయం ఎదురైంది. అయినా కందుల వెనుకడుగు వేయలేదు. 'మనకు టీడీపీ కరెక్టు కాదు, కాంగ్రెస్‌లో చేరండి' అంటూ బంధువులు కులాభిమానులు ప్రోత్సహించినా ససేమిరా అన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో కాలికి బలపం కట్టుకొని నియోజకవర్గ ప్రజాసంబంధాలు మెరుగు పర్చుకున్నారు. 2009 ఎన్నికల్లో రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా మార్కాపురంలో టీడీపీ అభ్యర్థిగా నారాయణరెడ్డి గెలిచారు. ఆ ఎన్నికల్లో అప్పటి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మిగిలిన 11 అసెంబ్లీ స్థానాల్లో, జిల్లాతో సంబంధం ఉన్న ఎంపీ స్థానంలోనూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. అయినప్పటికీ టీడీపీ అభ్యర్థిగా ఒక్క నారాయణరెడ్డి మాత్రమే మార్కాపురంలో గెలవటం విశేషం. రాజకీయంగా నిర్దిష్ట విధానం, నియోజకవర్గం అభివృద్ధి, ఆ ప్రాంత ప్రజల బాగోగులు పట్ల అంకితభావంతో పనిచేయడమే ఆయన గెలుపునకు కారణమయ్యాయి. 2004లో దివంగత రాజశేఖర్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ నాటికే రాజకీయాల్లో కులాల ప్రభావం కనిపించింది. 2009 నాటికి అది ఇంకాస్త పెరిగింది. రెడ్డి సామాజిక వర్గీయుల రాజకీయ ఆధిపత్యం అధికంగా ఉండే మార్కాపురంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అదే సామాజిక అభ్యర్థిపై నారాయణరెడ్డి గెలుపొందారు. దీంతో రాష్ట్రమంతా చర్చనీయాంశమైంది. కాగా 2014 ఎన్నికల నాటికి మారిన రాజకీయ పరిణామాల్లో జగన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడింది. జగన్ పట్ల ప్రత్యేకించి రెడ్డి సామాజికవర్గ నాయకుల్లో ఆకర్షణ పెరిగింది. దీంతో ఆ ఎన్నికల్లోనూ, 2019 ఎన్నికల్లోనూ, వైసీపీకి ప్రత్యేకించి ఆ ప్రాంతంలో రాజకీయ అధికారం చెలాయించే రెడ్డి సామాజిక వర్గీయుల్లోను, దళిత, గిరిజన మైనార్టీ వర్గీయుల్లో ఆదరణ పెరిగిన విషయం తెలిసిందే. దీంతో 2014, 2019 ఎన్నికల్లో ఆ ఆదరణే నారాయణరెడ్డి అపజయానికి కారణమయ్యాయి. వెంట వెంటనే రెండు పర్యాయాలు ఓడిపోవటం అంతకు ముందు ఒక పర్యాయం గెలిచినా ప్రతిపక్షంలో ఉండటం, తొలిపర్యాయం ఓడిపోయినా ప్రతిపక్షంలో ఉండడం, ఇలా వరుసగా ఆయనకు రాజకీయంగా కాలం కలిసి రాలేదు. దీనికి తోడు ఆర్థికంగా కష్టాలు ఎదురయ్యాయి. దీంతో పార్టీ మారమని, జగన్ చెంతకు చేరాలని ఆయనపై స్థానికంగా కొందరు ఒత్తిళ్లు కూడా చేశారు. అయినా ఆయన టీడీపీని వీడలేదు. గత పాతికేళ్లుగా గెలుపు ఓటములు ఎలా ఉన్నా రాజకీయంగా పార్టీలు మారని నేతగా నారాయణరెడ్డి గుర్తింపు పొందారు. అలా పార్టీ మారకుండా ప్రధాన రాజకీయ పార్టీల్లో కొనసాగుతున్న జిల్లాలోని అతికొద్ది మంది నాయకుల్లో నారాయణరెడ్డి ఒకరుగా చెప్పుకోవచ్చు. అలా అనుకూల రాజకీయ పరిస్థితులు ఉన్నప్పటికీ, నియోజకవర్గంలో నిర్దిష్టమైన రాజకీయ లక్ష్యం, అంత కన్నా ఆ ప్రాంత అభివృద్ధి పట్ల ఆసక్తి, ఆ ప్రాంత ప్రజలతో పెంచుకున్న అనుబంధం ఆయన రాజకీయ ఎదుగుదలకు తోడ్పడ్డాయి. అవే గత ఏప్రిల్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయానికి సోపానాలయ్యాయి. నిర్దిష్టమైన రాజకీల లక్ష్యం, విధానాలు అంతకుమించి కఠోర శ్రమతో ముందుకు సాగితే రాజకీయాల్లో విజయాలు లభిస్తాయనేది నారాయణరెడ్డి రాజకీయ జీవితం ఒక ఉదాహరణ. అయితే తొలిసారి అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన దూకుడుగా ముందుకు పోతున్నాడనే విమర్శ కూడా లేకపోలేదు. మరి పాతికేళ్ల కష్టానికి ఫలితంగా లభించిన విజయాన్ని సుస్థిరం చేసుకుంటాడా..? లేదా..? అనేది వేచిచూడాల్సి ఉంది.


విజయవాడలో రాష్ట్ర మంత్రులు, సహచర ఎమ్మెల్యేల సమక్షంలో కేకు కట్ చేస్తున్న నారాయణరెడ్డి

విజయవాడలో జన్మదిన వేడుకలు

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు విజయవాడలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయనకు జన్మదిన శభాకాంక్షలు తెలిపారు. మంత్రులు కింజారపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముత్తుముల అశోకొరెడ్డి, ఏలూరి సాంబశివరావు, ఎంఎం.కొండయ్య యాదవ్, నరేంద్ర వర్మ, చింతమనేని ప్రభాకర్, కాకర్ల సురేష్, బొడే ప్రసాద్, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం అభివృద్ధిలో 'కందుల' ముద్ర

- ప్రజా సమస్యల పరిష్కారంలో అలుపెరగని పోరాటం
- వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా సాధనే లక్ష్యంగా ముందుకు


వెలిగొండ ప్రాజెక్టు నమూనాను మంత్రులకు వివరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పశ్చిమ ప్రకాశానికి వరప్రదాయిని అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఏడు డయా మీటర్ల వ్యాసార్థంతో 2005లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి దోర్నాల వద్ద మొదటి సొరంగం పనులు ప్రారంభించారు. ఆ సమయంలో టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న కందుల నారాయణరెడ్డి ప్రాజెక్టును పరిశీలించారు. ఒక టన్నెల్ ద్వారా నీటితో జలాశయాన్ని నింపాలంటే సాధ్యం కాదని గ్రహించారు. 9 డయా మీటర్ల వ్యాసార్థంతో రెండో టన్నెల్ నిర్మాణం చేపట్టాలని 2006లో కందుల నారాయణరెడ్డి పశ్చిమ ప్రకాశం మొత్తం పాదయాత్ర చేశారు. దీంతో దిగివచ్చిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండో టన్నెల్‌ను నిర్మాణాన్ని చేపట్టింది.

మార్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశంలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం మార్కాపురం. నేతలెందరు మారినా ఈ ప్రాంత తలరాత మారలేదు. ఈ క్రమంలో 2004లో కందుల నారాయణరెడ్డి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 35 ఏళ్ల వయసులోనే తొలిసారి ఎమ్మెల్యేగా టీడీపీ తరపున పోటీచేశారు. ఆ సమయంలో టీడీపీ రెబల్ అభ్యర్థిగా జంకె వెంకటరెడ్డి పోటీచేశారు. దీంతో ఓట్లు చీల్చడం, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం నేపథ్యంలో తొలిసారి ఆయన్ను ఓటమి పలకరించింది. అయితే యువకుడిగా రాజకీయంగా క్రియాశీలకంగా ఉన్నారు. అధికారం లేకపోయినా ప్రతిపక్ష పార్టీలో ఉన్నా నిరంతరం ప్రజల పక్షాన నిలిచారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశారు. ఈ క్రమంలో తొలుత పశ్చిమ ప్రకాశానికి జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకుంటున్న అవినీతిపై పోరుబాట పట్టారు. గొట్టిపడియ, సుంకేసుల డ్యామ్‌లకు నాసిరకం కంకర వాడటాన్ని నిరసిస్తూ అక్కడే రైతులతో కలిసి దీక్ష చేపట్టారు. దీంతో దిగివచ్చిన కాంట్రాక్టర్లు స్థానిక కంకరను మార్చి నాణ్యమైన కంకరను వినియోగించారు. అలా చిన్నదైనా, పెద్దదైనా ప్రజా సమస్యలన్నింటిపై అలుపెరగని పోరాటం చేశారు. అధికారం ఉన్నా లేకపోయినా టీడీపీలోనే కొనసాగారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని ఒమ్ము చేయకుండా ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నారు.


కలెక్టర్ అన్సారియాకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే

▸▸ ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన మార్కాపురం చెరువు పూడికతో నీటి నిల్వ సామార్థ్యాన్ని కోల్పోయింది. ఆ రోజుల్లో చెరువులో నీళ్లుంటే పట్టణానికి తాగునీటి ఎద్దడి నుంచి ఉపశమనం కలిగేది. 2009లో మార్కాపురం శాసనసభ్యులుగా ఉన్న కందుల నారాయణరెడ్డి ఉపాధి హామీ నిధులతో పూడికతీయాలని ప్రభుత్వ అధికారులను కోరారు. కానీ ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. పట్టణ ప్రజల భవిష్యత్తు కోసం 2010లో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో జిల్లా యంత్రాంగం దిగివచ్చి చెరువులో పూడిక తీసేందుకు కొన్ని సడలింపులు ఇచ్చింది.

2011వ సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా రైతులు కంది పంట నష్టపోయారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రస్తావించారు. అయినా ప్రభుత్వం స్పందించపోవడంతో మార్కాపురం కోర్టు కూడలిలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సుమారు రెండు రోజులపాటు ఆందోళనలు ఉధృతంగా సాగడంతో జిల్లా యంత్రాంగం కంది నష్టపోయిన రైతులకు పరిహారం అందజేసింది.

-2013లో కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విడగొడుతూ తీర్మానించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉవ్వెత్తున ఎగిసాయి. ఆ సమయంలో జిల్లాలో ఉన్న ఏకైక టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న కందుల నారాయణరెడ్డి సమైఖ్యాంధ్ర కోసం జిల్లా కేంద్రం ఒంగోలులో ఆమరణ దీక్షకు దిగారు. మూడు రోజుల పాటు దీక్ష కొనసాగించారు. నాలుగవ రోజు పోలీసులు బలవంతంగా నారాయణరెడ్డితో దీక్ష విరమింపజేశారు.

▸▸ 2014లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చినా ఎమ్మెల్యేగా నారాయణరెడ్డి ఓటమి చెందారు. అయినా అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో మార్కాపురం నియోజకరవ్గ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేశారు. ప్రధానంగా స్థానిక ఆర్టీసీ డిపో నుంచి మార్కెట్ యార్డు వరకు, కోర్టు సెంటర్ నుంచి పూల సుబ్బయ్య కాలనీ వరకు రూ.20 కోట్ల నిధులతో సీసీ రహదారులు నిర్మించారు. అంతేకాక అత్యంత దారుణంగా ఉన్న మున్సిపల్ కార్యాలయాన్ని పునర్నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణం మొత్తం సాగర్ జలాలు అందించే పథకం పనులు పూర్తి చేయించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉపాధిహామీ నిధులతో సీసీ రహదారులు భారీ ఎత్తున నిర్మించేందుకు నిధులు రాబట్టారు. పట్టణానికి ఆనుకుని నిర్మించిన జాతీయ రహదారి-565లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం దక్కేలా చొరవ చూపారు.

▸▸ 2019 నుంచి 2024 మధ్యలో రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్నా నియోజకవర్గంలోని సమస్యలపై ఎప్పటికప్పుడు నిలదీస్తూ పోరాటాలు చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిన వివక్షను నిరసిస్తూ సైకిల్ యాత్ర చేపట్టారు. అప్పటి నాయకులు మార్కాపురంలో సాగించిన భూదందాలను ఎప్పటికప్పుడు నిలదీస్తూ బాధితుల పక్షాన నిలిచి న్యాయం చేసేందుకు పోరాటాలు చేశారు. వెలిగొండ ప్రాజెక్టుకు నికర జలాలు కేటాయించాలంటూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం తిరిగి నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

▸▸ నియోజకవర్గ ప్రజలు 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కందులకు జైకొట్టారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేయడం, మార్కాపురం జిల్లా సాధించడమే ధ్యేయమని ఎన్నికల్లో స్పష్టంగా చెప్పారు. ఆ దిశగా సాధన కోసం కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మార్కాపురం ప్రాంతంలో తీవ్ర వర్షాభావంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. మరీ ముఖ్యంగా మార్కాపురం పట్టణ ప్రజలకు సాగర్ జలాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రంగంలోకి దిగిన రాష్ట్ర జలవనరులశాఖమంత్రి నిమ్మల రామానాయుడు ప్రకాశం జిల్లాకు సాగర్ జలాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ఈ ప్రాంతానికి ఎంతో కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రాధాన్యతను సహచర ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టును సందర్శించి పూర్తి నివేదికను అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో గత నెల 29న జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా మంత్రులు గొట్టిపాటి రవి, స్వామిల. జలవనరులశాఖ ఉన్నతాధికారులతో కలిసి వెలిగొండ ప్రాజెక్టును సందర్శించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అదేవిధంగా మార్కాపురం నియోజకర్గానికి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రూ.5 కోట్ల ఉపాధిహామీ నిధులు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సాధించారు. మార్కాపురం నుంచి తర్లుపాడు వరకు డబుల్ రోడ్డుకు రూ.15 కోట్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపేలా చర్యలు తీసుకున్నారు.










మాకు అత్యంత ఆప్తులు మా శ్రేయోభిలాషి
మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు
కందుల నారాయణరెడ్డి గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
Aspire Spaces Private limited
Hyderabad


జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ మాగుంట
శ్రీనివాసులురెడ్డి గారు
పార్లమెంట్ సభ్యులు, ఒంగోలు
నిస్వార్థ ప్రజా సేవకులు, నియోజకవర్గ
అభివృద్ధి కోసం ప్రతిక్షణం పరితపించే
అవిశ్రాంత యోధుడు,
మార్కాపురం జిల్లా, వెలుగొండ ప్రాజెక్టు
సాధనే ధ్యేయంగా పరితపిస్తున్న నిత్య శ్రామికుడు,
మాకు అత్యంత ఆప్తులు,
మా ప్రియతమ
నాయకులు,
మా మామ
మార్కాపురం
శాసనసభ్యులు
శ్రీ కందుల
నారాయణరెడ్డి గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
వెన్నా నాగార్జునరెడ్డి
రాక్‌వెల్ స్కూల్ (CBSE)
VNR బిల్డర్స్, మార్కాపురం
శ్రీ కందుల నారాయణరెడ్డి గారు
శాసనసభ్యులు, మార్కాపురం
వెన్నా నరేంద్రరెడ్డి
యమున స్లేట్ ఇండస్ట్రీస్
మార్కాపురం
సూర బెరెడ్డి కౌషిక్

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రతి కార్యకర్త టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. ఆయన పిలుపు మేరకు ఎర్రగొండపాలెం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలోని ప్రజలకు సభ్యత్వం ద్వారా కలిగే లాభాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. శనివారం ఎర్రగొండపాలెం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ క్లస్టర్, యూనిట్ బూత్ ఇనచార్జులు మండల పార్టీ అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసి ప్రతి ఒక్కరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

సచివాలయ ఉద్యోగి మృతికి నివాళి

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని నర్సయపాలెం గ్రామంలోని సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముండ్ల సుదీర్ కుమార్ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడురి ఏరిక్షన్‌బాబు నాయకులతో కలసి సుదీర్ భౌతిక కాయాన్ని సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి నివాళులు అర్పించారు.

నారా రామ్మూర్తి నాయుడి మృతికి సంతాపం

ఎర్రగొండపాలెం రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ మూర్తినాయుడు మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించిందని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఏరిక్షన్ శనివారం ఒక ప్రకటన ద్వారా సంతాపం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

రామ మూర్తి చిత్తురు జిల్లా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని అన్నారు. మంచి తనానికి మారు పేరు నారా రామ్మూర్తి అని అన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరలేనిదని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుహూతి తెలియజేశారు.

కోతులను బెదరగొట్టే ఉపకరణం వచ్చిందోచ్!



కోతులను బెదరగొట్టే గన్‌ను పరిశీలిస్తున్న స్థానికులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో, మండలంలోని పలు ప్రాంతాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు, రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో మార్కాపురం పట్టణంలో శనివారం కోతులను బెదరగొట్టే సాధనాలు విక్రయించేవారు వచ్చారు. ఈ సాధనం కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపించారు. మహారాష్ట్రకు చెందిన వ్యాపారి సాగర్ మోహితీ మాట్లాడుతూ.. పీవీసీ పైపులు, గ్యాస్ లైటర్ ఉపయోగించి సాధనం తయారు చేశామన్నారు. ఈ సాధనంలో గ్యాస్ వెల్డింగ్‌లో ఉపయోగించే కార్బైడ్ వేసి కాసిన్ని నీరు పోస్తే చాలని, గ్యాస్‌లైటర్ నొక్కగానే పెద్దశబ్ధం వస్తుందన్నారు. దీంతో కోతులు బెదిరిపోతాయని తెలిపాడు. పంట పొలాల్లో పక్షులను తోలేందుకు కూడా ఉపయోగించవచ్చన్నారు. దీని వినియోగాన్ని ప్రయోగాత్మకంగా చూపించటంతో ప్రజలు కొనుగోలు చేశారు. ఈ సాధనం విపరీతంగా ఆకట్టుకుంది.

సినీ నటుడు పోసానిపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మార్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్.నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు పోసాని కృష్ణమురళిపై టీడీపీ కూటమి నాయకులు శనివారం టూ టౌన్ ఎస్సై రాజమోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి మాట్లాడుతూ వైసీపీ నాయకులు, సానుభూతిపరులు కూటమి ప్రభుత్వంలోని పెద్దలపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పిర్యాదు చేసిన వారిలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సాదిక్, టీడీపీ నాయకులు కనిగిరి బాలవెంకటరమణ, పఠాన్ ఇబ్రహీం, దొడ్డా రవికుమార్, మేడిద రంగస్వామి, మల్లిఖార్జునశర్మ, దుర్గేష్ తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి శంకుస్థాపన



కొబ్బరికాయ కొడుతున్న నేతలు

పుల్లలచెరువు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐటివరంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. శనివారం ఐటివరంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో స్థలానికి భూపూజ చేశారు.ఎన్టీఆర్ విగ్రహాన్ని తమ గ్రామంలో ఏర్పాటు చేయడం తమ అదృష్టం అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోట్ల గోవిందులు,మన్నెయ్య, గ్రామ టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.















విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెద్ద దోర్నాల,నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలలో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొలుత గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణాల చిత్రపటాలకు గ్రామకార్యదర్శి శివ కోటేశ్వరరావు, పీఈటీ రామానాయక్, పీడీ గోపిరెడ్డి గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు

గిద్దలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారులు రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎ.శివకోటేశ్వరరావు, గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఉపాధ్యాయులు ఆదినారాయణ అన్నారు. స్థానికశాఖ గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, రంగనాథన్, సర్వోత్తమరావు, నాగభూషణం, కాశీనాథుని నాగేశ్వరరావులను విద్యార్థులకు వివరించారు. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మార్కాపురం రూరల్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి). మండలంలోని రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది సంయుక్తంగా విద్యార్థులకు బాలలహక్కులపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ లలిత సలోమి మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను వారు సంపూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బాల బాలికలకు వయస్సు రీత్యా వస్తున్న మార్పులను గమనిస్తూ వైద్యులు, పెద్దల సూచనలను పాటించాలని కోరారు. విద్యార్థులు మంచి పౌష్టికాహారం సరైన సమయంలో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.రామకృష్ణ, ఎంపీఈవో బి.శ్రీకాంత్, వైద్యసిబ్బంది విమల, పి.నానెమ్మ, కే.విశ్రాంతమ్మ, జి.అంజనేయులు, రమాదేవి, పద్మ, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

గిద్దలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలసదనంలోని విద్యార్థులకు ముక్కెర నెమలిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కాశిరెడ్డి విద్యాసామగ్రిని అందచేశారు. కార్యక్రమంలో బాలసదనం ప్రిన్సిపాల్ ఝాన్సీ దాత ప్రతినిధి దుగ్గా రాజశేఖర్‌రెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బీ.ఎస్.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ ప్రజావేదిక

పొదిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023-24కు ఆర్థిక సంవత్సరం పనులపై శనివారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ 1వతేదీ నుండి 2024 మార్చి 31 ఆర్థిక సంవత్సరం వరకు నిర్వహించిన ఉపాధిహామి పథకం ద్వారా పనులపై సామాజిక తనిఖీలో ఈజీఎస్, పీఆర్‌లో జరిగిన 637 పనులకు రూ. 7.83కోట్ల విలువైన పనులకు ఆడిట్ చేసినట్లు తెలిపారు. ముందుగా డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి మాట్లాడుతూ 15వ విడత సామాజిక తనిఖీల్లో 13మంది సిబ్బందిపై రూ.21వేలు రికవరీకి ఆదేశించగా, కేవలం రూ.3వేలు మాత్రమే వచ్చాయన్నారు. పీడీ మాట్లాడుతూ ఉపాధిహామి పనుల నిర్వహణలో కూలీలతో పనులు చేయించే దగ్గర నుండి తిరిగి బిల్లు చెల్లించే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

రహదారికి అడ్డంకులు తొలగించాలి

తహసీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకుల నిరసన



ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

తర్లుపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానాగులవరంలోని చంద్ర బాబునాయుడు కాలనీకి వెళ్లే రహదారిలో అడ్డంకులు తొలగించాలని, టీడీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పుచ్చనూతల గోపినాథ్ చౌదరి మాట్లాడుతూ.. 2010లో గ్రామంలోని నిరుపేదలకు 40 పట్టాలను మంజూరు చేశారన్నారు. 2016లో గృహ నిర్మాణం పథకం కింద 40మంది లబ్ధిదారులు కాలనీలు నిర్మించుకున్నారు. ఈ కాలనీకి చంద్రబాబునాయుడు పేరు నామకరణం చేసుకున్నారు. ఈ కాలనీకి వెళ్లే రహదారిలో మందాటి శీను, మందాటి నాగమ్మలు రహదారి స్థలం తమ స్థలం అని పేర్కొన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, రహదారిని యథాతథంగా కొనసాగిచాలని మార్గనిర్దేశం చేసిందన్నారు. అయితే తహసీల్దార్ ఈ ఉత్వర్వులు అమలుచేయడం లేదన్నారు. తహసీల్దార్ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని గోపినాథ్ చౌదరి ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, రమణయ్య, పుల్లయ్య, చిన్న అంకయ్య తదితరులు పాల్గొన్నారు. దీనిపై తహసీల్దార్ విజయభాస్కర్‌ను వివరణ కోరగా న్యాయస్థానంలోనే సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

పంట భూముల్లో సాగును అడ్డుకుంటున్నారు

అటవీశాఖ అధికారులపై నెరజాముల తండావాసుల ఫిర్యాదు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్

పుల్లలచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న తమ భూముల్లో పంటలు సాగు చేసుకోకుండా ఫారెస్టు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని నరజాముల తాండ గిరిజన వాసులు మార్కాపురం సబ్ కలెక్టరు వెంకట త్రివినాగ్ ఎదుట వాపోయారు. శనివారం జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు ఆయన నరజాముల తాండలో ఫారెస్టు అధికారులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాండ పరిధిలో రెవెన్యూ భూములను ఫారెస్టు భూములు అని చెప్పి వ్యవసాయ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. వ్యవసాయ బోర్లు వేసుకోకుండా అడ్డుకుంటున్నారన్నారు. తమ భూముల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫారంలు ఏర్పాటును అడ్డుకున్నారని అన్నారు. ఎక్స్‌కవేటర్లను ట్రాక్టర్లను తాండాలోకి రానివ్వడం లేదని అన్నారు. తాము సాగు చేసుకుంటున్న భూములను యథావిధిగా సాగు చేసుకోనివ్వాలని కోరారు. పాత కర్నూలు జిల్లాలో రికార్డులు పరిశీలించి గిరిజనులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం సార్డు ఆధ్వర్యంలో వాల్‌పోస్టరును ఆవిష్కరించారు.

ఆర్టీసీలో సమయపాలన మాసోత్సవాలు

గిద్దలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో సమయపాలన మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. నెలరోజులపాటు సాగనున్న ఈ మాసోత్సవాలలో ప్రతి బస్సు నిర్ణీత సమయానికి బయలుదేరడం, నిర్ణీత సమయానికి గమ్యస్థానాలు చేరనుంది. తద్వారా ఆర్టీసీపై ప్రయాణికులకు నమ్మకాన్ని కలిగించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం మాసోత్సవాలను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సమయపాలన మాసోత్సవాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సమయానికి బస్సు బయలుదేరితే డ్రైవర్లకు కూడా అందోళన తగ్గుతుందన్నారు. ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు సైతం నిర్ణీత సమయాని కంటే 5 నిమిషాల వరకు అనుమతి ఉంటుందన్నారు. ఆ తరువాత అక్కడ బస్సు బయలు దేరుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) మౌనిక, గ్యారేజ్ ఇన్‌చార్జి గురువయ్య, యూనియన్ నాయకులు, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

సమయపాలన పాటిద్దాం

పొదిలి : ఆర్టీసీ కార్మికులు సమయపాలన పాటించి ప్రయాణికులను అనుకున్న సమయంలో వారివారి గమ్యస్థానాలకు చేర్చేందేకు కృషి చేయాలని ఆర్‌టీసీ డీఎం జే.సుందరరావు అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 16 నుండి డిసెంబరు 15వరకు జరిగే సమయ పాలన వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. ప్రతిరూట్‌లో తిరిగే సర్వీసులను కార్మికులు ప్రయాణీకులతో మమేకమై సోదరబావంతో ఉంటూ తగిన సమయానికి వారిని తమ గమ్యస్థానాలకు చేర్చేవిధంగా చొరవ చూపాలన్నారు. అలాంటప్పుడే ప్రయాణీకులకు ఆర్టీసీ బస్సులపై నమ్మకం కలుగుతుందన్నారు. అంతేకాకుండా ఆర్టీసీకి మంచిపేరు రావడంతోపాటు సంస్థకు తగినంత ఆదాయం వస్తుందన్నారు. ఆవిధంగా కార్మికులు ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించాలని కోరారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ



మార్కాపురంలో పండ్లు పంపిణీ చేస్తున్న జర్నలిస్టులు

మార్కాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ రమణ జర్నలిస్టులతో కలిసి వార్డుల్లో తిరిగి రోగులకు పండ్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పట్ల పోరాడుతోంది ఏపీయూడబ్ల్యూజేఎస్, ఐజేయూలని అన్నారు ఈ మధ్య కాలంలో ఉత్తరాఖండ్‌లో జరిగిన ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకు వచ్చేందుకు పోరాటాలు చేయాలని తీర్మానించారన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అర్హులైన విలేకరులందరికీ అక్రిడేషన్‌లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాల డాక్టర్లు కెప్టెన్ రాంబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకులు మూల అల్లూరిరెడ్డి, జీఎల్ నరసింహరావు, ఎస్‌కే సుభాని, డి.శరణ్ కుమార్, అన్ను, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు టి.నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి బి.సురేష్, ఎస్‌కే కరీం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో..

ఎర్రగొండపాలెం రూరల్: జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా ఎర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగులకు ఆరటి పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టు పిలుపు మేరకు ఎర్రగొండపాలెంలోని జర్నలిస్టులు ఈ సేవ కార్యక్రమాలు చేపట్టినట్లు జర్నలిస్టులు తెలిపారు.

విద్యార్థులలో చైతన్య భావాలు వికసించాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో చైతన్య భావాలు వికసించేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాథ్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 'బంగారు బాల్యం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలబాలికలను విద్యావంతులు చేసేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తోందన్నారు. బాల్యం, హక్కులు, విలువలు తెలియజేస్తూ, చైతన్య పరచడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డిప్యూటీ డీఈవో శ్యామ్యూల్ జాన్, కమిషనర్ నారాయణ, ఎంఈఓలు రామ్‌దాస్ నాయక్, టి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎం యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న పాస్టర్ కృపాకర్

పెద్ద దోర్నాల, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): స్థానిక అటవీ శాఖ అతిథి గృహం ప్రాంగణంలో ఏబీఎం యూత్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీ లను పాస్టర్లు కృపాకర్ ప్రారంభించారు. ఈ నెల 25న సెమీక్రిస్మస్ వేడుకల్లో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలియజేసింది. కార్యక్రమంలో దేవదానం, కిశోర్‌కుమార్, కాశీం, ఎలకపాటి లక్ష్మయ్య, వినయ్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభం

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు ఏటా నిర్వహించే అన్నదాన కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. తొలుత అర్చకులు అయ్యప్ప స్వామికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌లు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు తాడువాయి గోపాలమల్లికార్జునరావు, కార్యదర్శి పరుచూరి కృష్ణయ్య, కోశాధికారి దువ్వాడ వెంకట సత్యమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

పెద్ద దోర్నాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి శివకోటేశ్వరరావు సచివాలయ విధి విధానాలను వారికి వివరించారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన సాంకేతికపరమైన పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ నయాబ్ రసూల్, ఉపాధ్యాయులు ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖండ దీపం

గిద్దలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవస్థానంలో 15 రోజులపాటు సాగే అఖండ జ్యోతి పూజా కార్యక్రమం 17వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు కే.కొండయ్య, కార్యదర్శి రవీంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం సామూహికంగా విష్ణు సహస్రనామం, అష్టలక్ష్మీ స్తోత్ర పారాయణం నిర్వహించనున్నారు.

పబ్లిక్ నోటీస్

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

బీమా ప్రీమియం చెల్లించండి

కొనకనమిట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : పంటల బీమా ప్రీమియాన్ని రైతులు ఈనెల 18వ తేదీ నుంచి చెల్లించవచ్చని ఏవో ప్రసన్న రంగలక్ష్మి శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన పంటలు వరి, మొక్కజొన్న, జొన్న, మిరప, మినుము, పప్పుశనగ తదితర పంటలకు రైతు సేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించవచ్చన్నారు ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోళ్లవిడిపి గ్రామ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పి.చౌడయ్య అరెస్టు చేశారు. ముగ్గురు యువకులు గంజాయిని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారన్న సమాచాంతో శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు యువకుల వద్ద గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. వారిని ఆదుపులోకి తీసుకోని 1200 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎర్రగొండపాలేనికి చెందిన వి.బెనహర్, పి.సుభాని, ఆర్.శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి మార్కాపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్.ఐ తెలిపారు. గంజాయి అమ్మిన, కోనుగోలు చేసిన, దొరికిన కేసులు శిక్షలు తప్పవని హెచ్చరించారు.

బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు

గిద్దలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా కొండపేటకు చెందిన మండ్ల శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఈ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు బండి శ్రీనివాసులు ఆ మేరకు నియామక పత్రాన్ని మండ్ల శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ యూత్ అధ్యక్షులు బోదనబోయిన అరుణ్ కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

జాబ్‌కార్డులో నమోదుకు అవకాశం

● ఉపాధిహామీ పథకం ఏపీవో శైలజ

ఎర్రగొండపాలెం రూరల్ నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి నూతనంగా కొత్తవారిని నమోదు చేసుకొనే అవకాశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయని ఎర్రగొండపాలెం జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవో ఎం. శైలజ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ జాబ్‌కార్డులో 18 సంవత్సరాలు నిండిన వారిని జత చేసుకోవాలంటే ప్రస్తుతం ఆన్ లైన్ పనిచేస్తోందన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే కార్డులో ఎవరైనా మృతి చెంది ఉంటే వారిని తొలగించుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం గ్రామంలోని ఫీల్డ్‌అసిస్టెంట్‌లను ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.









ఆంధ్రజ్యోతి ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం ప్రతిరోజు క్లాసిఫైడ్స్

HOME LOANS

గత 18 సం॥లుగా బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ ద్వారా HOME LOANS, మార్టిగేజ్ లోన్స్ అన్ని రకముల లోన్స్‌ను డోర్ స్టెప్ ద్వారా సర్వీసు సంప్ర॥ సెల్: 9502466253, 9246460762
AJO-200333

HOUSE FOR SALE

ఒంగోలు కర్నూలు రోడ్డు మహాలక్ష్మీ కళ్యాణ మండపం ఎదురు రోడ్‌లో శ్రీ కృష్ణనగర్‌లో దక్షిణం ఫేస్ 2019లో నిర్మించిన 20 గదుల పార్కింగ్ వసతిగల ఇండిపెండెంట్ హౌస్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9703998899, 7569476242
AJO-200338

WANTED

ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, JLS మరియు సెక్షన్ ఇన్‌ఛార్జ్‌లు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర. 8500301111, 8712164111
AJO-340

మ్యారేజ్ సర్వీసెస్

వైశ్య 21 సంవత్సరం జాబ్ చేయు వధువుకి విదేశాల్లో ఉద్యోగం చేసే వరుడు కావాలి. 52 సంవత్సరాలు సెకెండ్ మ్యారేజ్, జీడిపప్పు ఫ్యాక్టరీ కలిగిన వ్యక్తికి వధువు కావాలి. సంప్ర॥ 9059473904.
AJG-191941

FLAT FOR SALE

2BHK ఒంగోలు సిటీ, బస్టాండ్ ఎదురు, డిబ్బల్ రోడ్డు, రాజు కాంప్లెక్స్, 3rd ఫ్లోర్, ఫ్లాట్ నెం. 1, 995 Sft, ఫుల్లీ Furnished, ఈస్ట్ ఫేస్, 35 చ॥గ॥ స్థలం, ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర॥ 81421 33335.
AJG-203264

పండ్ల తోట అమ్మకమునకు కలదు

తిరుపతి జిల్లా ఓజిలి మండలం ఆర్మేనుపాడు గ్రామంలో 133 ఎకరముల పండ్లతోట అమ్మకమునకు కలదు. సంప్ర: 94401 83778
AJN-193451

ఉద్యోగావకాశాలు

గుంటూరు SIMS College హాస్టల్‌లో పని చేయుటకు వార్డెన్స్ Male / Female కావలెను. సంప్ర॥ సెల్ : 7675963955, 97039 64444.
AJG-203719

రియల్ ఎస్టేట్

గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా, మరెక్కడైన అ॥కొ॥ జనచైతన్య మా ప్రత్యేకత. సంప్ర॥ 73823 96677.
AJG-45

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా ఇప్పుడు మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి.

జన్మదిన శుభాకాంక్షలు | వివాహ/షష్టిపూర్తి శుభాకాంక్షలు | విదేశీయాన / స్వదేశాగమన శుభాకాంక్షలు | లీగల్ నోటీసులు బ్యాంకు ప్రకటనలు | ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి. ప్రతి ప్రకటనపై GST 5% అదనం.

ఒంగోలు : 99854 11071, 97036 18694, 99854 11483
చీమకుర్తి : 96525 55752
చీరాల : 99859 21376
మార్కాపురం : 99859 21358
కందుకూరు : 97036 18697
కనిగిరి : 99854 11483
గిద్దలూరు : 99859 21358

ఆంధ్రజ్యోతి దినపత్రిక కొరకు సంప్ర॥ 9985411484


ర్యాలీలో పాల్గొన్న ఎంఈవోలు సుబ్బయ్య, సుధాకర్‌రావు

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

తాళ్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈవో జి.సుబ్బయ్య అన్నారు. బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివిధ పోటీలు నిర్వహించారు. బాలబాలికలతో భారీ ర్యాలీ నిర్వహించి బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 'మనం మన కోసం'అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, ఎంఈవో-2 సుధాకర్‌రావు, హెచ్‌ఎం శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు. వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాల(ఏఏ)లో జరిగిన వారోత్సవంలో హెచ్‌ఎం పొలంరెడ్డి సుబ్బారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రవికుమార్

దర్శి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని దర్శి మండల ప్రత్యేకాధికారి రవికుమార్ తెలిపారు. స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన బంగారు బాల్యం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్యదశలో కష్టపడితే భవిష్యత్తు బంగారు మయమవుతుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, సీడీపీవో భారతి, ఎంఈవోలు కె.రఘురామయ్య, రమాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

పీసీపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ ఆదేశించారు. పనులు చేయించడంలో అలసత్వం వహించే సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఈసీ, టీఏ, ఎఫ్‌ఏలకు శనివారం నోటీసుల ద్వారా ఆదేశించారు. మండలంలోని 18పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో పశువుల షెడ్‌ల నిర్మాణం, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్, ఫారమ్‌పాండ్స్ నిర్మాణాలు ఇప్పటివరకు 50 శాతం కూడా పూర్తిచేయించలేదన్నారు. డ్వామా పీడీ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈనెల 20లోగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయించాలన్నారు. పూర్తిచేయించని సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని సిబ్బందికి ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి


3వ వార్డులో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధికారులకు సూచించారు. దర్శి పట్టణంలోని 3వ వార్డులో శనివారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుకున్నారు. మంచినీటి కొళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నామని, మురుగు కాల్వలు ఏర్పాటుచేయాలని ఆప్రాంత ప్రజలు కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఇత్తడి సునీత దినకర్, పసుపులేటి దత్తాత్రేయ, బత్తుల త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


బాల్యవివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

కనిగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అన్ని అనర్థాలకు మూలం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లి హైస్కూల్‌లో శనివారం బంగారు బాలోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలందరూ విద్యలో రాణించి ఆసక్తి ఉన్న రంగంలో గుర్తింపు సాధించాలన్నారు. చిన్నవయసులోనే వివాహం చేసుకోవటంవల్ల బంగారు భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని అన్నారు.

బాల్య వివాహాలపై సూపర్‌వైజర్ పార్వతి అవగాహన కల్పించారు. బాల్యవివాహం ప్రోత్సహించినా, జరిపించినా చట్టరీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. బాల్య వివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవశర్మ, ఉపాధ్యాయులు జి.స్వప్న, భూలక్ష్మి, ఎంఎస్‌కే మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతి, ధనమ్మ, జ్యోతి, సహాయకురాలు భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దర్శి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పోస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ వై.రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ మనోభావాలను తెలియజేసేందుకు కొంతమంది పెడుతున్న పోస్టులు అభ్యంతకరంగా ఉంటున్నాయన్నారు. ఇతరుల గౌరవానికి భంగం కల్గించే విధంగా పోస్టులు పెట్టిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాట్సాప్‌లలో వచ్చిన పోస్టులను పరిశీలించకుండా ఇతరులకు పంపవద్దని సూచించారు. అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పబ్లిక్ నోటీస్

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

మృత్యుకుహరాలు.. దిగుడుబావులు

- ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే పొంచిఉన్న ప్రమాదాలు
- ఆదమరిస్తే అంతేసంగతులు
- పట్టించుకోని అధికారులు


మాధవరం గ్రామమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న దిగుడుబావి

తాళ్లూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఉన్న దిగుడు బావులు మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. తాళ్లూరు-తూర్పుగంగవరం ఆర్‌అండ్‌బీ మార్గంలో పలుచోట్ల ఉన్న బావులు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఈమార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తాళ్లూరు -కొత్తపాలెం మార్గంలో సాయిబాబాగుడి సమీపాన, మాధవరం గ్రామ మొదటి మలుపువద్ద, గ్రామ శివారున, లింగాలపాడు వద్ద, రజానగరం మార్గంలో నిరుపయోగంగా దిగుడు బావులు న్నాయి.

గతంలో ఈ దిగుడు బావులను వ్యవసాయానికి ఉపయోగించేవారు. కాలక్రమేణా అవి పాడుబడటంతో చెట్లతో నిండిపోయాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చేక్రమంలో అవి రోడ్డు పక్కకు దిగేటప్పుడు ఈ బావులతో ప్రమాదాలు పొంచిఉన్నాయి. ఎదురుగా వాహనం వచ్చేటప్పుడు పక్కకు వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఈమార్గంలో కొత్తగా వచ్చేవారు ఈ బావులు ఉన్న విషయం తెలియక ప్రమాదాలబారిన పడుతున్నారు. వర్షాలకు పిచ్చిచెట్లు మొలవడంతో బావి ఉన్న విషయం కూడా కన్పించటం లేదు. గడ్డి ఉన్న ప్రాంతమని పొరబడుతున్నారు.

మాధవరం మలుపు వద్ద రోడ్డును ఆనుకుని ఉన్న దిగుడు బావి సమీపాన రెండు పర్యాయాలు ఆటోలు బోల్తాపడ్డాయి. త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. గతంలో పశువులు మేత మేస్తూ ముందుకు వెళుతూ అందులోపడ్డాయి. దీంతో పశుపోషకులు వాటిని మేత కోసం తీసుకురావడానికి భయపడుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న దిగుడుబావులతో ప్రమాదాలు పొంచిఉన్నాయని పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో దిగుడు బావులతో ఏరూపంలో ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతూ వెళ్లాల్సి వస్తుందని వాహనచోదకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న దిగుడుబావులను పూడ్చివేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో బావులు ఉన్నచోట రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలను నిలువరించాలని వాహనచోదకులు, పశుపోషకులు కోరుతున్నారు.


లింగాలపాడు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డును అనుకుని ఉన్న దిగుడుబావి

బంగారు భవిష్యత్‌కు విద్యార్థులు బాటలు వేసుకోవాలి

ముండ్లమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగారు భవిష్యత్‌కు విద్యార్థులు బాటలు వేసుకోవాలని ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. ఉన్నత శిఖరాలకు చేరుకొనేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు కొనసాగించాలన్నారు. శనివారం ముండ్లమూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బంగారు బాల్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ, వినయం, వివేకం అలవర్చుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఎంఈవో ఎస్.సుబ్బారావు, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఆవుల సునీత, డీఆర్‌సీ కోఆర్డినేటర్ డేవిడ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సునీత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో జనార్దన్

క్రమశిక్షణతో విద్యార్థులు ముందుకు సాగాలి

దొనకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ముందుకు సాగుతూ బంగారు భవిష్యత్తును రూపుదిద్దుకోవాలని అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి సూచించారు. మండలంలోని గంగదేవిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వారి హక్కుల గురించి వివరించారు. బాల్య వివాహాలతో జరిగే నష్టాలను వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్వరాజ్యలక్ష్మి, పద్మ, రవణమ్మ, జె.రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురిచేడులో పెరిగిన కోతుల బెడద

- పిల్లలపై దాడులు చేస్తున్న వైనం
- ఆందోళన చెందుతున్న ప్రజలు


కురిచేడులో రోడ్డుపై కోతుల దండు

కురిచేడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కురిచేడులో కోతుల బెడద ఎక్కువయింది. పసి పిల్లలు, మహిళలపై దాడులు చేస్తుండటంతో గాయాలపాలవుతున్నారు. పంచాయతీ వారు కోతులను పట్టించి దూరంగా వదిలి రావాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కురిచేడు మేజర్ పంచాయతీలో కోతులు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో అక్కడక్కడా కనపడే కోతులు నేడు ఎక్కడపడితే అక్కడ కనపడుతున్నాయి. మందగా వస్తూ అకారణంగా దాడులు చేస్తున్నాయి. చిన్న పిల్లలు ఏదైనా క్యారీ బ్యాగ్‌తో కనపడితే ఇక అంతేసంగతులు. బ్యాగ్ లాక్కునే వరకు పిల్లలను అరుస్తూ భయపెడుతున్నాయి. పిల్లల చేతుల్లో ఉన్న వస్తువులు లాక్కుని చిందరవందర చేశాక మాత్రమే శాంతిస్తున్నాయి. ఎవరైనా కర్రతో బెదిరిసే వెనక్కి తగ్గినట్లే తగ్గి మందగా వచ్చి గాయపరుస్తున్నాయి.

కొద్ది సంవత్సరాల క్రితం పంచాయతీ అధికారులు కోతులను పట్టి శ్రీశైలం అడవుల్లో వదిలి వచ్చారు. ఈమధ్య కాలంలో వాటి సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఒక్కోసారి రోడ్డుపై కోతుల గుంపు ఉంటే వాటిని దాటి వెళ్లాలంటే ధైర్యం చాలని పరిస్థితి నెలకొంది. వెంటనే కోతులను పట్టి వాటి బెడద తగ్గించాలని కురిచేడు వాసులు పంచాయతీ వారికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పంటల్లో తెగుళ్ల నివారణకు

సస్యరక్షణ చర్యలు

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్


కంది పంటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్

దొనకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మిరప పంటలో కొమ్మతెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి. రమేష్ రైతులకు సూచించారు. మండలంలోని పోలేపల్లి గ్రామంలో క్షేత్ర సందర్శనలో భాగంగా శనివారం మిరప, కంది పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా వాతావరణంలో మార్పులతో మిరపలో కొమ్మ తెగుళ్ల ఆశించిందని చెప్పారు. మంచు, రాత్రి ఉష్ణోగ్రత తగ్గడంతో ఈ తెగుళ్ల ఉధృతి ఎక్కువవుతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములకు రెండు గ్రాముల ప్లాంటేమైసిన్ పది లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కంది పంటలో ఇప్పుడిప్పుడే మొగ్గ వస్తుందని చెప్పారు. తుట్టే పురుగు, మారుకా మచ్చల పురుగు రాకుండా ఎకరాకు ఒక లీటరు వేపనూనె లేదా వేపగింజల కషాయాన్ని చల్లాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ సహాయకులు వీరాంజనేయులు, విన్నిబాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం


మాట్లాడుతున్న ఏవో జ్యోష్నాదేవి

కనిగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంటల సాగుచేసే రైతులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని ఏవో జ్యోష్నాదేవి అన్నారు. మండలంలోని బడుగులేరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రపంచ దేశాలలో పొగాకు ఉత్పత్తి పెరుగుతున్న కారణంగా గత మూడు సంవత్సరాలలో ఉన్నంత డిమాండ్, ధరలు ఉండే పరిస్థితి లేదన్నారు. దీనిని గమనించి రైతులు తమకు కేటాయించిన పరిమాణంలోనే సాగు చేపట్టకుండా అదనంగా పొగాకు సాగు చేస్తున్నారన్నారు. దీంతో భవిష్యత్తులో పొగాకు దిగుబడి ఉన్నప్పటికీ ధరలు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు.

పొగాకు సాగుకు ప్రభుత్వం ఇచ్చిన పరిమాణంలో చేపట్టి అదనంగా ఉన్న భూమిలో మినుము, మొక్కజొన్న, శనగ, సజ్జ, కంది, మిరప, అలసంద, బొబ్బర్లు, పిల్లిపెసర లాంటి పంటలు సాగుచేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. పొగాకులో అనుకోని నష్టం వాటిల్లితే ఇతర పంటల్లో వచ్చిన లాభాలతో రైతులు గట్టెక్కవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో కాశీరావు, రాజేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.


ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న కాలువల్లోని మురుగు

పేరుకుపోయిన మురుగు తొలగింపు

పామూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరు రోడ్డులోగల కాలువల్లో పేరుకుపోయిన మురుగును పంచాయతి కార్యదర్శి జీవీ అరవింద శనివారం ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు చర్యలు చేపట్టారు. కాలువల్లో చెత్తచెదారంతో నిండిపోవడంతో మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో వర్షం నీరు రోడ్డుపైనే నిలిచిపోతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించిన కార్యదర్శి తొలగింపు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, మొంటా నరసింహారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత

తాళ్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-విఠలాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో తాళ్లూరు శివారున మలుపు వద్ద మురుగు నీరు నిలుస్తూ ప్రమాదకరంగా ఉండటంతో పూడికతీత పనులు చేపట్టారు. విఠలాపురం వెళ్లే మార్గంలో కాలువపూర్తిగా పూడి మురుగు నీరు రోడ్డుపై నిల్వ ఉంటుంది. మలుపు వద్ద మురుగునీరు రోడ్డుపై సగభాగంలోగుండా ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఇటీవల వేసిన తారురోడ్డు కూడా దెబ్బతింటున్నది. ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపానపోలేదు. ఎంపీడీవో కె.సుందరరామయ్య స్పందించి పూడికతీత పనులు చేయించాలని ఆదేశించారు. సర్పంచ్ చార్లెస్‌సర్జన్, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డిలు గ్రామపంచాయతీ నిధులతో పూడిక తీతపనులు చేయించారు. మహాలక్ష్మమ్మ చెట్టువద్ద నుంచి రోడ్డుకిరువైపులా పూర్తిగా పూడిపోయిన కాలువలో ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీయించి దిగువకు నీరు వెళ్లగొట్టారు. ప్రమాదకంగా ఉన్న రోడ్డు మలుపు వద్ద నీరు నిల్వలేకుండా చేయటంపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు

గ్రంథాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

దొనకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దొనకొండలో ప్రజల సౌకర్యార్థం గ్రంథాలయం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు తహసీల్దార్ రమాదేవికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రధాన రహదారి పక్కన శిథిలమైన రెవెన్యూ గ్రామచావడి ప్రదేశంలో గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలంటూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ రమాదేవి స్థలాలను పరిశీలించి ఆర్డీవో ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపి తగిన చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, పరుచూరి రామలింగయ్య, కుందుర్తి లక్ష్మణ్, ఆలంపల్లి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడు మృతి బాధాకరం

దర్శి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు అకాల మృతి బాధాకరమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఆయన తెలుగుదేశం పార్టీలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించటంతో పాటు చంద్రగిరి ఎమ్మెల్యేగా విశేష సేవలందించారని కొనియాడారు. కాణిపాకం వినాయక స్వామి ఆలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. రామ్మూర్తినాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి


మాట్లాడుతున్న రమణయ్య

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. శనివారం సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన సమావేశానికి ఆపార్టీ మండల అధ్యక్షుడు ఇండ్ల వెంకట సత్యం అధ్యక్షత వహించారు. రమణయ్య మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం ఆధారంగా సభ్యత్వాన్ని పెంచాలన్నారు. ప్రతి మండలంలో 25 మందితో క్రియాశీల సభ్యులుగా పూర్తిస్థాయి మండల కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రెబ్బా రాయుడు, ఆర్.చౌడయ్య, మేకల తిరుపతయ్య, ఆర్.నారాయణ, కె.మహాలక్ష్మమ్మ, సంగిశెట్టి బాలయ్య, చెన్నంశెట్టి నారాయణ, ఉమ్మడిశెట్టి శ్రీను, పెరమన విజయకుమార్‌చారి పాల్గొన్నారు.

పొగాకు సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలి

పామూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు అనుమతులు ఇచ్చిన విస్తీర్ణం మేరకే సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి కె.రాధ పేర్కొన్నారు. అదనంగా సాగు చేసి నష్టాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. మండలంలోని బోడవాడ గ్రామంలో శనివారం పొగాకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన కంది, శనగ, మినుము జొన్న సాగుచేయాలని సూచించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ముండ్లమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న 108 కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎంపీపీడీవో ఆర్.జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 108 సర్వీసులను నేరుగా నిర్వహించాలన్నారు. ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. 108 సేవల్లో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నీ వెంటనే భర్తీచేయాలని కోరారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అటెండర్ మృతి

కురిచేడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కురిచేడు తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కాశీం(57) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కొద్దికాలం క్రితం దొనకొండ తహసీల్దార్ కార్యాలయం నుంచి కురిచేడుకు బదిలీపై వచ్చారు. శనివారం సాయంత్రం విధులు ముగించుకొని తాను నివాసం ఉంటున్న దొనకొండకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈక్రమంలో పొట్లపాడు సమీపంలో రోడ్డు చప్టా వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

యువకుడికి తీవ్రగాయాలు

ముండ్లమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన నంబూరి రాంబాబు అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా దర్శి వైపు నుంచి నరసరావుపేట వెళ్తున్న కారు ఢీకొనటంతో గాయపడ్డారు. అద్దంకిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. రాంబాబు తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 17 నవంబరు 2024



ముఖ్యమంత్రితో ఎంపీ



ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సహచర ఎంపీలతో కలిసి సమావేశమయ్యారు. నిధులు, ఇతర అంశాలపై చంద్రబాబు ఎంపీలతో కలిసి కేంద్రమంత్రులతో ప్రత్యేకంగా చర్చించారు.

కాలమ్-6.. సరిదిద్దారు

- అడంగల్ అవస్థలకు చెక్
- భూ విక్రయాలకు లైన్‌క్లియర్
- మూడేళ్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం
- తెనాలిలో రెవెన్యూ శాఖ ప్రయోగం విజయవంతం
- ఈ దిశగా అంతటా పరిష్కారం చూపితే ఫిర్యాదులు తగ్గినట్లే

భూ రికార్డుల ఆధునికీకరణలో జరిగిన పొరపాట్లు.. వైసీపీ హయాంలో చేసిన తప్పులు.. భూ యజమానులకు గుదిబండగా మారాయి. తరతరాల నుంచి వచ్చినా.. రెక్కల కష్టంతో కొనుగోలు చేసినా.. అవి ప్రభుత్వ భూములుగా చూపించడంతో యజమానులు విలవిలలాడిపోయారు. క్రయవిక్రయాలు లేక అల్లాడిపోయారు. కాలమ్ నంబరు-6లో సవరణ.. వేల మంది భూ యజమానులకు సంకటంగా మారింది. అత్యవసర సమయంలో అమ్ముకుంటే ఆర్థికంగా అండగా ఉంటుందనుకున్న భరోసాతో ఉన్న యజమానులకు అడంగల్‌లో జరిగిన లోపాలు కొరకరాని కొయ్యగా మారాయి. ప్రభుత్వం పట్టించుకోలేదు. అధికారులు సమస్యపై దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి శ్రీకారం చుడితే, ఇందులో అందుతున్న ఫిర్యాదుల్లో ఈ తరహావే 60 శాతం ఉన్నాయంటే సమస్య తీవ్రతకు అద్దంపడుతుంది. ఈ తరుణంలో గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టిపెట్టారు. తప్పు జరిగిన మూలాలనే సరిదిద్దే కార్యక్రమం చేపట్టడంతో రైతుల సమస్య కు పరిష్కారం లభించింది.





తెనాలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూముల రికార్డులను కంప్యూటరీకరించే సమయంలో జరిగిన పొరపాట్లు రైతుల మెడకు గుదిబండలా మారాయి. రైతులకు అడంగల్‌లోని కాలమ్ నంబరు-6లో జరిగిన లోపాలు కొరకరాని కొయ్యగా మారాయి. అమ్మబోతే ప్రభుత్వ భూమిని నువ్వెట్లా అమ్ముతావని రిజిస్ట్రేషన్ శాఖ తిప్పి పంపితే, పట్టా ఉండి, సర్వ హక్కులూ ఉన్నా ఇదేం ఖర్మంటూ రైతులు ఆవేదన వర్ణనాతీతం. ఇది ఏదో ఒక్క మండలానికో.. గ్రామానికో పరిమితం కాలేదు. రాష్ట్రం మొత్తంమీద ఇదే పరిస్థితి. భూ రికార్డుల కంప్యూటరీకరణ సమయంలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం, త్వరితగతిన పూర్తిచెయ్యాలన్న అప్పటి అధికారుల ఒత్తిడితో రైతుల భూ హక్కులకు ఇబ్బందులు వచ్చిపడ్డాయి. 2012కు ముందు క్రక్స్ అనే సాఫ్ట్‌వేర్‌తో మాన్యువల్‌గా భూ రికార్డులను తయారు చేసేది. 2012లో వెబ్‌లాండ్ సాఫ్ట్‌వేర్ రావడంతో అన్ని రికార్డులను కంప్యూటరీకరించారు. అయితే ఆ సమయంలో అందుబాటులో ఉన్న రికార్డులను ఉన్నవి ఉన్నట్లు ఎక్కించేస్తే, అందుబాటులో లేనివి, ఉన్నా పొరపాటు కారణంగా కాలం నంబరు 6లో తప్పుగా నమోదు చేశారు. ఇక్కడ ప్రభుత్వ భూమా? పట్టా భూమా అని ఉండాల్సి ఉంటే, దాని స్థానంలో రైతులకు అన్ని హక్కులున్నా, ప్రభుత్వ భూమిగా నమోదు చేసేశారు. వైసీపీ సర్కారు వచ్చాక ఇంకొన్ని కావాలనే స్థానిక నేతల ఒత్తిడితో మార్చేశారు. గతంలో ఇలాంటి తప్పులను సవరించడానికి తహసీల్దార్లకు అవకాశం ఉండేది. అయితే దీనివల్లే సమస్యలు ఎక్కువ అవుతున్నాయని తెలిసి కలెక్టర్, జేసీ స్థాయి అధికారి అనుమతి లేకుంటే భూముల రికార్డుల్లో మార్పులకు వీలు లేకుండా లాక్ విధానాన్ని తీసుకొచ్చారు. ఈ క్రమంలో తప్పులను సరిదిద్దండి మహాప్రభో అంటూ వైసీపీ ప్రభుత్వంలో రైతులు చెప్పులరిగేలా కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న నాథుడే లేడు. నంబరు-6 సమస్యకు ఆర్.ఎస్.ఆర్ ఆధారంగా మార్పులు చేసే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా చేసిందేలేదు. పైగా రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు కావాలనే దరఖాస్తులో లోపాలు చూపించి మూడేళ్లుగా తిప్పుతూనే వచ్చారు.

సీఎంకు అందిన అర్జీతో.. తెనాలిలో తీగలాగితే

తెనాలికి చెందిన ఖాజాబీ అనే మహిళ తన కుమారుడి ఆరోగ్యం సరిగాలేదని, తనకున్న భూమిని అమ్మితేనే వైద్యం చేయించుకుని బతికించుకోగలనని

(మిగతా 6వ పేజీలో..)

త్రిశంకు స్వర్గంలో.. మీ సేవ

- ఆదరణ కోల్పోతున్న కేంద్రాలు
- ఆదాయం లేక ఆపరేటర్ల అవస్థలు
- నడపలేక.. మూసివేయలేక అయోమయం
- దెబ్బతీసిన వైసీపీ ప్రభుత్వం.. కూటమిపైనే ఆశలు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలు.. బర్త్, డెత్ సర్టిఫికెట్లు కావాల్సి వస్తే మీ సేవా కేంద్రాలు. ఓటరు కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాలంటే మీ సేవా కేంద్రాలు. ఇంటి పన్నులు, నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు కట్టాలన్నా మీ సేవా కేంద్రాలు.. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్రబాబు మీ సేవా కేంద్రాలను ప్రవేశపెట్టారు. ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించేలా వీటిని తీర్చిదిద్దారు. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఆదరణ లేక త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతంత మాత్రంగా ఉన్న సర్వీసులతో ఆదాయం లేక ఆపరేటర్లు అవస్థలు పడుతున్నారు. అటు నడపలేక, ఇటు మూసివేయలేక అయోమయంలో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మీసేవలను పూర్తిగా దెబ్బతీయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మీసేవలకు పూర్వ వైభవం తీసుకువస్తుందని ఆపరేటర్లు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు పౌరసేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, టీసీఎస్ భాగస్వామ్యంలో మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. చంద్రబాబు మొదటి సారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమయంలోనే దశల వారీగా మీ సేవా కేంద్రాల్లో టెక్నాలజీ ఆధారిత పౌరసేవలు అందుబాటులోకి వచ్చాయి. 2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాక మీసేవా కేంద్రాల అవసరం తగ్గిపోయింది. మీసేవా కేంద్రాల నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించడంతో వాటిని కొనసాగించాలని ఆదేశించడంతో కొన్ని చోట్ల అవి కొనసాగుతున్నాయి. 2014-19 వరకు దాదాపు 350 రకాల సేవల్ని మీసేవా కేంద్రాల్లో అందించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల రాకతో అంతకు ముందు ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాలు మరుగున పడిపోయాయి. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, ఆస్తులు, వ్యవసాయ భూముల కొనుగోళ్లలో మ్యూటేషన్ పత్రాలను కూడా మీ సేవా కేంద్రాల్లో జారీ చేసేవారు. ప్రస్తుతం ఈ తరహా సేవలను రద్దు చేశారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడి ఆస్తులకు ఎక్కడైనా ఈసీలు పొందే వెసులుబాటు ఉండేది. సచివాలయాల రాకతో అవన్నీ మాయమయ్యాయి. మీ

(మిగతా 6వ పేజీలో..)

- ఆ కారుల్లో తిరుగుతున్న వైసీపీ నాయకుడు మహీధర్
- మహీధర్ అరెస్టు.. రెండు కార్లు సీజ్
- రేపల్లె సీఐ మల్లికార్జునరావు

మంత్రి పేరుతో నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్



మాజీ సీఎం జగన్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న వైసీపీ నాయకుడు మోర్ల మహీధర్

రేపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేరుతో నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్లు పెట్టుకుని కారుల్లో తిరుగుతున్న వైసీపీ నాయకుడు మోర్ల మహీధర్‌ను అరెస్టు చేసి రెండు కార్లు సీజ్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇంకో కారును కూడా సీజ్ చేయాల్సి ఉందన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రేపల్లె పట్టణంలోని 3వ వార్డుకు చెందిన దేవగిరి రవిశంకర్‌కు రెండు నెలల క్రితం వెలగపూడి సచివాలయం వద్ద ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మండలం నిడమానూరుకి చెందిన మోర్ల మహీధర్ పరిచయం అయ్యాడు. తనకు మంత్రులు, హైకోర్టు జడ్జీలు బాగా తెలుసని సచివాలయంలో కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పించి తరువాత పర్మినెంట్ చేపిస్తానని నమ్మబలికాడు. 14వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో రేపల్లె పట్టణానికి చెందిన రవిశంకర్ ఇంటి వద్దకు టీఎస్09ఈజడ్1133 నంబరు గల ఓల్డు ఫార్చ్యూనర్ కారులో వచ్చి డబ్బులు తీసుకుని తనవెంట వస్తే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. సదరు కారుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్యే స్టిక్కర్ ఉండటంతో రవిశంకర్ గట్టిగా అడిగాడు. దీంతో మహీధర్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దీనిపై రవిశంకర్ ఫిర్యాదు మేరకు సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేశారు. విచారణ నిమిత్తం సీఐ ఎన్టీఆర్ జిల్లా నిడమానూరు వెళ్లగా, మూడు కారులకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్యే నకిలీ స్టిక్కర్ ఉండటాన్ని గుర్తించారు. సీఐను చూసి ఫార్చ్యూనర్ 1133కారును పంపించేశారు. టీఎస్07ఈవీ0707 నంబర్‌గల ఓక్స్‌వ్యాగెన్ వైట్‌కారు, ఏపీ23ఎన్9999 నంబర్‌గల ఇన్నోవా గ్రీన్ కలర్ కారును స్వా.దీనం చేసుకున్నారు. మోర్ల మహీధర్‌ను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పర్చగా, కోర్టు రిమాండ్ విధించింది.

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని

వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి, అప్పటి గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌తో మంచి సాన్నిహిత్యం ఉందని చెప్పి చల్లపల్లి, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, పెనమలూరు, మాచర్ల తదితర ప్రాంతాల వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకు వసూలు చేశాడు. ఇప్పటికే ఇతనిపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఆరు కేసులు నమోదు అయ్యా యి. ఇది ఏడో కేసు. వైసీపీ పాలనలో ఏపీ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెం ట్‌గా మహీధర్ బాధ్యతలు నిర్వహించాడు.



పోలీసులు సీజ్ చేసిన నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్ పెట్టుకుని తిరుగుతున్న కారు

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు

- ఉచిత డీఎస్సీ శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో కలెక్టర్

బాపట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత డీఎస్సీ శిక్షణా శిబిరాన్ని శనివారం బాపుడా చైర్మన్‌గా ఇటీవల నియమితులైన సలగల రాజశేఖరబాబుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. డీఎస్సీ ద్వారా ప్రభుత్వం సుమారు 17 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాకు 700 ఉపాధ్యాయ పోస్టులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో 220 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వడానికి శ్రీకారం చుట్టిందన్నారు. నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవాలని శిక్షణకు ఎంపికైన వారికి సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు పొందడమే లక్ష్యంగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని ఎదగాలన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారితాధికారి జె.రాజా దెబోరా మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలకు ప్రభుత్వం నాణ్యమైన శిక్షణను ఉచితంగా ఇస్తుందని తెలిపారు. ప్రస్తుతం 43 మంది అభ్యర్థులకు శిక్షణ ప్రారంభించామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు శిక్షణకి రావచ్చన్నారు. సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ యువతకు ఉద్యోగవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ సాధికారిత జిల్లా ఇన్‌చార్జి అధికారి రాజేష్ దాసు, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, బాపుడా చైర్మన్‌గా నియమితులైన సలగల రాజశేఖర్‌బాబు తదితరులు



ప్రారంభ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

నామినేటెడ్ జోష్

- జిల్లాలో పదవుల సందడి
- కూటమి శ్రేణుల్లో ఉత్సాహం
- పదవుల్లో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నామినేటెడ్ పదవులపై టీడీపీ నేతలతో పాటు క్షేత్రస్థాయిలో కష్టపడిన కార్యకర్తలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. ఆశావహులు వందల సంఖ్యలో ఉండడంతో పాటు సామాజిక కూర్పు కూడా క్లిష్టతరంగా మారడంతో నామినేటెడ్ పదవుల ప్రకటన విషయంలో జాప్యం జరుగుతూ వచ్చింది. ఎట్టకేలకు ఆ సందిగ్ధానికి తెరదించుతూ వరుసగా నామినేటెడ్ పదవుల ప్రకటనలు వస్తుండడం, వాటిల్లో జిల్లాకు కూడా సముచిత ప్రాధాన్యం దక్కడంతో టీడీపీలో కొత్త జోష్ కనబడుతోంది. ఇకపై ప్రభుత్వం చేపట్టే అనేక కార్యక్రమాల్లో నామినేటెడ్ పదవులు పొందిన వారికి కూడా అధికారిక భాగస్వామ్యం దక్కనుంది. ప్రభుత్వం చేపట్టబోయే వివిధ కార్యక్రమాలను మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి నామినేటెడ్ పదవులు ఉపకరించనున్నాయి. మరోవైపు జిల్లాలో నామినేటెడ్ పదవుల విషయంలో ఎస్సీ, బీసీలకు అగ్రతాంబూలం దక్కింది. ఇప్పటికే వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు డైరెక్టర్లను ప్రభుత్వం ప్రకటించింది. మరికొద్ది రోజుల్లోనే మార్కెట్ యార్డు చైర్మన్లతో పాటు మరిన్ని పదవుల ప్రకటన ఉండనుంది. దీంతో మరికొన్ని రోజుల పాటు టీడీపీతో పాటు జనసేన, బీజేపీలలో ఈ పదవుల సందడి కనబడనుంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల మీద క్షేత్రస్థాయిలో పోరాటాలు చేసి మొన్నటి ఎన్నికలలో పోటీ చేయడానికి అవకాశం రాని వారికి పదవుల పంపకంలో ప్రాధాన్యం ఇచ్చారు. అదే విధంగా పార్టీపై కనబరచిన విధేయతను కూడా ప్రామాణికంగా తీసుకునే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించారు. వీటన్నింటితో పాటు మొన్నటి పదవుల ప్రకటనల్లో జిల్లాకు మూడు కీలకమైనవి ఇస్తే అందులో ఒకటి ఎస్సీ, రెండు బీసీలకు కేటాయించారు. మరో ఇద్దరికి డైరెక్టర్లుగా అవకాశం కల్పించారు. వీటిలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవి జనసేనకు వరించగా, డైరెక్టర్లలో ఒకటి బీజేపీకి దక్కింది.

ప్రభుత్వంలో భాగం మరింతగా..

ప్రభుత్వం చేసే వివిధ ప్రజాపయోగ పనులను జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపైనే ఉంటుంది. ఇకపై నామినేటెడ్ పదవులు పొందినవారు ప్రభుత్వం జిల్లాలో చేపట్టబోయే కార్యక్రమా ల్లో అధికారికంగా భాగస్వామ్యం కానున్నారు. వారికి దక్కిన నామినేటెడ్ పదవుల ఆలంబనగా మరింత మందికి ప్రభుత్వం వైపు నుంచి మంచిచేయడం ద్వారా పార్టీ ప్రతిష్ఠను ఇనుమడింప చేసే అవకాశం వారికి దక్కడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరికొన్ని రోజుల పాటు..

నామినేటెడ్ పదవులకు సంబంధించి డైరెక్టర్ల నియామక ప్రక్రియ ఇంకా జరుగుతూనే ఉంది. ఇప్పటికే వీటి విషయంలో ఇద్దరికీ అవకాశం దక్కగా ఒకటి బీజేపీకి, మరొకటి టీడీపీకి దక్కింది. ఇంకా చాలా కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం పెండింగ్ ఉండడంతో మరింత మందికి అవకాశం దక్కనుంది. అదేవిధంగా మార్కెట్‌యార్డు చైర్మన్లతో పాటు త్వరలోనే జరగబోయే సాగునీటి సంఘాల ఎన్నికల వరకు కూటమి పార్టీల్లో ఈ పదవుల సందడి కొనసాగనుంది.

తీరప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- బీచ్‌ల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పన
- సూర్యలంక, వాడరేవుల పరిశీలనలో కలెక్టర్

చీరాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత అభివృద్ధిలో భాగంగా బీచ్‌లలో ఆహ్లాదకర వాతావరణం కల్పనకు అనువైన మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ సూర్యలంక, వాడరేవు తీర ప్రాంతాల్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీచ్‌ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులపై దిశా నిర్దేశం చేశారు. సూర్యలంక, పాండురంగాపురం, వాడరేవు, రామాపురం బీచ్‌లను పర్యాటకులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలన్నారు. డ్వామా, అటవీశాఖ అధికారులు పైలట్ కింద 20వేల మొక్కలు నాటాలని చెప్పారు. తీరం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం కొరకు విస్తృతంగా మొక్కలు నాటాలని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా సముద్రస్నానాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత చర్యలపై ఆరా తీశారు. వాడరేవులో ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ అతిథి గృహాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్తీక మాసంలో విస్తృతంగా పర్యాటకులు, భక్తులు వస్తున్నందున సూర్యలంకలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు.



వాడరేవు తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట మురళి ఇతర అధికారులు

గ్రామ చావిడిని పరిశీలించిన కలెక్టర్

చీరాల మున్సిపల్ పరిధిలోని గ్రామచావిడి భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న గ్రామచావిడి భవనాన్ని తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పారు. సంపద సృష్టిలో భాగంగా కాంప్లెక్స్ కింద భాగంలో షాపులు, పై అంతస్తులో ప్రభుత్వ కార్యాలయాలు వచ్చే విధంగా నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయలక్ష్మి, అటవీశాఖ అధికారి భీమయ్య, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డ్వామా పీడీ విజయలక్ష్మి, అటవీశాఖాధికారి భీమయ్య, చీరాల, బాపట్ల తహసీల్దార్‌లు గోపీకృష్ణ, షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాలలో గ్రంథాలయాలు

- నిధులు మంజూరీకి సిద్ధంగా ఉన్నా స్థలం కేటాయింపు లేక సమకూరని వైనం
- అద్దంకిలో 70 ఏళ్లుగా ఇదే సమస్య

అద్దంకి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతోనే జ్ఞాన సముపార్జన సాధ్యం అని ప్రతి ఒక్కరి నోటా వచ్చే మాట.. అయితే విలువైన పుస్తకాలు కొనుగోలు చేసి చదవడం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు, యువకులకు సాధ్యం కాదు. దీంతో ఆయా విద్యార్థులు కచ్చితంగా గ్రంథాలయాలపై ఆధారపడాల్సిందే. అయితే అద్దంకిలో 1954లో గ్రంథాలయం ఏర్పాటు జరిగింది. 70 సంవత్సరాలుగా అద్దె భవనాలలోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గ్రంథాలయం నిర్వహిస్తున్న అద్దె భవనంలో సుమారు 4 దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. అద్దంకిలోని గ్రంథాలయంలో సుమారు 22వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 2567 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల మరింత విలువైన 20 పుస్తకాలను కూడా కొనుగోలు చేశారు. గ్రూప్స్, కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. గతంలో గ్రంథాలయం నిర్మాణానికి సుమారు రూ.40లక్షలు మంజూరైనా స్థలం కేటాయింపు జరగకపోవడంతో వెనక్కి పోయాయి. స్థలం కేటాయింపు జరిగితే నిధులు లభ్యతకు ఎలాంటి ఇబ్బంది లేదని గ్రంథపాలకుడు సుగుణరావు తెలిపారు. గ్రంథాలయం భవనానికి అవసరమైన స్థల కేటాయింపు చేయాలని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆందోళనలు కూడా చేశారు.



అద్దంకిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం

చీరాలలోనూ అదే పరిస్థితి

- అరకొరగా కాంపిటేటివ్ బుక్స్
- పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు తిప్పలు

చీరాల : చీరాల మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ గ్రంథాలయం అద్దె భవనంలో కునారిల్లుతోంది. ఇదిలావుంటే గ్రంథాలయంలో విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు అవసరమైన పుస్తకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అవి కూడా పాతపుస్తకాలు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. పెద్దవారు కాలక్షేపం కోసం వస్తారు. అయితే గ్రంథాలయం పై అంతస్తులో ఉంటుంది. ఇరుకు మెట్లు. ఆ మెట్లు ఎక్కలేక చాలామంది పెద్దవారు అటు వైపు రావడం మానేశారు. దీంతో గ్రంథాలయానికి సగటున రోజుకు వచ్చే వారి సంఖ్య మించడం లేదు. పట్టణ పరిధిలో ఇంటి పన్ను వసూళ్లలో 8 శాతం గ్రంథాలయ సెస్‌గా పేర్కొంటారు. ఆ మొత్తం జిల్లా గ్రంథాలయానికి జమ చేయాలి. అయితే ఇప్పటికి పురపాలక సంఘం నుంచి సుమారు రూ.2.76కోట్ల సెస్ బకాయి చెల్లింపు జరగాల్సి ఉందని గ్రంథ పాలకురాలు ధనమ్మ తెలిపారు. గ్రంథాలయం 1956లో ప్రారంభించారు. ఇప్పటికి సొంత భవనం లేదు. మున్సిపల్ పరిధిలో స్థలం కేటాయిస్తే గ్రంథాలయం నిర్మాణానికి నిధులు ఉన్నాయని చెప్తున్నారు. అయితే పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కలగానే మిగిలింది.


చీరాల శాఖ గ్రంథాలయం


సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీ

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ ఆర్‌డీ హరికృష్ణ

చీరాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని సత్ఫలితాలు రాబడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ ఆర్‌డీ హరికృష్ణ చెప్పారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ పరంగా పన్ను బకాయిల వసూళ్లు, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజనీరింగ్ పనులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వేటపాలెం మండలం రామాపురంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం


బాలికలకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చినగంజాం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాలికల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పాఠశాల హెచ్ ఎం. సత్యానందం, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి అన్నారు. మండలంలోని సంతరావూరు కేకేసీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని 8వ తరగతి చదువుతున్న నలుగురు బాలికలకు వెంకటరాయ-శ్రీధర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ చిలుకలూరిపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సైకిళ్లను పంపిణీ చేసినట్లు హెచ్ఎం తెలిపారు. పాఠశాలలో మురుగుదొడ్ల పునర్నిర్మాణం, విద్యార్థులకు మెటీరియల్ అందించేందుకు ఫౌండేషన్, క్లబ్ సభ్యులు సంసిద్ధత వ్యక్త పరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, వెంకటరాయ-శ్రీధర్ ఫౌండేషన్ కార్యదర్శి తోటకూర వెంకటనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ సాయిని మహేష్, టీడీపీ నాయకులు జీ సంధ్యారాణి, కేశనపల్లి శ్యాంబాబు, దేవతోటి నాగరాజు, డి.రాజేష్, డి.పవన్, యాశ్రీను, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నాణ్యతగా వేయండి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

మార్టూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ రోడ్లను నాణ్యతాప్రమాణాలతో నిర్మించాలని పర్చూరు డివిజన్ పంచాయతీరాజ్ అధికారి కె.ఆదినారాయణ అన్నారు. ఎన్ఆర్‌జీఎస్ నిధుల ద్వారా మండలంలోని మార్టూరు, కోలలపూడి, బొల్లాపల్లి గ్రామాలలో జరుగుతున్న సీసీ రోడ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పొడవు, వెడల్పు, లోతులను పరిశీలించారు. వాటి నిర్మాణంలో ఇసుక, కంకర, సిమెంటు, నీటి శాతం నాణ్యత కలిగి ఉండాలని సూచించారు. నిర్మాణం జరిగిన రోడ్లను నీటితో క్యూరింగ్ చేయాలన్నారు. ఆయన వెంట ఏఈ శాస్త్రి, సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తేజ, ఆనంద్, అబ్బయ్య, సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత బిడ్డలుగా భావించాలి

- ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ పర్యవేక్షణలో ఉన్న పిల్లలను సొంత బిడ్డలుగా భావించి వారి ఆరోగ్య పరిరక్షణపై అంగన్‌వాడీలు మరింత దృష్టిపెట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. బంగారు బాల్యం కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక గ్రీవెన్స్ హాలులో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహ రహిత, బాల కార్మిక రహిత, అక్షర చైతన్య, ఆరోగ్యకరమైన జిల్లా ఆవిష్కరణ కోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టిందన్నారు. అందులో భాగంగా 18 ఏళ్లలోపు బాలలు ఆహ్లాదకర వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా పెరిగేలా వివిధ శాఖలను సమన్వయం చేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీలపై గురుతర బాధ్యత ఉందన్నారు. అంగన్‌వాడీలోని పిల్లల ఆరోగ్యంపై మరింత దృష్టిపెట్టాలని దిశానిర్దేశం చేశారు. వాస్తవ గణాంకాలను రికార్డుల్లో నమోదుచేయాలని, లోపంతో ఉన్న బాలలను గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ కమిటీల్లో అంగన్‌వాడీలను కూడా భాగస్వాములను చేసినట్లు తెలిపారు. బాల్యవివాహాలు చేయకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను లబ్ధిదారులకు సమర్థవంతంగా అందించి ఆరోగ్యకరమైన సమాజం ఆవిష్కృతమయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆ దిశగా వైద్య సిబ్బందితో కలిసి పనిచేయాలని కోరారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ మాధురి పాల్గొన్నారు.

ఘనంగా సెంట్రల్ జోన్ మహిళా కబడ్డీ పోటీలు

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే నిర్వహిస్తున్న సెంట్రల్ మహిళా కబడ్డీ ఇంటర్ కాలిజాట్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా యూనివర్శిటీ క్రీడల కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కరచాలనం చేశారు. తొలిరోజు జరిగిన పోటీల్లో రెండోరౌండ్‌కు రైజ్ కృష్ణసాయిగాంధీ (ఒంగోలు), సెయింట్‌మేరీస్(గుంటూరు), పేస్ ఇంజనీరింగ్ కాలేజీ(ఒంగోలు), జేఎన్‌టీయూకే, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్(గుడ్లవల్లేరు), ఎంఎల్‌సీ విమెన్(గుంటూరు) కళాశాలలు ఎంపికయ్యాయి. అనంతరం కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు తమ కళాశాలలో ఈ పోటీలు జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ శిద్దా భరత్, రాగ చీఫ్ కో ఆర్డినేటర్ శిద్దా ప్రవల్లిక, గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, పీడీలు ఎస్.హిమచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్


పల్లెనిద్రలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

కారంచేడు (పర్చూరు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌లో వచ్చిన అపరిచిత వ్యక్తుల మెసేజ్‌లు, మాయ మాటలను నమ్మి నష్టపోవద్దని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కారంచేడులో శుక్రవారం రాత్రి నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సమస్యలు, వివాదాలు, అసాంఘిక కార్యకలాపాలు తదితర విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రజలకు చేరువలో ఉండాలన్న సంకల్పంతోనే పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అపరిచిత వ్యక్తులు కన్పిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. అవకాశం ఉన్నవారు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, ఎస్సై వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రిశంకు స్వర్గంలో.. మీ సేవ

(5వ పేజీ తరువాయి)

సేవల్లో రద్దయిన సేవలను సచివాలయాల్లో అందిస్తున్నారా అంటే అది కూడా లేదు. దీంతో ప్రజలు తిరిగి మీ సేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన ఉద్యోగాలు, విధులపై జాబ్ చార్ట్‌ను ఖరారు చేయకపోవడమే ఈ రకమైన సమస్యకు కారణం అవుతోంది. సచివాలయాల్లో జారీ చేసే ధృవీకరణ పత్రాల విషయంలో మరో సాంకేతిక సమస్య ఎదురవుతోంది. మీ సేవా కేంద్రాల్లో నిర్ణీత రుసుము చెల్లిస్తే ఎన్ని కాపీలైనా ప్రింట్ చేసే అవకాశం ఉంటుంది. సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. క్యాస్ట్, ఇన్‌కమ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వంటి వాటికి ఒక్క కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో జారీ చేసే డిజిటల్ కాపీలను మీసేవా కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. పీడీఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలను సృష్టిస్తే తాము చిక్కుల్లో పడతామని, సచివాలయాలు జారీ చేసే పత్రాలను ముద్రించడానికి మీ సేవా కేంద్రాలు నిరాకరిస్తున్నాయి. సచివాలయాలు, మీ సేవా కేంద్రాల మధ్య నెలకొన్న గందరగోళంతో అర్జీదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, యువగళం పాదయాత్రలో లోకేశ్ గత ఎన్నికలకు ముందు కలిసిన ఆపరేటర్లకు మీ సేవలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో మీసేవలపై పట్టున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వాటికి పూర్వవైభవం తెస్తారని భావిస్తున్నారు.

అన్ని వేళాలా అందుబాటులో సేవలు

మీ సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మీ సేవా కేంద్రాలు నిర్విరామంగా పని చేస్తుండేవి. దీంతో వివిధ రకాల సర్టిఫికెట్లు, పన్నులు, వివిధ రకాల బిల్లుల చెల్లింపులకు ఈ కేంద్రాలు ప్రజలకు సౌకర్యంగా ఉండేవి. అనేక ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన మీ సేవలకు వ్యతిరేకంగా వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. సచివాలయాలు ఏర్పడిన తొలినాళ్లలో మీ సేవా కేంద్రాల్లో ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లవని, అధికారులు కూడా సచివాలయాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వం కూడా మీసేవా కేంద్రాలను పరిగణనలోకి తీసుకోరాదని హెచ్చరించడంతో అధికారులు కూడా మీసేవలను దూరం పెట్టారు. దీంతో మీ సేవలకు ప్రజలు కూడా దూరమయ్యారు. ఈ క్రమంలో మీసేవా కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్థిక ఇక్కట్లతో కొందరు కేంద్రాలను నడపలేక మూసివేశారు. సచివాలయాలలో సేవలు ఉన్నా అవి ఉదయం పది నుంచి సాయంత్రం 5గంటల వరకే అందుబాటులో ఉంటాయి. ఈ కారణంగా వివిధ పనులు, ఉద్యోగాలకు వెళ్లే వారికి ఆశించిన విధంగా సచివాలయాల సేవలు ఉపయోగపడడం లేదనే విమర్శలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లేదనే ఆరోపణలున్నాయి.

పౌర సేవల్లో అంతులేని నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సుపరిపాలన నినాదంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసినా పౌర సేవల్లో అంతులేని నిర్లక్ష్యం ఉంది. సచివాలయాల సిబ్బందిలో జవాబుదారీతనం తీసుకురాకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. దశల వారీగా 500కుపైగా పౌరసేవల్ని సచివాలయాల్లో అందిస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం అమలులో చతికిలపడింది. రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాలు, విద్యుత్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వంటి సేవల్ని అందిస్తామన్నా ఆయా శాఖల నుంచి అధికారాలను మాత్రం సచివాలయాలకు బదలాయించలేదు. సాంకేతికంగా చెప్పాలంటే సచివాలయ సిబ్బందికి ఎలాంటి అధికారాలు లేవు. కేవలం దరఖాస్తుల్ని ప్రాసెస్ చేయడానికి మాత్రమే వారు పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వంలో ఇంటింటికి పెన్షన్ల పంపిణీకే సిబ్బంది పరిమితమయ్యారన్న వాదన ఉంది.

కాలమ్-6.. సరిదిద్దారు

(5వ పేజీ తరువాయి)

రికార్డుల లోపాలను సరిచేయాలని రెండు నెలల క్రితం సీఎం చంద్రబాబుకు అర్జీ పెట్టారు. ఇదే తరహాలో తెనాలి నుంచి 49 మంది అర్జీలు అందాయి. అయితే సీఎంకు అర్జీ ఇచ్చినా ఖాజాబీ సమస్యకు పరిష్కారం లభించలేదు. దీంతో పదిరోజుల క్రితం కుమారుడు చనిపోయాడని ఖాజాబీ తెనాలి తహసీల్దార్‌ను కలిసి కన్నీరు పెట్టుకుంది. దీనికితోడు సీఎం నుంచి ఈ తరహా అర్జీలపై పరిష్కారానికి ఒత్తిడి రావటంతో దీనిపై తహసీల్దార్ గోపాలకృష్ణ స్పందించారు. అసలు సమస్యపై కసరత్తు చేస్తే, ఒక్క తెనాలి మండలంలోనే 5,808 భూ రికార్డుల్లో లోపాలు జరిగినట్లు గుర్తించారు. అటు నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలోనూ అక్కడి అధికారులు మరో వెయ్యి మంది, గుంటూరు డివిజన్ పరిధిలో మరో 1600 రైతుల రికార్డుల్లో లోపాలను ప్రాథమికంగా గుర్తించారు. ఆర్ఎస్ఆర్‌లో ఏ సర్వే నంబరు భూమి ఏ విభాగంలో ఉందనేది స్పష్టంగా ఉండటంతో రైతులను తిప్పాల్సిన పనిలేకుండా సవరించవచ్చన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఇదే విషయాన్ని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ, గుంటూరు జేసీ భార్గవ్ తేజ దృష్టికి తీసుకువెళ్లారు. వారు కూడా సానుకూలంగా స్పందించారు. దీంతో కేవలం పక్షం రోజుల్లో మూడేళ్లనాటి సమస్యకు పరిష్కారం చూపారు. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా చర్యలకు రెవెన్యూ అధికారులు ముందుకు వస్తే రైతుల కష్టానికి ఊరట లభించినట్టే. తెనాలిలో గుర్తించిన 5,808 రైతుల రికార్డుల్లో 5,763 మంది రికార్డులను సరిదిద్దారు. మరో 45 మంది రైతులకు సంబంధించిన రికార్డుల విషయంలో సాంకేతిక ఇబ్బందులు ఉండటంతో జేసీ దృష్టికి తీసుకువెళ్లామని, వాటికి కూడా త్వరలో పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ గోపాలకృష్ణ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పరిష్కారం లభించింది

అనారోగ్యంతో ఉన్న కుమారుడు ఫకీర్‌ను బతికించుకునేందుకు 2.61 ఎకరాల భూమిని అమ్ముకోవాలనుకుంటే ప్రభుత్వ భూమి కింద ఉంది అమ్మడానికి కుదరదన్నారు. సంవత్సరంన్నర నుంచి తిరిగినా పట్టించుకున్నవారులేరు. గత నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అర్జీ పెట్టుకున్నాం. ఆయన స్పందించినా కొందరు అధికారులు లంచాల ఆశతో మా అర్జీకి పరిష్కారం చూపలేదు. పది రోజుల క్రితం మా అబ్బాయి చనిపోయాడు. అదే విషయాన్ని మళ్లీ సీఎం దృష్టికి తీసుకువెళదామని అనుకుంటున్న తరుణంలో రికార్డులు సరిచేశారని, సమస్య పరిష్కారం అయిందని తహసీల్దార్ చల్లని కబురు చెప్పారు. నాతోపాటే చాలామంది కష్టం తీరిందని తెలిసి సంతోషపడ్డాం. నాకు ఉపయోగపడకపోయినా, మిగిలినవారి అవసరాలకైనా అండగా ఉంటుందనుకున్నాం.

- ఖాజాబీ, తెనాలి

ఎన్నిసార్లు తిరిగామో

మా భూమిపై మాకు హక్కులేదన్నారు. అడంగల్‌లో చూస్తే ప్రభుత్వ భూ మి అని చూపిస్తుంటే, అధికారులను కలసి విన్నవిస్తే, చూస్తాం, చేస్తాం అం టూ మూడేళ్లుగా తిప్పారు. ఎట్టకేలకు సమస్యకు పరిష్కారం లభించింది. చిన్న సవరణకు సంవత్సరాలు పట్టింది. నిజం గా అధికారులు మనస్ఫూర్తిగా చేస్తే మా కు ఇటువంటి సమస్యలు ఉండవు.

- వి.పద్మలత, బుర్రిపాలెం

రైతులకు మేలు జరిగితే చాలని

నేను తెనాలి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టాక వచ్చిన ఫిర్యాదుల్లో అధికశాతం భూములకు సంబంధించినవే. ఈ క్రమంలో రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని, లోపం ఎక్కడనేది అన్వేషిస్తే అస లు పొరపాటు బయటపడింది. దీనిపై జిల్లా అధికారులకు విన్నవిస్తే సానుకూలంగా స్పందించారు. జేసీ ప్రత్యేక ఉత్తర్వులిచ్చారు. సిబ్బంది రాత్రి పగలు తేడా లేకుండా ఆన్‌లైన్ రికార్డులను సరిచేశారు. మూడేళ్లుగా తిరిగిన రైతులు ఇప్పుడు సంతోషంతో ఉన్నారు.

- గోపాలకృష్ణ, తహసీల్దార్, తెనాలి

20 నుంచి నిరుద్యోగ యువతకు శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఈనెల 20వతేదీ నుంచి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజయాదవ్ శనివారం ప్రకటనలో తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్ కోర్సులు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. టెన్త్ పాస్, ఫెయిల్, ఆపై చదివిన నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇస్తామని, 18వ తేదీ లోపు స్కిల్‌హబ్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, వివరాల కోసం 7989244381, 7842004344కు సంప్రదించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో వెంకటరావు

మొక్కుబడిగా మండల సమావేశం

యద్దనపూడి,(మార్టూరు)నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం శనివారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో మొక్కుబడిగా జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించాలనుకున్న సమావేశం కోరం కాకపోవడంతో 3 గంటల 30 నిమిషాలకు ప్రారంభించారు. సభకు అనంతవరం ఎంపీటీసీ సభ్యులు దొడ్డా ఇందిరాదేవి అధ్యక్షత వహించారు. తొలుత ఎంపీడీవో ఎస్‌కే మహమ్మద్ అఖీబ్ జావెద్ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న సమస్యలను సంబంధిత శాఖలకు చెందిన అధికారులు సభ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సభలో వెలుగు ఏపీవో వెంకటరావు మాట్లాడుతూ స్త్రీనిధి, డ్వాక్రా గ్రూపుల కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్సు ప్రభుత్వం అందించే రుణాలు తదితర కార్యక్రమాల గురించి చక్కగా వివరించారు. తరువాత ఎంపీఈవో గోపి మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ కార్డులను ఇవ్వడానికి వారి వివరాలు నమోదు చేస్తున్నామని, అయితే 317 మంది విద్యార్థులకు సంబంధించిన వివరాలను నమోదు చేయలేదన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ నిధులతో మంజూరైన సిమెంటురోడ్లు, సైడుకాల్వల నిర్మాణ పనులు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఏఈ ఆనందరావు తెలిపారు. ఇంకా వివిధ శాఖలకు చెందిన వివరాలను అధికారులు సభలో తెలియచేశారు. కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరయ్యారు.

నీటి సంఘాల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్

- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు నోటిఫికేషన్ నిలిపివేత

ఒంగోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు మరోసారి తాత్కాలికంగా బ్రేక్ పడింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 20న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి 23 డబ్ల్యూయూఏల ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అందుకనుగుణంగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా డబ్ల్యూయూఏల పరిధిలో ప్రాదేశిక నియోజకవర్గాల గుర్తింపు, ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, వారికి శిక్షణ పూర్తిచేశారు. ఇక మరో నాలుగు రోజుల్లో ఈనెల 20న నోటిఫికేషన్ రావాల్సి ఉండగా తాత్కాలికంగా ప్రక్రియను ఆపాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. ఈనెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఆ సమయంలో ఎమ్మెల్యేలు నియోజకవర్గాలలో అందుబాటులో ఉండే అవకాశం లేదు. నీటిసంఘాల ఎన్నికలను వీలైనంత మేర ఏకగ్రీవంగా నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది. ఆ ప్రక్రియలో ఎమ్మెల్యేల పాత్ర కీలకం. అలాంటిది 22 వరకు వారు శాసనసభ సమావేశాలలో ఉంటే 23న ఎన్నికల నిర్వహణ ఇబ్బందికరంగా భావించి తాత్కాలికంగా ఆపేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. తదుపరి ఎప్పుడు నిర్వహించేది తెలిపేవరకు మొత్తం ప్రక్రియను నిలిపివేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాక గతంలో ఒకసారి భారీవర్షాలు, వరదలు కారణంగా తాత్కాలికంగా ఆపగా, ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల కారణంగా నిలిపివేశారు.

ముగ్గురు దొంగలు అరెస్టు

- 33 మోటార్‌సైకిళ్లు, 4 కిలోల గంజాయి స్వాధీనం
- ఎస్పీ దామోదర్ వెల్లడి

ఒంగోలు(క్రైం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిళ్లను దొంగిలించే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 33 మోటార్‌సైకిళ్లు, 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. శనివారం ఒంగోలులోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిచిన మీడియా సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణం బండపాలెంలో నివాసం ఉంటున్న కుంచాల శివప్రసాద్, దూబగుంటకు చెందిన ఉప్పు శ్రీకాంత్, ఒంగోలులోని కొణిజేడు బస్టాండ్‌లో నివాసం ఉంటున్న కోల్‌కతాకు చెందిన సహాద్దీన్‌సర్ధార్ శుక్రవారం సాయంత్రం ఒంగోలులోని శర్మ కాలేజీ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వారిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారిని విచారించగా రూ.25.80లక్షల విలువైన 33 మోటార్‌సైకిళ్ళు, రూ.20వేల విలువైన 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లాలో 15, బాపట్ల జిల్లాలో 1, పల్నాడు జిల్లాలో 1, నెల్లూరు జిల్లాలో 16 వాహనాలను వారు దొంగిలించారని ఎస్పీ వివరించారు. కుంచాల శివప్రసాద్‌పై తమిళనాడు రాష్ట్రం సేలంలో ఎన్‌డీపీఎస్ కేసు ఉందన్నారు. దొంగలను పట్టుకునేందుకు కృషి చేసిన ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు, ఏఎస్ఐ కె.సురేష్, షేక్ నయాబ్‌రసూల్, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.సాయి, జి.విజయ్‌కుమార్, కానిస్టేబుల్ అనిల్‌లను ఎస్పీ ప్రశంసించి రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో నెల రోజులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

మంత్రి ఓఎస్‌డీ సాంబశివరావు ఆదేశం

ఒంగోలు(క్రైం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిచేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ మంత్రి ఓఎస్‌డీ ఏవీ.సాంబశివరావు ఆదేశించారు. శనివారం ఒంగోలులోని విద్యుత్ భవన్‌లో అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఓఎస్‌డీ మాట్లాడుతు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్‌డీఎస్ఎస్ పథకం పనుల పురోగతిపై అడిగి అందుకు సంబంధించి పలు సూచనలు చేశారు. కొత్తపట్నంలో నిర్మిస్తున్న 132/33 కేవీ సబ్‌స్టేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. 24గంటలు నాణ్యమైన కరెంటు అందించేలా చూడాలని సూచించారు. సిబ్బంది పనితీరు, ఖాళీగా ఉన్న పోస్టులను గురించి వాకబు చేశారు. మంత్రి రవికుమార్ రాష్ట్ర వ్యాప్త కరెంటు సమస్యలపై రోడ్ మ్యాప్ ఇచ్చారని, ఇందుకు సంబంధించిన అంశాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ట్రాన్స్‌కో ఎస్ఈ ఎ.శ్రీనివాసరావు, ఏవో కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పొలాల నీటితో పొంచి ఉన్న ముప్పు

- కొప్పెరపాడు ఉన్నత పాఠశాల రోడ్డుకు వస్తున్న సాగర్ నీరు
- పంట కాలువ పూడ్చడంతో ఇళ్ల ముందుకు వరద
- పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ప్రజలకు తీవ్ర ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

బల్లికురవ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువలు పూడ్చడంతో కొప్పెరపాడు గ్రామంలోకిలోకి సాగర్ కాలువల నీరు రావడంతో గృహాలకు, ఉన్నత పాఠశాలకు నీటి ముప్పు పొంచి ఉంది. నీరు పెద్ద ఎత్తున రావడంతో రోడ్లు, పరిసర గృహాలు జలమయం కావడంతో ప్రజలు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. నీటిలో పాములు వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అవసరాలు తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్న మహిళలు


ఇళ్ల ముందు రోడ్డుపై పారుతున్న సాగర్ నీరు

బల్లికురవ మండలంలోని వి.కొప్పెరపాడు గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాల రోడ్డుకు గత కొంత కాలంగా వెంపరాల మేజర్ కాలువ ద్వారా పంట కాలువలకు వచ్చే నీరు కాలువను ఒక రైతు పూడ్చడంతో పొలాల్లోకి వెళ్లే వీలు లేక గ్రామంలో వస్తున్నాయి. పంటలకు చేరాల్సిన నీరు గ్రామంలోని గృహాల మీదకు వస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నీటి ప్రభావంతో తమ వస్తువులు నీట మునిగి పోతున్నాయని, ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయమేస్తుందని నీటిలో నుంచి పాములు వస్తున్నాయని తెలిపారు. ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నీటి ప్రవాహంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశముందని వారు తెలిపారు. నీటిలో నడవలేక తీవ్ర అవస్థలు పడుతున్నామని మహిళలు తెలిపారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ఒక వ్యక్తి తన సొంత ప్రయోజనం కోసం పంట కాలువను పూడ్చడం వలనే సమస్య వచ్చిందని అధికారులు వెంటనే సాగర్ నీరు గృహాలవైపు రాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పంటలకు చేరాల్సిన సాగర్ నీరు ఇలా రోడ్లపైకి వచ్చి వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటితో ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామంలో ఉన్నత పాఠశాలకు ఉత్తరం వైపు నుంచి పంటలకు వచ్చే సాగర్ నీరు గ్రామంలోకి వస్తుంది. ఈ నీటితో తాము తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. ప్రతి రోజూ నీటిలో నడిచివెళ్లేందుకు పిల్లలు భయపడుతున్నారు. అధికారులు గ్రామంలోకి నీరు రాకుండా చర్యలు చేపట్టాలి.

\- కల్లూరి మాధవి, కొప్పెరపాడు

పంట కాలువను పూడ్చడంతోనే ఈ పరిస్థితి



వెంపరాల మేజర్ కాలువ ద్వారా వచ్చే నీరు పంటలకు చేరాల్సి ఉంది. కానీ పంట కాలువను ఒక రైతు పూడ్చడం వలన నీరు రోడ్లపై పారుతోంది. ఈ రోడ్డులోనే ఉన్నత పాఠశాల, పశువైద్యశాల ఉంది. నిత్యం వందల మంది ప్రజలు తిరిగే రోడ్డుపై నీరు రావడంతో అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే నీటిని పొలాలకు వెళ్లేలా చర్యలు చేపట్టాలి.

\- మక్కెన రామారావు, కొప్పెరపాడు


మాట్లాడుతున్న రామనాథం

అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి

చినగంజాం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో సమగ్రాభివృద్ధికి ప్రణాళిక అవసరమని గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రామనాథం అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశపు హాల్‌లో గ్రామ, మండల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శనివారం ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. గ్రామ స్థాయిలో ఆదాయాలు, వ్యయాల్ని బట్టి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గ్రామ, మండల అభివృద్ధి ప్రణాళికలపై గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు, గ్రామ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్‌లకు రిసోర్సు పర్సన్లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రైనింగ్ మేనేజర్ అమర్‌బాబు, ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, బాపట్ల ఫ్యాకల్టీ మెంబరు బి.వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంగులూరు : గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌ల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో అధికారులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో జరిగిన అభివృద్ధి, సమగ్ర ప్రణాళిక తయారీపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ప్రణాళిక తయారీలో ప్రజా సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, వాటి అమలుకు అవసరమైన నిధుల గురించి సమగ్రంగా పొందు పరచాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల, ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఏవో సుబ్బారెడ్డి, ఏపీఎం జ్యోతి ప్రసాద్, పలువురు అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు శివాలయం ప్రారంభం

పర్చూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్నంబొట్లంవారిపాలెంలో నూతనంగా నిర్మించిన శివాలయం ప్రారంభ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు శనివారం ప్రకటనలో తెలిపారు.

శిక్షణతోనే వ్యక్తిగత అభివృద్ధి


మాట్లాడుతున్న రామనాథం

పేరాల(చీరాలటౌన్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో గురువు నుంచి శిక్షణ పొంది వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతారని ఎంఈవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సుధారాణి, ఏఆర్ఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాల్మన్‌రాజు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన జాతీయ విద్యా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా పేరాల ఏఆర్ఎం పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పవని భానుచంద్రమూర్తి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో భాను సేవలను కొనియాడి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాంధీ, రాజేంద్ర ప్రసాద్, వెలుగొండారెడ్డి, యలమందేశ్వరరావు, రమణారావు పాల్గొన్నారు.

మీడియాకు ఆటంకం కలిగించే దురభిప్రాయం లేదు

చీరాలటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోగులకు సకాలంలో వైద్యం అందించేందుకు వైద్యులు పూర్తిగా నిమగ్నమవుతారని చీరాల ఏరియా హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.సుభాషిణి అన్నారు. గత బుధవారం మీడియాలో వచ్చిన వార్తపై ఆమె స్పందించారు. అత్యవసర చికిత్స నిమిత్తం వార్డు నిండి ఉన్న క్రమంలో వార్తల సేకరణకు వచ్చిన మీడియా వారికి చికిత్స అనంతరం అనుమతి కల్పించినట్లు పేర్కొన్నారు. మీడియా పట్ల తమకు గౌరవమున్నట్లు సూపరింటెండెంట్ చెప్పారు.

పావులూరులో సహకార వారోత్సవాలు

ఇంకొల్లు, నవంబరు 16,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరులో 71వ సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి తిరుపాల్‌రెడ్డి, సహకార విద్యానిధి సీఈవో శ్రీనివాసులు, అసిస్టెంటు రిజిస్ట్రార్ సుధాకర్,మారుతీబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

చీరాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా అర్హులైన పేదలకు నివేశన స్థలాల పంపిణీ, గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి హామీలను అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 18న గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ బాధ్యులు బత్తుల శామ్యూల్, మేడ వెంకట్రావు, బాబూరావు, ప్రకాష్, రాజశేఖర్, భాను ప్రకాష్, నరేంద్ర, రవి, కిరణ్ పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

చీరాలటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అనధికారంగా మద్యం నిల్వలు, విక్రయాలు, రవాణా చట్టరీత్యా నేరమని భిన్నంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీహరి, సిబ్బంది నియోజకవర్గ పరిధిలోని జాండ్రపేట, పాత చీరాల, రామనగర్, పిట్టువారిపాలెం, కావూరివారిపాలెం, వేటపాలెం ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈక్రమంలో కొత్తకావూరివారిపాలెంకు చెందిన ఆట్ల పార్వతి వద్ద 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు.

రైతుకు తీవ్ర గాయాలు

అద్దంకి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విత్తనాలు కొనుగోలుకు వచ్చిన రైతు మెట్ల పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి మండలంలోని కొటికలపూడికి చెందిన కోవి హనుమంతరావు శనివారం అద్దంకి పట్టణంలోని పాత పెట్రోలు బంక్ ఎదురు దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసేందుకు వచ్చి మెట్లపై నుంచి జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. హనుమంతరావుకు 108 సిబ్బంది హరిబాబు ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు.

యూనివర్సిటీ ఏసీఈగా భారతీదేవి

ఒంగోలు విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి యూనివర్సిటీ యూజీ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారి(ఏసీఈ)గా అర్థశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అంచుల భారతీదేవి నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి శనివారం నియామక పత్రాలను అందజేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న బి.పద్మజ స్థానంలో భారతీదేవిని నియమించారు. రిజిస్ట్రార్ బి.హరిబాబు తదితరులు ఆమెను అభినందించారు. ఇక నుంచి యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ విభాగం హెచ్‌వోడీ పద్మజ కొనసాగనున్నారు.


పరీక్ష ప్రశ్నపత్రం విడుదల చేస్తున్న ట్రస్ట్ చైర్మన్, ఉపాధ్యాయులు

ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్‌కు స్పందన

270 మంది విద్యార్థుల హాజరు

పంగులూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు కొరిశపాడు, అద్దంకి, పంగులూరు, ఇంకొల్లు, చీరాల, వేటపాలెం మండలాల నుంచి 24 పాఠశాలలకు చెందిన 270 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఏడాది డిసెంబరు 8న దేశ వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు వీలుగా మోడల్ టెస్ట్‌ను ఏర్పాటు చేశారు. 180 ప్రశ్నలతో మూడు గంటల సమయంలో పరీక్షను నిర్వహించారు. చందలూరుకు చెందిన అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చడంతో పాటు విద్యార్థులు, వారి వెంట వచ్చిన ఉపాధ్యాయులకు ఉచిత భోజన వసతిని కల్పించారు. వీరనారాయణకు హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి


మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలును సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. శనివారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ పొగాకుకు బదులుగా అ పరాలు, మొక్కజొన్న పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. పొగాకు ఉత్పత్తుల వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, అధిక విస్తీర్ణంలో సాగు చేయడంతో ధరలు పతనమై నష్టం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పొలం చుట్టూ రక్షణ పంటగా జొన్న, ఎర పంటగా ధనియాలను సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం శేషారావు, వ్యవసాయ సహాయకులు ఖాజాబి పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల ఏర్పాటు

అద్దంకిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం పలు ప్రాంతాలల్లో ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. రోటరీ సభ్యులు జాగర్లమూడి శివకుమారి, శ్రీనివాసరావు, కొల్లిపర నాగయ్య, చందోలు అంజమ్మ ఆర్థిక సహకారంతో శ్రీనగర్ రెండవ లైన్‌లో, మధురానగర్‌లో అపార్టుమెంట్ వద్ద, సిమెంట్ బల్లలను ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ మహమ్మద్ రఫీ, జ్యోతి చంద్రమౌళి, లేవి ప్రసాద్, వెంకటేశ్వర్లు, గురుశేఖర్, కొల్లిపర నాగయ్య, విష్ణు, కృష్ణ, హరిబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

అద్దంకిలో నేటి కార్యక్రమాలు

\- అద్దంకి నియోజకవర్గంలోని గ్రామీణ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల కు గుంటూరు లైఫ్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు స్థానిక పోస్టాఫీస్ వద్ద షాదీఖానాలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని అసోసియేషన్ నేత సుబ్బారావు తెలిపారు.

\- గ్రంథాల వారోత్సవాలలో భాగంగా బంగ్లా రోడ్డులోని గ్రంథాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సృజన ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరుగుతుందని గ్రంథపాలకుడు సుగుణరావు, సృజన అధ్యక్ష, కార్యదర్శులు దివాకర్‌దత్, అనిల్‌కుమార్ తెలిపారు.

\- శింగరకొండలోని వాసవీ ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వనసమారాధన, రమాసత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతాయని అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీరాం నాగేశ్వరరావు, భోజనపల్లి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు.


విద్యార్థుల హాజరు పెంచాలి


మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో శ్రీనివాసరావు

బల్లికురవ. నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య (రోల్)ను పెంచి ఉపాధ్యాయుల పోస్టులు రద్దు కాకుండా చూసుకోవాలని విద్యాశాఖ చీరాల డిప్యూటీ ఈవో అబ్బురాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని పాత మల్లాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు తరగతులను పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వసతులపై వారిని అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం శుచిరుచిగా పరిశుభ్రంగా అందించాలని సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతు ఉపాధ్యాయుల పోస్టులు రద్దు కాకుండా ఉండాలంటే విద్యార్థులను బడి బాట పట్టించేలా ముందస్తు ప్రణాళికలతో గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రైవేట్ విద్యార్థులను ప్రభుత్వ బడికి రప్పించాలన్నారు. అలానే చదువులో వెనకబడిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో పాఠశాల హెచ్ఎం ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిపై అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే కొండయ్య

ఆంధ్రజ్యోతి కథనాలపై ప్రస్తావిస్తున్న ప్రజలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య శనివారం శాసనసభలో గళం వినిపించారు. చీరాల నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని సభ దృష్టికి తెచ్చారు. అందులో సాగు నీరు, డ్రైనేజీ, లోవోల్టేజీ తాగునీరు సమస్యలు ఉన్నట్లు వివరించారు. చీరాలలో ఉన్న 100 పడకల ఆసుపత్రి 14 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అక్కడ ఉన్న భవనసముదాయంలో పాత బిల్డింగ్‌లు కూడా ఉన్నాయన్నారు. వాటికి మరమ్మతులు చేయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. డయాలసిస్ యూనిట్ ఉండగా, ట్రామా మంజూరు అయిందని, సర్జికల్ యూనిట్లు ఇవన్నీ పెట్టేందుకు ఉన్న బిల్డింగుల్లో నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తెస్తే అన్ని హంగులతో ఆసుపత్రికి బాగుటుందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి సభ ద్వారా తెలియజేస్తున్నానన్నారు. సానుకూలంగా స్పందించాలని కోరారు. ఆంధ్రజ్యోతిలో గత బుధవారం సకాలంలో వైద్య చేద్దాం.. ప్రాణాలను కాపాడుదాం అన్న శీర్షికన, శుక్రవారం అన్నీ సమకూర్చితే ప్రవేటు కన్నా మిన్న అన్న శీర్షిక ఏరియా వైద్యశాలకు సంబంధించిన స్థితిగతులను వివరిస్తూ కథనాలు ప్రచురితమయ్యాయి. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే కొండయ్య అసెంబ్లీలో 100 పడకల ఏరియా వైద్యశాలలో మరిన్ని మెరుగైన సేవలు రోగులకు అందించేందుకుగాను అసెంబ్లీలో మాట్లాడడంపై చీరాల నియోజకవర్గంతో పాటు చుట్టు పక్కల మండలాల వారు స్ఫూర్తిదాయకం అంటున్నారు. ఇటీవల ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే కొండయ్య ఆసుపత్రిలో ఉన్న అనుకూల, ప్రతికూల పరిస్థితులపై చర్చించారు. కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి క్షేత్రస్థాయిలో ఉన్న వనరులు, అదనంగా సమకూర్చుకోవల్సిన వనరులు, వసతులకు సంబంధించి కమిటీ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గ ప్రజలకు కార్పొరేట్‌కు దీటుగా ఉచిత వైద్యసేవలు ఏరియా వైద్యశాలలో అందించేందుకు తన వాణి వినిపించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జనాల్లో ఈ అంశంపై చర్చ జరుగుతోంది.


సిబ్బందికి ప్రోత్సాహక నగదు అందజేస్తున్న షమీం

సమయపాలనతోనే ప్రజలకు నమ్మకం

డిప్యూటీ సీటీఎం షమీమ్

అద్దంకి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించడం ద్వారా ప్రయాణికులకు ఆర్టీసీ సేవలపై నమ్మకం మరింత పెరుగుతుందని నెల్లూరు డిప్యూటీ సీటీఎం షమీం అన్నారు. ఆర్టీసీ సమయపాలన మాసోత్సవాలను అద్దంకిలో శనివారం ఆయన ప్రారంభించారు. సమయపాలన పాటించడం ద్వారా ప్రయాణికుల ఆదరణ పెరిగి ఆర్టీసీ ఆదాయం పెరుగుతుందన్నారు. డ్రైవర్‌లు, కండక్టర్‌లు కచ్చితంగా ఉదయం బస్సు బయలు దేరే సమయం కంటే 30 నిమిషాల ముందే డ్యూటీకి రావాలని, బ స్టాండ్‌లో పావు గంట సేపు ఉంచి బయలుదేరాలని సూచించారు. ఎక్కువ ఆదాయం, ఎక్కువ కేఎంపీ తీసుకొచ్చిన కండక్టర్, డ్రైవర్లకు నగదు ప్రోత్సాహక బహుమతులను, డీఎం రామ్మోహనరావు సమకూర్చిన కీ చైన్‌లను షమీం అందజేశారు. అద్దె బస్సుల డ్రైవర్‌లకు కూడా ట్రైనింగ్ కళాశాలలో రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి పాల్గొన్నారు.


కలాంకాలనీలో మహిళలతో మాట్లాడుతున్న మహేంద్రనాథ్

కార్యకర్తలకు అండగా ఉంటాం

డాక్టర్ మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాల), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ అన్నారు. మండల పరిధిలోని రామాపురంలో శనివారం జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా కార్యకర్తలు పార్టీ జెండాను మోస్తూ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. టీడీపీ కార్యకర్తల పార్టీ అన్న విషాయన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి, అందరూ పార్టీ సభ్యత్వాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అబ్దుల్ కలాం కాలనీలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

- తహసీల్దార్ అనిత
- సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

కారంచేడు(పర్చూరు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని కారంచేడు తహసీల్దార్ అనిత హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడు మృతికి ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

పర్చూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామ్మూర్తి మృతి కుటుంబ సభ్యులకు, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు, తెలుగుదేశం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు.

నేడు గంగవరంలో వైద్యశిబిరం

ఇంకొల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరంలోని మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు షుగర్‌వ్యాధిగ్రస్తులకు గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళి

చినగంజాం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శాఖ గ్రంథాలయం చినగంజాంలో గ్రంథపాలకుడు ఎ.మోహనలక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పీ నాగభూషణం, ఎస్ఆర్.రంగనాథ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చంద్రయాన్-3 అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథపాలకులు తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం.డి.రత్నకుమారి, ఉపాధ్యాయులు పోతురాజు, తెలుగు సాహితీ వేత్త వీరేశ్వరశాస్త్రీ, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలు చదవాలి


అద్దంకి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఖాళీ సమయాల్లో గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతూ జ్ఞానం పెంపొందించుకోవాలని విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి, కవి గాడేపల్లి దివాకరదత్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో మూడవ రోజు శనివారం రవీంద్ర భారతి స్కూల్ విద్యార్థులను గ్రంథాలయానికి పిలిపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుగుణరావు, వెంకట ప్రసాద్, మోహనరావు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో ఇంటి ర్యాంప్

ఇబ్బంది పడుతున్న వాహనదారులు


రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి వేసిన ర్యాంప్

కొత్తపేట(చీరాల), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట పంచాయతీరాజ్ కార్యాలయం నుంచి సంపత్ నగర్ మూడు రోడ్ల కూడలికి వెళ్లే ప్రధాన రహదారిలో పలు చోట్ల రోడ్డు మార్జిన్లలో ర్యాంప్‌లు ఏర్పాటు చేశారు. దీంతో పాదచారు లు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రద్దీగా ఉండే రహదారి కావడంతో వాహనాలు ఎదురెదురు వచ్చినపుడు ర్యాంప్‌లు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు చేపట్టి ఇబ్బంది లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.





కర్షకుడి కష్టం.. డ్రోన్ తీర్చేనట!

డ్రోన్.. ఇప్పుడు అంతటా వినిపించే పదం ఇది. పెళ్లిళ్లు.. రాజకీయ పార్టీల సభలు, ప్రదర్శనలు, దేవుళ్ల ఊరేగింపులు, జాతరలు, ఇతర శుభకార్యాలను వీడియోలో బంధించేందుకు వాడే అత్యాధునిక పరికరం ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే ఎగిరే యంత్రం అన్నమాట. ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లోకి దూసుకొస్తున్న ఈ డ్రోన్ వ్యవసాయంలోకీ అడుగిడుతోంది. పచ్చని చేనుపై రివ్వున ఎగురుతూ నిమిషాల వ్యవధిలో పొలాన్ని చుట్టేస్తుంది. పైరును ఆశించిన పురుగుతోపాటు వైరస్‌ను నాశనం చేసే క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తుంది. దీనివల్ల కూలీల ఖర్చు, పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుంది. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు డ్రోన్‌లు అందించేందుకు కసరత్తు చేస్తోంది. 6



మనం సేఫ్!

• నెల్లూరులో అదుపులోనే కాలుష్యం

దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రమాద స్థాయికి కాలుష్య కోరలు సాచడంతో దేశ వ్యాప్తంగా ఆందోళన మొదలైంది. దీపావళి తర్వాతే కాలుష్యం ఎక్కువైనట్టు పలు సర్వేలు వ్యక్తం చేశాయి. భవిష్యత్తుతరాలకు ఇది ప్రాణసంకటంగా మారడంతో నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నగరం మాత్రం సేఫ్ జోన్‌లోనే ఉన్నట్లు వాయుకాలుష్య నియంత్రణ మండలి అధికారి ఒకరు వెల్లడించారు. పీఎం10ను 60 మైక్రోగ్రాములు దాటితే ఆందోళన చెందాల్సి ఉండగా ప్రస్తుతం 52 మైక్రో గ్రాములే ఉంది. కావట్టి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. 2019 కరోనా సమయంలో ఏకంగా 66ఎంజీ ఉన్న వాయుకాలుష్యం ఆ తర్వాత తగ్గుతూ 2023లో 52.1 ఎంజీ నుంచి ప్రస్తుతం 52 ఎంజీకి చేరింది. కానీ ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, దీనిని ఎంత తగ్గించుకుంటే మనకు అంత మంచిదని సదరు అధికారి వెల్లడించారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



రోజంతా జడి నగరమంతా తడి

6

జిల్లాను వరుణుడు వీడనంటున్నాడు. శనివారం కూడా వర్షం కురవడంతో జిల్లావాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నెల్లూరులో మధ్యాహ్నం వరకు విడతలవారీగా వర్షం కురవడంతో నగరవాసులు ఇక్కట్లు తప్పలేదు. రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలబడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు.


14,834 ఎకరాలు స్వాహా

• ఫ్రీ హోల్డ్ మాటున భారీ భూ కుంభకోణం
• పెద్దల పేర్లపైకి పేదల భూములు
• అందులో 14,552 అసైన్మెంట్ భూములే
• అక్రమ మార్గంలో 281 ఎకరాల చుక్కల భూములు మార్పు

అధికారుల విచారణలో వెలుగులోకి.. ప్రభుత్వానికి నివేదిక

జిల్లా చరిత్రలో కనీవినీ ఎరుగని భూ కుంభకోణం ఇది. నాడు అధికారమే అండగా వైసీపీ నేతలు సాగించిన భూ బాగోతం ఇప్పుడు వెలుగు చూసింది. ఒకటి కాదు.. రెండు కాదు.... ఏకంగా 14,834.49 ఎకరాలను దొడ్డిదారిన చెరబట్టారు. ఫ్రీ హోల్డ్ జీవో మాటున పేదల భూములను స్వాహా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్రీ హోల్డ్ భూములపై విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా జరిగిన విచారణలో 14,834.49 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా పట్టా భూములుగా మార్చినట్లు తేల్చారు. ఇంత భారీస్థాయిలో అక్రమాలు జరగడాన్ని చూసి జిల్లా ఉన్నతాధికారులే నివ్వెరపోయారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



గతంలో పేదలకు ఇచ్చిన అసైన్మెంట్ భూములను (సుమారు 55,447 ఎకరాలు) పట్టా భూములుగా మార్చి నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఫ్రీ హోల్డ్ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అసైన్మెంట్ చేసి 20 ఏళ్లు దాటిన భూములను ఫ్రీ హోల్డ్ కిందకు తీసుకు రావాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి కొన్ని నిబంధనలను విధించింది. 20 ఏళ్ల క్రితం అసైన్మెంట్ భూములు పొంది ఇప్పటికీ సాగు చేసుకుంటున్న ఒరిజినల్ అసైనీదారులు వారి కుటుంబ సభ్యులకు మాత్రమే ఫ్రీ హోల్డ్ హక్కులు కల్పించాల్సి ఉంది. ఇతరులు సాగు చేసుకుంటున్న ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించకూడదు. అయితే ఇందుకు విరుద్ధంగా 14,552.87 ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి పట్టా భూముల హక్కులు కల్పించారు. ఇందులో చాలా వరకు ఒరిజినల్ హక్కుదారులు లేరు.

పలువురు వైసీపీ నేతలు, భూస్వాములు ఒరిజినల్ అసైనీదారుల మాటున వారి పేర్లపైకి భూములు మార్పు చేసుకున్నారు. మరికొన్ని భూములు 20 ఏళ్లు దాటకపోయిన వాటిని కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా హక్కులను కట్టబెట్టారు. ఇవేగాక అనేక రకాల అక్రమాలు ఈ అసైన్మెంట్ భూముల మాటున జరిగినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా ఫ్రీ హోల్డ్ జీవో ప్రకారం చుక్కల భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగించి, 281.62 ఎకరాలకు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ హక్కులు కల్పించారు.

• గ్రామసభలు లేకనే..

అసైన్మెంట్ భూములకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకున్నా ముందుగా గ్రామసభలు నిర్వహిస్తారు. అప్పుడే వాస్తవాలు వెలుగు చూస్తాయి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామసభలు నిర్వహించకుండానే నిర్వహించినట్లుగా చూపించి ఫ్రీ హోల్డ్ జాబితాను ఆమోదించారు. దీనిపై మొదటినుంచీ విమర్శలు వెలువెత్తినా నాడు పట్టించుకోలేదు. గ్రామసభలు నిర్వహిస్తే ఒరిజినల్ అసైనిదారులు ఎవరు? వారి వారసులు ఎవరు? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఆ భూములు ఉన్నాయి.. ఈ భూములు ఫ్రీ హోల్డ్ హక్కులకు అర్హత పొందుతాయా!? వంటి వివరాలు స్పష్టమవుతాయి. దీంతో అక్రమాలు జరిగేందుకు అవకాశం ఉండదు. అయితే వైసీపీ నేతలకు దోచిపెట్టేందుకే కీలకమైన గ్రామసభలు నిర్వహించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.



• ప్రభుత్వ నిర్ణయం ఏటు!

ఫ్రీ హోల్డ్ మాటున జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వ నిర్ణయం పైనే ఆసక్తిగా మారింది. ఇప్పటికే విచారణ పూర్తి చేసిన జిల్లా ఉన్నతాధికారులు ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. దాదాపుగా ప్రతి మండలంలోనూ అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయింది. వందల మంది రెవెన్యూ సిబ్బంది పాత్ర ఇక్కడ కనిపిస్తోంది. ఇప్పుడు వారందరికీ భయం పట్టుకుంది. కాగా నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములను తిరిగి ఆ జాబితాలోకి చేరుస్తారా!? అసైన్మెంట్ చట్టం (పీవోటీ) ప్రకారం ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందా అన్నది ఉత్కంఠగా మారింది.

అవకతవకలు గుర్తించాం

ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ పూర్తి చేశాం. అసైన్మెంట్ భూములకు సంబంధించి అవకతవకలను గుర్తించాం. ఈ నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తున్నాము. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నాము.

కే కార్తీక్, జాయింట్ కలెక్టర్

పూర్తికాని పనులు.. నీటి కోసం పాట్లు

నెల్లూరు- ప్రకాశం జిల్లాల్లోని మెట్టప్రాంతాలకు వరప్రసాదినిగా చెప్పుకొనే రిజర్వాయర్లు ఏళ్ల తరబడి నిర్మాణాలకు నోచుకోవడం లేదు. ప్రధానంగా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు పెద్దిరెడ్డిపల్లి వద్ద నిర్మిస్తున్న వెలుగొండలో అంతర్భాగమైన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు తొలుత జోరుగా సాగినా క్రమేణా నత్తనడకన సాగుతూ ప్రస్తుతం నిలిచిపోయాయి. ఇప్పటికే పలుమార్లు గడువు పెంచినా ఏమాత్రం ఫలితం లేకపోగా ఇంతవరకు జరిగిన పనులను పరిశీలిస్తే ఎన్నటికీ పూర్తయ్యేనో అన్న అనుమానాలు ఈ ప్రాంత వాసులను వేధిస్తున్నాయి.

• మెట్టప్రాంతంలో ఊరిస్తున్న రిజర్వాయర్లు
• రోజులు గడుస్తున్నా పూర్తికాని పనులు
• రైతుల ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే!

వరికుంటపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెలుగొండ ప్రాజెక్టు పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అందులో భాగంగా 1,650 మీటర్ల పొడవు, 32 మీటర్ల ఎత్తుతో పెద్దిరెడ్డిపల్లి వద్ద నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టులో ప్రకాశం జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు పడమటి కాలువ నుంచి 2.501 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా రూపకల్పన చేశారు. ఇక్కడ నుంచి ఆ నీటిని ఆయా నియోజకవర్గాల పరిధిలోని 65వేల ఎకరాలకు సాగునీరు, 1.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించనున్నారు. వరికుంటపాడు మండలంలో 13వేల ఎకరాలు, ఉదయగిరిలో 11వేలు, దుత్తలూరులో 20వేల ఎకరాలతోపాటు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో 21వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలో రూ.1100 కోట్లతో పెద్దిరెడ్డిపల్లి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు 2007లో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేయగా 2009లో పనులు ప్రారంభమయ్యాయి. తొలుత జోరుగా సాగిన పనులను చూసిన రైతులు, ప్రజలు ఇక తమ కష్టాలు తీరినట్లేనని సంబరపడ్డారు. 2012 వరకు అదేజోరుగా సాగిన పనులు ఆపై క్రమేణా నిధులు లేకపోవడంతో 2016 వరకు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వాయిదాలపర్వం కొనసాగిస్తూ చివరికి గతేడాది సెప్టెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు వెలువడినా ఫలితం లేకుండా పోయింది.



పూర్తికాని పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు



గండిపాళెం జలాశయ కాలువ దుస్థితి

• నక్కలగండిపై నిర్లక్ష్యం

అదేవిధంగా నక్కలగండి రిజర్వాయర్ ఆధునికీకరణ పనుల్లోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. 1954లో నిర్మాణానికి రూపకల్పన చేసిన ఆ రిజర్వాయర్ పరిధిలో 1200 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. 1989 సంభవించిన పెను తుపాను కారణంగా ఆ రిజర్వాయర్ కట్ట తెగిపోయింది. దీంతో 1996లో విడుదలైన రూ.2కోట్లతో తిరిగి రూపకల్పన - మిగతా 6లో..



ఆలయ నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న విధుశేఖర భారతి, మంత్రి ఆనం

సోమేశ్వరాలయ పునఃనిర్మాణం

అట్టహాసంగా భూమిపూజ

పాల్గొన్న విధుశేఖర భారతి, మంత్రి ఆనం

- వివరాలు 6లో..

కుటుంబాల లెక్క తప్పుతోంది!

నత్తనడకన జియో ట్యాగింగ్ సర్వే

• సెలవుల్లో సచివాలయ సిబ్బంది
• పనిచేయని మొబైళ్లు, వేలిముద్ర డివైజ్‌లు
• జిల్లాలో 8,47,538 కుటుంబాలు.. సర్వే పూర్తయ్యింది 3,39,700
• 25 వరకు గడువు పొడిగింపు

గ్రామ, పట్టణ ప్రాంతాలలో ప్రతి ఇంటిని జియోట్యాగింగ్ (మ్యాపింగ్) చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. వాస్తవానికి ఈ నెల 15వ తేదీ నాటికల్లా సర్వే పూర్తి చేయాల్సి ఉంది. అయితే, అనుకున్న స్థాయిలో సర్వే జరగక పోవడంతో 25వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిసింది. కాగా, సర్వేకు కొందరు సచివాలయ ఉద్యోగులు దూరంగా ఉండటం, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ అరకొరగా ఉండటంతో నత్తేనయం అనేలా జిల్లాలో సర్వే సాగుతోంది.

- నెల్లూరు (హరినాథపురం, ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా మొత్తం 8,47,538 కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు 3,39,700 కుటుంబాల సర్వే (40 శాతం) పూర్తయింది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 1,87,637 కుటుంబాలు ఉంటే అందులో 61,265 కుటుంబాల సర్వే (30 శాతం) మాత్రమే పూర్తయింది. సచివాలయ క్లస్టర్ వారీగా ఈ సర్వే జరుగుతుండగా, కొన్ని క్లస్టర్ల పరిధిలో కొన్ని కుటుంబాలు కనిపించనట్లు సమాచారం.

• 769 సచివాలయాలు

జిల్లాలో 769 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా, 5,500 మందికి పైబడి సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో కొందరు సర్వే చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు సమాచారం. మరో 500మందికిపైగా ఉన్నత ఉద్యోగ పరీక్షలంటూ సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. వీరి పరిధిలో చేయాల్సిన కుటుంబ సర్వేను ఆ సచివాలయంలో మిగిలిన ఉద్యోగులు చేయాల్సి రావటం వారికి భారంగా మారింది. గతంలో ఈ సచివాలయాల్లో 13,295 మంది వలంటీర్లు పనిచేసేవారు. వీరు ఒక్కొక్కరు 50 ఇళ్లను తీసుకుని గతంలో కుటుంబ మ్యాపింగ్ చేశారు. అయితే, స్థానికంగా కుటుంబాలు లేకపోయినా వలంటీర్లు ఉన్నట్లు కుటుంబ మ్యాపింగ్ చేయడం ప్రస్తుతం సమస్యకు దారి తీసింది. సచివాలయ ఉద్యోగులు చేస్తున్న సర్వేలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. వేల కుటుంబాలు కనిపించనట్లు తెలుస్తోంది.

• అవస్థలెన్నో..

కూటమి ప్రభుత్వం ఈ సర్వే కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో కుటుంబ వివరాలు పూర్తిగా నమోదు చేయాల్సి ఉంది. అయితే, వేలిముద్ర వేసేందుకు ఇచ్చిన డివైజ్‌లు పని చేయడం లేదు. కొన్ని ప్రాంతాలలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య తలెత్తుతోంది. కొన్ని సచివాలయాల్లో పూర్తిస్థాయి సిబ్బంది లేరు. వలంటీర్లు ఉన్నప్పుడు 50 కుటుంబాలనే మ్యాపింగ్ చేశారని, ఇప్పుడు ఒక్కొక్కరు 500 కుటుంబాలకుపైగా సర్వే చేయాల్సి వస్తోందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. వలంటీర్లు తిరిగి ఇచ్చేసిన మొబైళ్లు కూడా సరిగ్గా పనిచేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. తమ సొంత మొబైల్‌ను వినియోగిస్తామంటే యాప్‌ల భారాన్ని అవితట్టుకోలేక పోతున్నాయని చెప్పారు. ట్యాబ్‌లు, మంచి స్టోరేజ్ ఉన్న సెల్‌ఫోన్లు, డివైజ్‌లను అందచేస్తే సర్వేను సమర్థవంతంగా పూర్తి చేస్తామని వారు చెప్పుకొస్తున్నారు. ఏది ఏమైనా ఈ సర్వే విషయంలో అధికారుల పర్యవేక్షణ పెంచి సర్వేను సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.



నెల్లూరు నగరంలో కుటుంబ సభ్యులు వివరాలు సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

వేలిముద్ర వేయం

నెల్లూరు (సిటీ) : నగరంలో ఇంటింటా సర్వేకు వెళుతున్న సచివాలయ ఉద్యోగులకు వింత అనుభవాలు ఎదరవుతున్నాయి. నేటి సమాజంలో సైబర్ నేరగాళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు సర్వేకి వెళ్లిన ఉద్యోగులకు వేలిముద్రలు వేయమంటూ తెగేసి చెబుతున్నారు. తమ వివరాలు కావాలంటే తీసుకోండి.. కానీ బయోమెట్రిక్ మాత్రం వేయమని తెగేసి చెప్పేస్తున్నారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులైతే ఇంటి వద్దకు కూడా సర్వే బృందాలను రానివ్వడం లేదన్ని ఆవేదన సచివాలయ ఉద్యోగుల నుంచి వస్తోంది. తమకు ఎలాగూ ప్రభుత్వ పథకాలు, ఏ ఇతర లబ్ధి రాదు, కాబట్టి తాము ఎలాంటి వివరాలు, వేలిముద్రలు ఇవ్వమంటూ స్పష్టం చేస్తున్నారు. ఈ వరుసలో పోలీసు శాఖ మొదట్లో ఉన్నట్లు తెలుస్తుండగా ఐటీ చెల్లింపులు, కార్లు ఇతర వాహనాలు ఉన్న ప్రైవేట్ వ్యక్తులు కూడా తమ ఇళ్లకు సర్వే బృందాలను రానివ్వడం లేదని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు.



దొంగలతో జాగ్రత్త సుమీ!

'దొంగల బెడద ఎక్కువవుతోంది. కొంచెం ఏమరుపాటుగా ఉంటే చాలు ఇల్లు, దుకాణాలు గుల్ల చేస్తున్నారు. కాబట్టి అందరూ జాగ్రత్తగా ఉండాలి. సీసీ కెమెరాలు, అలారం తాళాలు అమర్చుకోవాలి.' అంటూ పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. శనివారం ఉలవపాడు పోలీస్ స్టేషనులో ఎస్ఐ అంకమ్మ బంగారం వ్యాపారులతో సమావేశమై పలు దిశా నిర్దేశాలు చేశారు. ప్రధాన రహదారుల్లో వ్యాపార కేంద్రాలు ఉన్నందున చుట్టు పక్కల పరిసర ప్రాంతాలు, రహదారులు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు బిగించుకోవాలని, అలారం మోగే లాక్‌లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

- ఉలవపాడు (ఆంధ్రజ్యోతి)



ఆగని వాన

● తడిసి ముద్దవుతున్న నగరం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నెల్లూరు నగరం తడిచి ముద్దవుతోంది. చిరు, రోడ్డు మార్జిన్ వ్యాపారులు నష్టాలను చవిచూస్తుండగా, ఉద్యోగులు, కూలీలు, విద్యార్థులు బయటకు వెళ్లేందుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు వర్షపునీటికి అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలన్నీ వ్యర్థాలతో నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కాగ శనివారం పడారుపల్లి వద్ద 24 మి.మీ, గాంధీబొమ్మ కూడలి, కార్పొరేషన్ కార్యాలయం 17, గాంధీనగర్ వద్ద 12, కరెంటాఫీసు కూడలి 7, సౌత్‌మోపూరు, మాదరాజుగూడూరు, బుజబుజనెల్లూరు 1-2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. కాగ నెల్లూరురూరల్‌లోని పలు గ్రామాల్లో 300 ఎకరాలకు సరిపడా నారుమళ్లు దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



రాబోయేది డ్రోన్ల వ్యవసాయం.. ఇప్పటికే అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ రంగం ముందుకు సాగుతోంది. దీనికితోడు కూటమి ప్రభుత్వం ఈ రంగానికి పెద్దపీట వేయడంతోపాటు భారీ బడ్జెట్ కేటాయించింది. గతంలో జరిగిన వ్యవసాయ శాఖ సమావేశంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు డ్రోన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు డ్రోన్‌లు అందించేందుకు కసరత్తు చేస్తోంది. అయితే, ఇప్పటికే జిల్లాలో కొంతమంది అద్దెప్రాతిపదికన డ్రోన్లను వినియోగించి మందులు పిచికారీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం అమలైతే ఇటు రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

కర్షకుడి కష్టం..

డ్రోన్ తీర్చేనట!



వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం కష్టంగా మారుతోంది. దీనికితోడు పెట్టుబడులు కూడా భారీగా పెరగడంతో రైతులకు ఆర్థిక భారం ఎక్కువవుతోంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రైతులకు ఆధునిక సాంకేతికత అందించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలు వ్యక్తిగతంగా రైతులకు అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా డ్రోన్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. జిల్లాలో ఈ రబీ సీజన్‌లో దాదాపు 7లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తుండగా, ప్రధానంగా వరి సాగుకే రైతులు మొగ్గుచూపుతారు. చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సాగు, పెట్టుబడి వ్యయం తగ్గించే దిశగా ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేసేందుకు డ్రోన్లు ఇవ్వనుంది.

● ఇవిగో ప్రయోజనాలు..

ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరతను అధిగమించి రసాయనాలు పిచికారీ చేయడానికి డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయి. ఒక డ్రోన్‌తో ఎకరాకు దాదాపుగా రూ.500 ఖర్చుతో మందులు పిచికారీ చేయవచ్చు. అదే సాధారణ స్ప్రేయరుతో అయితే సుమారు రూ.1500 వరకు ఖర్చవుతుంది. అంతేగాక డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేయడం వల్ల దాదాపు 25 శాతం వరకు సమయం ఆదా అవుతుంది. నేలలో తేమ ఎక్కువగా ఉన్నా, వాతావరణం ప్రతికూలంగా ఉన్నా డ్రోన్‌తో పిచికారీకి ఇబ్బందులు ఉండవు. పంట మొత్తానికి ఒకే మోతాదులో రసాయనాలు చల్లడంతోపాటు అన్ని ప్రాంతాలు సమానంగా పిచికారీ జరుగుతుంది. తక్కువ నీరు, పరిమిత రసాయనాలతో సమర్థవంతంగా పిచికారీ చేయడం వల్ల చీడపీడలను అరికట్టవచ్చు. ఏ పంటకు ఏ దశలో ఎంత మోతాదులో పిచికారీ చేయాలో వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేస్తారు. దీంతో రైతులకు శ్రమ తగ్గడంతోపాటు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. కాగా, రూ.10లక్షలు విలువచేసే డ్రోన్‌ను ప్రభుత్వం 40 శాతం రాయితీపై రైతు సంఘాలకు ఇవ్వనుంది. మిగిలిన 60 శాతం నగదును సదరు సంఘాలు బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది.

● యువతకు ఉపాధి

జిల్లాలో ఇప్పటికే డ్రోన్లు అందుబాటులో ఉన్నాయి. కొంతమంది ఔత్సాహికులు అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. చీడపీడల నివారణకు రసాయనిక ఎరువులు చల్లేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. పొదలకూరు, బుచ్చి, కోవూరు, కందుకూరు, ఆత్మకూరు, ఇందుకూరుపేట, మనుబోలు తదితర ప్రాంతాల్లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఎకరాకు రూ.500 నుంచి రూ.600 వరకు తీసుకుని మందులు పిచికారీ చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ దాదాపు ఏడాది కిందటే 28 మంది డ్రోన్ పైలెట్లకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శిక్షణ కూడా ఇప్పించి సిద్ధం చేసింది. అయితే గత ప్రభుత్వం డ్రోన్లను అందించడంలో విఫలమైంది. రైతులు ఎంతో ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం డ్రోన్ల వినియోగానికి పెద్దపీట వేసింది. దీంతో ఇటు రైతులకు ఉపయుక్తం అటు యువతకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

● తగ్గనున్న పెట్టుబడి వ్యయం.. కూలీల కొరతకూ చెక్!

● రైతులకు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం

● 40 శాతం రాయితీపై త్వరలో అందజేత?

● 28 మంది పైలెట్లకు పూర్తయిన శిక్షణ

● ఇప్పటికే అందుబాటులో ప్రైవేటు డ్రోన్లు

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

వ్యవసాయంలో డ్రోన్ల పాత్ర ఎంతో కీలకమైంది. సాంకేతిక పరిజ్ఞానానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇటీవల వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేసింది. ఇందులో డ్రోన్లకే ఎక్కువగా కేటాయించారు. అయితే మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే 28 మంది పైలెట్లను ఎంపిక చేసి శిక్షణ కూడా పూర్తి చేయించాం. డ్రోన్ల బ్యాటరీ పరిస్థితిని బట్టి రూ.7లక్షల నుంచి 10లక్షల వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సబ్సిడీ, రైతు బృందాల వాటా వంటి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌కు

శిక్షణ తప్పనిసరి

● రాష్ట్రవ్యాప్తంగా మూడు సంస్థలకు బాధ్యతలు

● జిల్లాలో ఆర్టీసీ నెల్లూరు డిపో-1లో శిక్షణ

● ఆ సర్టిఫికెట్ ఆధారంగా లైసెన్స్ రెన్యూవల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాలం మారింది.. గతంలోలా బస్సులు, లారీలు వంటి హెవీ వాహనాల డ్రైవింగ్ చేసే విధానం మారిపోయింది. టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న క్రమంలో వాహన రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఈ క్రమంలో పాత వాహనాలతోపాటు నూతన టెక్నాలజీతో మార్కెట్‌లోకి వచ్చిన హెవీ వాహనాలను నడిపేలా రవాణా శాఖ అధికారులు వినూత్న ఆలోచనలకు తెరలేపారు. రవాణా శాఖ కమిషన్ ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది ఏప్రిల్ తరువాత హెవీ డ్రైవింగ్ లైసెన్సు కాల పరిమితి ముగిసిన డ్రైవర్లు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోకుండా రవాణా శాఖ నిర్ధారించిన శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొంది సర్టిఫికెట్ తీసుకోవాలి. ఆ తర్వాత డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చే సమయంలో తప్పనిసరిగా ఆ సర్టిఫికేషన్ ఉంటేనే హెవీ లైసెన్స్ రెన్యూవల్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.



నెల్లూరు ఆర్టీసీ డిపోలో శిక్షణ పొందుతున్న డ్రైవర్లు

● 3 సంస్థలకు శిక్షణ కేటాయింపు

రాష్ట్రంలో మూడు సంస్థలకు హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇచ్చే బాధ్యతలను రవాణా శాఖ కేటాయించింది. అందులో భాగంగా ఆర్టీసీ సంస్థ, కృష్ణ జిల్లాలోని గన్నవరం అంబాపురంలోని లారీ అసోషియేషన్ డ్రైవింగ్ స్కూల్, నందిగామలోని పిసిబోస్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తయ్యాక వారు ఇచ్చే సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా పొందాలి.

● నెల్లూరులో 1వ డిపోకు శిక్షణ బాధ్యతలు

ఇక జిల్లాకు సంబంధించి నెల్లూరు ఒకటవ డిపోలో డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకుగాను రూ.1000 ఫీజు, జీఎస్టీ రూ.180లకుపైగా వసూలు చేస్తున్నారు. శిక్షణ పొందిన డ్రైవర్లు సర్టిఫికెట్ పొంది దాని ద్వారా హెవీ లైసెన్సు రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకొని టెస్ట్‌కు వెళ్లి లైసెన్సు పొందుతున్నారు. ఇప్పటివరకు నెల్లూరు రీజియన్ పరిధిలో 169 మంది ఒకటవ డిపోలో శిక్షణ పొందారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు శనివారం పట్టణంలోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి 300 మందికిపైగా క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్ సలాం నేతృత్వంలో కందుకూరు డీఎస్పీ సీహెచ్ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా కార్యక్రమానికి హాజరై కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. మహిళల స్వీయరక్షణకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తైక్వాండో సంఘం కార్యదర్శి ఎల్‌టీ చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, గోనుగుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్నడీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తదితరులు

నీటికోసం పాట్లు

(5వ పేజీ తరువాయి)

చేశారు. అలాగే 2018లో విడుదలైన రూ.2.96 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో కాంక్రీటు గోడతో సహా కుడి, ఎడుమ కాలువలకు మరమ్మతు చేయాల్సి ఉంది. 2020, జూన్ నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వీటికితోడు సమీప ఉదయగిరి మండలం గండిపాళెంలో 16వేల ఎకరాల విస్తీర్ణం పరిధిలో 1975లో నిర్మించిన రిజర్వాయర్ పరిస్థితి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ తరుణంలో రూ.25 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన కాలువల మరమ్మతు పనులు ఆశించిన మేర ముందుకు సాగకపోవడం రైతులకు శాపంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతోపాటు పర్యవేక్షణ బాధ్యతలను గాలికి వదిలివేయడంతో ఇలాంటి పరిస్థితి దాపురించిదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీంతో చేసేది లేక కరువు కోరల్లో చిక్కుకున్న ప్రజలు, రైతులు తమ వ్యవసాయ భూములను అమ్ముకొని బతుకు బండి సాగించేందుకు వలసబాట పట్టాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పెద్దలైనా రాజర్వాయర్ పనులను పూర్తిచేసి తాగు, సాగునీటి బాధలు తీర్చాలని మెట్టప్రాంత ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ముందుకు సాగని నక్కలగండి కాలువ పనులు

రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రికి రూ.5 లక్షల వితరణ

నెల్లూరు(వైద్యం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రికి రేడియాథెరపీ విభాగానికి సత్యాస్ బ్లూ థింకింగ్ ఈక్విటబుల్ సొసైటీ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ యాచమనేని బృంద, పాకాల శ్రీవల్లి, పాకాల శ్రీకాంత్, చేడిమాల ఉమారాణిలు రూ.5 లక్షల విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును శనివారం కేన్సర్ ఆసుపత్రిలో జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి, యాలమూరి రంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నాగేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న దాతలు బృంద, శ్రీవల్లి తదితరులు

గిరిజనులు ఉన్నత స్థితికి ఎదగాలి

● రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలను వినియోగించుకుని గిరిజనులు ఉన్నత స్థితికి ఎదగాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా యానాది కుటుంబాలకు ఆధార్, రేషన్‌కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేవని తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 40 శాతం మంది గిరిజనులకు నరేగా జాబ్‌కార్డులు లేవని, అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణలో జాప్యం జరుగుతోందని, ఆయా కేసుల్లో బాధితులకు నష్ట పరిహారం సత్వరమే అందచేయాలని అధికారులకు సూచించారు. ఇలాంటి కేసుల విషయంలో కోర్టుకు హాజరయ్యే బాధితులకు నిబంధనల ప్రకారం రవాణా ఖర్చులు చెల్లించాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి పరిమళ, ఎస్టీ సంఘాల నాయకులు పెంచలయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన కలెక్టర్ ఆనంద్‌తో సమావేశమై, జిల్లాలో గిరిజనుల సమస్యలపై చర్చించారు. అలాగే నెల్లూరు ఆర్డీవో అనూష కూడా వడిత్యా శంకర్ నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి కృష్ణకాంత్‌ను శంకర్‌నాయక్ కలిసి, పలు అంశాలపై చర్చించారు.

● చట్టాలపై గిరిజనుల్లో అవగాహన పెంపొందించాలి

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ చట్టాలపై గిరిజనుల్లో అవగాహన పెంపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ సూచించారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సీఐడీ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ, నగర డీఎస్పీలు ఎన్ కోటారెడ్డి, డి శ్రీనివాసరెడ్డి, నెల్లూరు రూరల్ తాహసీల్దారు డి లాజరస్, ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆనంద్‌తో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

సోమేశ్వరాలయ పునఃనిర్మాణం

● అట్టహాసంగా భూమిపూజ ● పాల్గొన్న విధుశేఖర భారతి, మంత్రి ఆనం

అనంతసాగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల క్రితం సంభవించిన వరదలకు ధ్వంసమైన సోమశిలలోని సోమేశ్వరుడి ఆలయ పునఃనిర్మాణానికి శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజలు అనంతరం విధుశేఖర భారతి మాట్లాడుతూ మంత్రి ఆనం ధ్రుడ సంకల్పంతో అత్యంత ప్రాచీనమైన సోమేశ్వరుడి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు సేవాదృక్పథం కలిగి పరులకు ఉపకారిగా ఉండాలని సందేశం ఇచ్చారు. అనంతరం మంత్రి ఆనం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి విషయంలో గత వైసీపీ పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు సహకారంతో ఆలయ పునఃనిర్మాణం జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఉప్పల విజయ్ కుమార్, సోమసుందరమూర్తి, నాయకులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ భూమి పూజలో విధుశేఖర భారతి, మంత్రి

● పెంచలస్వామిని దర్శించుకున్న విధుశేఖర భారతి

రాపూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని శ్రీ శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆలయ అర్చకులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం విధుశేఖర భారతిస్వామిని ఆలయ అర్చకులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గండి ఆంజనేయ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ జొల్లు వెంకట సుబ్బయ్య, ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్ఐ వెంకటరాజేష్, తదితరులు పాల్గొన్నారు.

● నేడు కొండబిట్రగుంటకు.....

కావలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఆదివారం సాయంత్రం 4గంటలకు నియోజకవర్గంలోని బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి వస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఆలయ ప్రాకారం, గాలి గోపురాలకు శృంగేర పీఠాధిపతి శంకస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సంప్రదాయ దుస్తులతో భక్తులు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

న్యూస్ బాక్స్

సమస్యలు పరిష్కరించండి

కలిగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను విజయవాడలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సిబ్బంది కొరత ఉందన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

కావలి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలుగోళమ్మపేట అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి జన్మదిన పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి చక్రస్నాం, పడి పూజ, విశేష పూజలు నిర్వహించారు. చక్ర స్నానం పూజలకు ఎన్‌.శ్రీనివాసులురెడ్డి దంపతులు, గుర్రం వెంకటేశ్వర్లు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పడిపూజకు ఉభయకర్తలుగా మారంరెడ్డి శివన్నారాయణ దంపతులు మాధవరెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయ కోశాధికారి అమరావేదగిరి ధర్మకర్తలు మాధవి, నవీన్, సభ్యులు, గురుస్వాములు పాల్గొన్నారు.

ఎన్‌కేబీసీలో సమస్యలు పరిష్కరించండి

కొండాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చింతలదీవి పంచాయతీ పరిధిలోని జాతీయ కామదేను పునరుత్పత్తి కేంద్రంలోని సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థక శాఖ డైరెక్టర్‌ను మండల బీజేపీ అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున కోరారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం దామోదరనాయుడును బీజేపీ రాష్ట్ర యువ మోర్చ ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఎన్‌కేబీసీలోని సమస్యలను పరిష్కరించాలని కోరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సర్వే వేగవంతం చేయాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటింటా సర్వే, ఎన్‌పీసీఐ ఆధార్ లింకు కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ మల్లికార్జున సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించి సర్వేను వేగవంతం చేయాలన్నారు.

ఎంబుక్ మాయంపై కేసు

సంగం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వంగల్లు పంచాయతీకి చెందిన ఎంబుక్ మాయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదయింది. వివరాల మేరకు.. వారం రోజుల కిందట బీరువా తాళాలు పగులగొట్టి అందులోని ఎంబుక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారం

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకయ్యస్వామి ఆలయం వీధిలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి శనివారం 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. కాలనీలో లోఓల్టేజ్ సమస్యను ఇటీవల ఏఈగా బాధ్యతలు చేపట్టిన మన్మధరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన వెంటనే 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన కవి సమ్మేళనం

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. తెలుగు పండింట్లను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ సబ్బు ప్రవీణ్, లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

కావలి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు సాయిప్రసాద్ శనివారం ఆర్డీవో వంశీకృష్ణను కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

కావలి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్పీడీవో శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నిర్మూలన, ఉపాధిహామీ పనులు, తాగునీటి సరఫరా, నీటిపారుదల తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

బహిరంగ ప్రకటన

అందుమూలముగా నా క్లయింట్ M/s Shriram Finance Ltd., Atmakur బ్రాంచి ... శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, దుత్తలూరు గ్రామం & మండలం ...

SCHEDULE

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, ఉదయగిరి సబ్‌డివిజన్ ... దుత్తలూరు మండలం, దుత్తలూరు గ్రామ పంచాయతీ ...

Perepi Venugopal, B.Com., B.L.,
Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259520

చెత్త సంపద కేంద్రాలు పిల్లర్లకే పరిమితం

లింగసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను చెత్తరహితంగా, పరిశుభ్రంగా తయారు చేసేందుకు తడి,పొడి చెత్తను సేకరించి దాన్ని వర్మీకపోస్టు ఎరువుగా తయారు చేసి రైతులకు అందించేందుకు 2014-19లోని తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త సందప కేంద్రాలు మండలంలో నిరుపయోగంగా ఉన్నాయి. 2017లో లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెంలో సుమారు రూ.3.50లక్షల వ్యయంతో చెత్త సంపద కేంద్రాన్ని నిర్మాణం ప్రారంభించారు. కేంద్రం ఏర్పాటుకు పిల్లర్లు లేపి వాటిపైనే తాటిఆకులు, బొంగులతో నిర్మాణం చేపట్టారు. సుమారు 20వర్మీకంపోస్టు పిట్లు నిర్మించారు. నిర్మాణం పూర్తయిన వెంటనే అధికారులు ఈ కేంద్రాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించారు. అయితే అప్పట్లో ప్రభుత్వం రిక్షాలు మంజూరు చేసి చెత్తసేకరణలకు గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. కేంద్రం వద్ద ఉన్న బొంగులు తరువాత గాలి వాన వచ్చి బొంగులు, తాటాకులు లేచి పోవడంతో అధికారులు పట్టించుకోలేదు. అప్పటి నుండి ఈ కేంద్రాన్ని పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. మిగిలిన పంచాయతీలలో రేకులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే 2023లో వైసీపీ ప్రభుత్వం చెత్త తరలింపు రిక్షాలను మంజూరు చేయగా, వాటిని అన్ని పంచాయతీలకు పంపిణీ చేశారు. వాటిని ఎక్కడా వినియోగించిన దాఖలాలు లేవు. పైగా ఈ రిక్షాలను మూలకు చేర్చారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మాధవరావును వివరణ కోరగా, ఈ కేంద్రాన్ని పునర్నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.


పంచాయతీ కార్యాలయంలో చెత్తను తరలించే రిక్షాలు


లింగసముద్రం చెత్త సంపద కేంద్రం కేంద్రం దుస్థితి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ ఉద్యమంలో పనిచేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, లైబ్రరీ రికార్డు అసిస్టెంట్ ఐ.తనూజ, పలువురు పురప్రముఖులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యేల గళం

జలదంకి, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం రాష్ట్ర అసెంబ్లీలో తమ గళం వినిపించారు. నియోజకవర్గంలోని 8మండలాల్లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ సుజల పథకం కింద రూ.26కోట్లతో మంచినీటి పథకాలను నిర్మించామని, మరో రూ.5కోట్లు ఖర్చు చేస్తే అవి ప్రజలకు వినియోగంలోకి వచ్చేవన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి నిధులు ఇవ్వకుండా గాలికొదిలేసిందన్నారు. ప్రజల దాహార్తి తీర్చేలా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిధలు కేటాయించాలని ఎమ్మెల్యే ప్రశ్నోత్తరాల సమయంలో కోరారు.

కావలి సమస్యలపై..

కావలి, నవంబరు 16: నియోజకవర్గంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం, మైనర్ ఇరిగేషన్, తీరప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు.

● మద్దూరుపాడు ఏపీ టిడ్కో ఇళ్లకు తూర్పున ఇరిగేషన్ ట్యాంకు ఉన్నదని దాని ఎఫ్‌టీఐ లెవల్‌లోనే టిడ్కో ఇళ్ల బేస్‌మెంట్ వేసినట్లు తెలిపారు. చెరువు నిండితే గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ముంపునకు గురౌతున్నట్లు వాపోయారు. నివారణకు ప్రహరీ నిర్మించి వర్షపునీరు వెళ్లేలా డ్రైనేజి ఏర్పాటు చేయాలన్నారు.

● జమ్మలపాలెంలో 113ఎకరాలు టిడ్కో ఇళ్లకు స్థలం సేకరించి లబ్ధిదారులకు బేస్‌మెంట్‌లు వేశారని వైసీపీ ప్రభుత్వం ఈ బేస్‌మెంట్‌లను తొలగించి నుడాకు అప్పగించడంతో వాటిని రూ.39కోట్లకు డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ ఇచ్చి లేఅవుట్ వేసి అమ్ముకున్నారన్నారు.

● నియోజకవర్గంలో చెరువులు కాలువలు అభివృద్ధి, మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. నిధులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే 72కి.మీ తీరప్రాంతంలో 40వేల కుటుంబాల మత్స్యకారులు నివసిస్తున్నారని చెప్పారు. సముద్రపు గాలికి విద్యుత్ తీగలు తుప్పుపట్టి రాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో తరచూ తెగి ఇళ్ల పడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ తీగలు మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.


కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి క్రిష్ణారెడ్డి

కౌలు రైతులకు రుణాలు

● ఏవో శ్రీధర్‌రెడ్డి అనంతసాగరం



అనంతసాగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలో కౌలు రైతులకు మొదటి పంట సాగుకు అవసరమైన పంట రుణాలకు వ్యవసాయశాఖ ద్వారా సహకారం అందిస్తున్నామని మండల అగ్రికల్చర్ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

? మొదటిపంటగా ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

! అన్ని గ్రామాల్లో ఈసీజన్‌లో 11వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. 5వేల ఎకరాల్లో నార్లు పోశారు.

?ఎరువుల కొరత ఉందా.

! అవసరమైన ఎరువులు రైతు సేవాకేంద్రాలతో అందిస్తున్నాం. కావల్సిన వారు వీఏఏలను సంప్రదించాలి. కొరత లేకుండా ప్రత్యేక దృష్టి సారించాం.

? అనధికార దుకాణాలపై చర్యలు తీసుకుంటున్నారా.

! అన్ని పురుగుమందుల దుకాణాలు తనిఖీ చేస్తున్నాం. అనధికారికమంటూ లేవు. కొనుగోలు చేసే సంచులపై బిల్లు ఇవ్వాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం. రైతులు ఫిర్యాదు చేయాలి.

? వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇస్తున్నారా.

! తుఫాన్ ప్రభావంతో కొన్ని గ్రామాల్లో వరి దెబ్బతిన్నట్లు తొలుత ప్రాథమికంగా గుర్తించాం. అనంతరం పొలాల్లో నీరు నిల్వ చేరకుండా రైతులకు జాగ్రత్తలు తెలియజేశాం. ఎలాంటి నష్టం జరుగలేదు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీ శక్తి భవనంలో శనివారం ఈనెల 23న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నోడల్ అధికారులు చంద్రమౌళి, వేణు మాట్లాడుతూ 19నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. శిక్షణ ఇవ్వాల్సిన మాస్టర్‌ట్రైనర్, జలవనరుల శాఖ డీఈ సాయి శంకర్‌నారాయణ రాకపోవడంతో నోడల్ అధికారులే శిక్షణ ఇచ్చారు. ఆయన గైర్హాజరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు కార్యక్రమంలో శ్రీనివాసులు, జహీర్‌ఖాన్ పాల్గొన్నారు.

● దుత్తలూరు (ఉదయగిరి రూరల్): స్థానిక మండల కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్, ఇరిగేషన్ డీఈ గురుమూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

● లింగసముద్రం: సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులు, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్, రాళ్లపాడు ప్రాజెక్టు డీఈ ఎం.వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి, ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళిలు శిక్షణ ఇచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సంగం: పాల్గొన్న తహసీల్దారు సోమ్లా నాయక్

● జలదంకి: స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ ప్రమీల ఆధ్వర్యంలో శిక్షణలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● సంగం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీవో, ఏపీవోలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లానాయక్ పాల్గొని మాట్లాడారు కొరిమెర్ల, చెన్నవరపాడు, మర్రిపాడు, సంగం మైనర్ సాగునీటి సంఘాలు, పడమటిపాళెం, అన్నారెడ్డిపాలెం రెండు మేజర్ సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఈనెల 21న ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వినయ్ కుమార్, ఏవో శ్రీహరి పాల్గొన్నారు.


ఉదయగిరి రూరల్: శిక్షణ ఇస్తున్న నోడల్ అధికారి చంద్రమౌళి

● కొండాపురం: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి మండల కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో కలువాయి మండల ఇరిగేషన్ డీఈ ఆర్‌కె.రెడ్డి పాల్గొన్నారు. 19చెరువులతో పాటు, రాళ్లపాడు, మోపాడు రిజర్వాయరులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణరావు, తహసీల్దార్ కోటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ అధికారులు, వీఆర్‌వోల ఉన్నారు.

● వింజమూరు: మండల కార్యాలయ ప్రాంగణంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులకు, పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఇరిగేషన్ డీఈ రమణారావు శిక్షణ ఇచ్చారు.

సమస్యలపై ఎమ్మెల్యే స్పందన హర్షణీయం

ఉదయగిరి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో వివరించడం అభినందనీయమని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పూర్తిచేసి ఫ్లోరైడ్ పీడిత ప్రాంత వాసులకు శుద్ధిజలం అందించాలని, పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయాన్ని అభివృద్ధి చేయాలని, సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తిచేయాలని, కోల్డ్‌స్టోరేజీలు నిర్మించాలని, సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయాలని, ఉదయగిరి-నందవరం రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోరడం సంతోషకరమన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యేలు సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పిన దాఖలాల్లేవని పేర్కొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.11.34లక్షలు

వలేటివారిపాలెం. నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి శనివారం భక్తుల నుండి రూ. 11.34 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ

అల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం జనసేన నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీక్ శర్మ, రాఘవయ్య, మల్లికార్జున, నాగేశ్వరరావు చేపూరు స్రుబమణ్యం, విజయ్, కేశవాచారి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వలేటివారిపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుమందు దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన బడేవారిపాలెం, పోకూరు, వలేటివారిపాలెంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలు, బడేవారిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలోని ఎరువులను ఏఓ హేమంత్‌భరత్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ప్రయివేట్ డీలర్లు దుకాణాల ముందు డీలర్, షాపు పేరు, లైసెన్స్ నెంబరు అడ్రస్ బోర్డు పెట్టాలని, ఎంఆర్‌పి రేట్లకే విక్రయించి రశీదులు ఇవ్వాలని తెలిపారు.

'బెస్ట్ వాకర్స్' సభ్యుల ఔదార్యం

కావలి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డయాలిసిస్ పేషెంట్ రాధాకృష్ణకు శనివారం రూ.10వేలను వన్ టౌన్ ఎస్‌ఐ జమాల్‌బాషతో అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శేషయ్య, సభ్యులు రమేష్, వెంకటేశ్వర్లు, భాస్కర్ నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

సీతారామపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా గంగవరంలో నేల వాలిన వరి పంటను శనివారం మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి పరిశీలించారు. రైతులకు త్వరగా నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ లక్ష్మీనారాయణ,రైతులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

వింజమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జ్యోతి కొండయ్య, విద్యార్థులు తదితరులు వివరించారు.



ఘనంగా అళహరి సుధాకర్ జన్మదినం

కావలి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో శనివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కేక్‌కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం పాతూరు శివాలయంలో సుధాకర్ పేరుతో పూజలు నిర్వహించి తాళ్లపాలెం అనాథాశ్రమంలో నిత్యావర సరుకులు పంపిణీ చేసి పిల్లలకు కేక్‌లు, మిఠాయిలు, భోజన ప్యాకెట్లు పంచిపెట్టారు. మధ్యాహ్నం పార్టీ కార్యాలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పసుపులేటి బాబు, అగస్టీన్, తిరుమలశెట్టి, వెంక టేష్, వెంకట్ యాదవ్, వీర మహిళలు కొప్పుల లక్ష్మీ, హేలన, సాహితి, మాధురి, ప్రసన్న పాల్గొన్నారు.



కావలి: కేక్‌కట్ చేస్తున్న జనసేన శ్రేణులు

● రోగులకు పండ్లు పంపిణీ

అల్లూరు: అళహరి సుధాకర్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం జనసేన నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీక్ శర్మ, రాఘవయ్య, బుర్రి మల్లికార్జున, నాగేశ్వరరావు చేపూరు స్రుబమణ్యం, కత్తి విజయ్, కేశవాచారి పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

ఏఎస్ పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు గురించి వివరించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో టిఓటిలు దామోదర్, షేక్ సయ్యద్ బాబా, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసిలు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు శ్రీకొలను విద్యార్థులు ఎంపిక

ఏఎస్ పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు శ్రీకొలను జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్‌ఎం నిరంజన్ తెలిపారు. శనివారం విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు థామస్ పీటర్‌ను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చెర్మన్ మాధవరెడ్డి, విద్యార్థినుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండబిట్రగుంటలో అన్నదాత సుఖీభవ

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక పాఠశాలలో మద్దులూరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు నరసింహారావు, జయమ్మ హాజరై పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ మెంబరు మాలకొండారెడ్డి, అల్లూరు ఎంఈవోలు సుమతి, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధికి కృషి చేయాలి

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు కృషి చేయాలని రైల్వేప్రాంత అభివృద్ధి అసోసియేషన్ సభ్యులు చల్లా నరహరి కోరారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడ సౌత్‌సెంట్రల్ రైల్వేలో ఎక్కడ లేనంత విశాల రైల్వే భూములు బిట్రగుంట ప్రాంతంలోనే ఉన్నాయన్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే రైల్వే ఆస్తులను సద్వినియోగం చేసుకుంటే రైల్వేశాఖకు ఖర్చు తగ్గడంతో పాటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ఉదయగిరి రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లిలో శనివారం సీతా రాముల కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు తరలి వచ్చి కనులారా తిలకించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. రాత్రి స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు.



● సంగం (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి జ్వాలా తోరణం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకామాక్షిదేవి, సంగమేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వంచారు.

రికార్డులు సరిలేని ఎరువుల తాత్కాలిక సీజ్

● కందుకూరులో రెండోరోజూ కొనసాగిన తనిఖీలు

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువుల, విత్తన విక్రయ దుకాణాలపై వ్యవసాయశాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీలు శనివారం కూడా కొనసాగాయి. కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు ఆధ్వర్యంలో కందుకూరు ఏఓ రాము, ఇతర అధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధారమణ ఫర్టిలైజర్స్‌లో స్టాకు రిజిష్టర్, ఈ పాస్ మిషన్‌లోని నిల్వలు సరిపోలేదని గుర్తించి 5.95 మెట్రిక్ టన్నుల యూరియా, 8.7 మెట్రిక్ టన్నుల 20-20-0-13 ఎరువులను, 60 కిలోల 13-0-45, 60 కిలోల 19-19-19 రకం ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ సీజ్ చేసినట్లు ఏఓ రాము తెలిపారు.


స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఈ సందర్భంగా కావలి ఏడీఏ నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు ఎరువుల డీలర్లు ఎంఆర్పీకు ఎరువులు విక్రయించాలని, విధిగా రసీదు ఇవ్వాలని, బిల్లు పుస్తకంపై సంతకాలు తీసుకోవాలన్నారు. రైతుల బయోమెట్రిక్ ఆధారంగా ఎరువులు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. రైతులు కూడా విధిగా రసీదు అడిగి తీసుకోవాలని, సమస్యను మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కామేపల్లిలో మహిళా కండక్టర్‌పై దాడి చేసిన పత్తిపాటి హరిబాబును కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ డిమాండ్ చేశారు. కందుకూరు ఏరియా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న కండక్టర్ సీహెచ్ సుభాషిణిని సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్‌పై దాడికి పాల్పడటం విచారకరం అన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్.వెంకటరావు, ఎస్కే యాసిన్, మాలకొండయ్య, సురేష్‌బాబు, బాలకోటయ్య, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆదినారాయణ, డీవై కొండలు, బాబూరావు, మహేష్, ఎంఎస్ఎన్ రాజు, రామారావు ఉన్నారు.


కండక్టర్‌ను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల కళాశాలలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రీయ బాల ఆరోగ్య స్వస్థ్య కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వెంటనే చికిత్సలు అందించి మేజర్ ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి తదుపరి చికిత్సల కోసం స్పెషలైజ్డ్ వైద్యశాలలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రెండవ వైద్యాధికారి అశోక్, ఎంఈవో జానకిరామ్, ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.


విద్యార్థినితో వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

రాళ్లపాడు సమస్యల పరిష్కారానికి 18న ధర్నా

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం ఏరియా కార్యదర్శులు వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, రాళ్లపాడు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాకుమాని మాధవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడుకు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని, ఉత్తర కాలువను వెడల్పు చేయాలని, రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువను పొడిగించాలని, చేపల మాఫియాను అరికట్టాలని, కలుషిత నీటిని శుభ్రం చేయాలని, ప్రాజెక్టు నిర్వహణను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకతీతంగా రైతుసంఘాలు, వివిధ ప్రజాసంఘాలు నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.